


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 341

శనివారం 2-3-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పర్యావరణం



సరోజ్ బెన్, జరీనా, ముంతాజ్‌లాంటి సామాన్య మహిళలు తమలాంటి సామాన్యుల కోసం వాయు కాలుష్యంపై ఢిల్లీ గల్లీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోర్టబుల్ ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) మానిటర్‌లతో 'వాయు కాలుష్య నివారణకు మన వంతుగా చేయాల్సింది' అనే అంశంపై ప్రచారం చేస్తున్నారు...

ఏక్యూఐ ఉమెన్ అంబాసిడర్

ఢిల్లీలోని నందనగిరి ప్రాంతం.

చేతిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) మానిటర్‌తో 39 సంవత్సరాల సరోజ్ బెన్ ఇద్దరు ముగ్గురు మహిళలతో మాట్లాడుతున్నప్పుడు 'విషయం ఏమిటీ?' అని అడుగుతూ మరో ఇద్దరు మహిళలు, ఆ తరువాత మరో ముగ్గురు మహిళలు వచ్చారు.

అడిగిన వారికల్లా ఓపిగ్గా చెబుతోంది సరోజ్.

'మీ ఏరియాలో వాయుకాలుష్యం ప్రమాదకరమైన స్థాయిలో ఉంది...' అంటూ ప్రారంభించి ఆ సమస్య తలెత్తడానికి కారణాలు, దీని ప్రభావం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, నివారణ చర్యలు... మొదలైన వాటి గురించి చెబుతూ పోయింది.

'మీరు గవర్నమెంట్ ఆఫీసరా?' అని ఎవరో అడిగారు.

'కాదమ్మా, నేనూ నీలాగే గృహిణిని. పెరుగుతున్న వాయుకాలుష్యం గురించి బాధపడి, కాలుష్య నివారణకు నా వంతుగా ఏదైనా చేయాలని ఇలా వీధులు తిరుగుతున్నాను' అని చెప్పింది సరోజ్.

సరోజ్ బెన్ మాత్రమే కాదు గ్రాస్‌రూట్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' కమ్యూనిటీ మూమెంట్ 'హెల్ప్ ఢిల్లీ బ్రీత్' ప్రభావంతో ఎంతోమంది సామాన్య మహిళలు వాయు కాలుష్యంపై అవగాహన చేసుకున్నారు. తమలాంటి వారికి అవగాహన కలిగించడానికి వాడ వాడా తిరుగుతున్నారు.

కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి, సాధారణ పౌరుల్లో వాయు కాలుష్యంపై అవగాహన కలిగించడానికి మహిళా హౌజింగ్ ట్రస్ట్, హెల్ప్ ఢిల్లీ బ్రీత్ సంస్థలు సామాన్య మహిళలకు శిక్షణ ఇస్తున్నాయి. పోర్టబుల్ ఏక్యూఐ మానిటర్‌లతో ఢిల్లీలోని గల్లీలు తిరుగుతూ వాయుకాలుష్య నివారణపై ప్రచారం నిర్వహిస్తున్న ఈ మహిళలు 'ఏక్యూఐ ఉమెన్ అంబాసిడర్'లుగా గుర్తింపు పొందారు.

ఏక్యూఐ అంబాసిడర్‌లు హెల్ప్ ఢిల్లీ బ్రీత్, మహిళా హౌజింగ్ ట్రస్ట్ నిర్వహించే సమావేశాలకు హాజరు కావడమే కాదు ప్రచార వ్యూహాల గురించి కూడా ఒకరితో ఒకరు చర్చించుకుంటారు. 'కమ్యూనిటీ యాక్షన్ గ్రూప్'గా ఏర్పడి సమాచారాన్ని ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటారు.

'వాయు కాలుష్యం గురించి కొద్దిసేపు మీతో మాట్లాడాలనుకుంటున్నాను అని ఒక గృహిణితో అన్నప్పుడు నా ముఖం మీద తలుపు వేసినంత పనిచేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకున్నాను. ఈసారి అలా కాదు ఇలా చేయాలనుకున్నాను. ఢిల్లీలోని నెహ్రూ నగర్‌కు వెళ్లినప్పుడు నా బ్యాగులో ఉన్న కొన్ని పోస్టర్‌లను ఆమెకు చూపాను. అవి చూసి అయ్యో ఏమిటి ఇది అన్నట్లుగా అడిగింది. అలా మెల్లగా టాపిక్‌ను మొదలుపెట్టాను. ఆమె చాలా శ్రద్ధగా విన్నది. పరిస్థితులను బట్టి ఏ రూట్‌లో వెళ్లాలో అప్పటికప్పుడు నిర్ణయించుకుంటే సమస్య ఉండదు' అంటుంది సీమ అనే ఏక్యూఐ అంబాసిడర్.

'ఉపన్యాసం ఇచ్చినట్లు కాకుండా మన ఇంటి పరిసరాల్లో ప్రమాదం పొంచి ఉంటే ఎలా చెబుతామో అలా వాయు కాలుష్యం గురించి చెబుతాను. ఉదాహరణలతో అర్థమయ్యేలా చెబుతాను. పెద్దవాళ్లకే సాధ్యం కాని పెద్ద సమస్య ఇది. మన వల్ల ఏమవుతుంది... అని కొందరు అంటారు. మీలా అందరూ అనుకోవడం వల్లే అది పెద్ద సమస్యగా మారింది అని నేను అంటాను. మొదటగా మీరు చేయాల్సింది మీ పెరట్లో ఒక మొక్క నాటడం అని సలహా ఇస్తాను. నేను చెప్పింది వారికి నచ్చినట్లు వారి హావభావాలను బట్టి గ్రహిస్తాను' అంటుంది ఏక్యూఐ అంబాసిడర్ ముంతాజ్.

ఏక్యూఐ అంబాసిడర్‌ల కృషి వృథా పోవడం లేదు. ఇప్పుడు ఎంతో మంది కాలుష్యాన్ని నియంత్రించే చర్యల గురించి నిర్మాణాత్మకంగా మాట్లాడుతున్నారు. వారు పెద్ద చదువులు చదుకున్నవారేమీ కాదు. సామాన్య మహిళలు. ఏక్యూఐ అంబాసిడర్‌ల విజయానికి ఇది ఒక ఉదాహరణ.

మార్పు మొదలైంది...



జరీనా ప్రతిరోజూ ఏక్యూఐ మానిటర్‌తో ఉదయం, సాయంత్రం వివిధ ప్రాంతాలలో పొల్యూషన్ లెవెల్స్‌ను చెక్ చేస్తుంది. 'కొన్నిసార్లు కాలుష్యం తక్కువగా, మరికొన్నిసార్లు ఎక్కువగా ఉంటుంది. కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు ఏక్యూఐ మానిటర్‌పై ఎరుపు రంగు కనిపిస్తుంది. కొత్త సంఖ్యలు కనిపిస్తాయి. ఒకప్పుడు వాయుకాలుష్యం గురించి పెద్దగా ఆలోచించేవారు కాదు. అయితే ఇప్పుడు చాలామందిలో మార్పు రావడాన్ని గమనించాను' అంటుంది జరీనా.

ఏక్యూఐ అంబాసిడర్ అయిన జరీనా వాయునాణ్యత, వెంటిలేషన్, బొగ్గు పొయ్యిలకు దూరంగా ఉండడం... మొదలైన అంశాలపై ఢిల్లీ గల్లీలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది.

ఇలా కూడా...

వాడ వాడలా తిరుగుతూ వాయుకాలుష్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాదు లేబర్ కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్, సుమన్ యోజనలాంటి ప్రభుత్వ సామాజిక, సంక్షేమ పథకాల గురించి భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు తెలియజేస్తున్నారు ఏక్యూఐ అంబాసిడర్‌లు. స్కీమ్‌కు సంబంధించిన పత్రాలు నింపడం నుంచి ఐడీ కార్డులు వారికి అందేలా చేయడం వరకు ఎన్నో రకాలుగా సహాయం అందిస్తున్నారు.

సీజన్

మార్చి వచ్చింది.. బోండాం కొట్టు..



'కొబ్బరి నీళ్ల జలకాలాడి
కోనాసీమ కోకాగట్టి'...
అని రాశాడు వేటూరి.

కొబ్బరి నీళ్లతో జలకాలాడే భాగ్యం సామాన్యుడికి లేదు. పూర్వం కొన్ని బావుల్లో నీళ్లు కొబ్బరి నీళ్లలా అనిపించేవి. జనానికి ఆ బావి ఫేవరెట్‌గా ఉండేది. 'ఎన్ని ఫ్యాన్లున్నా ఒక్క ఏసీకి సమానం కావు గందా' అని ముళ్లపూడి వెంకట రమణ అన్నట్టు ఎన్ని బిస్లరీ బాటిళ్ల నీళ్లైనా ఒక్క కొబ్బరిబోండాంకు సమానం కావు. సృష్టి మొత్తం మీద గర్భాన తియ్యటి, శుభ్రమైన నీళ్లను దాచుకున్న కాయ కొబ్బరికాయ మాత్రమే. పండ్ల రసాలు తయారు చేసేటప్పుడు ఏదో ఒక మేరకు ఇన్ఫెక్ట్ కావచ్చు. కాని కొబ్బరినీళ్లను కలుషితం చేయలేము. అందుకే వేసవి వచ్చిందంటే ఎండలో కాయకష్టం చేసేవారికి, రోజంతా రోడ్ల పై తిరిగే సన్న జీవులకి, కార్లలో తిరిగే కలిగిన వారికీ కూడా కొబ్బరినీళ్లు ప్రాణధార.

అదేమిటోకాని కొన్ని విషయాలు విశ్వామిత్రుడి అకౌంట్‌లో పడ్డాయి. పౌరాణిక విశ్వాసాల ప్రకారం కొబ్బరికాయ బ్రహ్మదేవుని సృష్టి కాదట. విశ్వామిత్రుడిది అట. ఎవరు సృష్టించినా భారతీయులకు కొబ్బరికాయ లేకుండా పూట గడవదు. భక్తి కలిగిన వారికి పూజల్లో, జఠరాగ్ని కలిగిన వారికి వంటల్లో కొబ్బరి తప్పనిసరిగా ఉండాల్సిందే. మరి మార్చి వచ్చిందంటే గెలలు గెలలుగా దిగే కాయ కత్తికి సర్రున తెగుతూ తన నీటితో జిహ్వకు జీవం పోస్తుంది. కాని కొబ్బరి నీళ్ల గురించి కొన్ని వివరాలు తెలుసుకొని ఉండి వాటిని సేవించడం మంచిది.

ప్రయోజనాలు: కొబ్బరి నీళ్లు పోషకాలు, ఎలక్ట్రోలైట్లను ఇస్తాయి. ఒక రకంగా కొబ్బరి నీళ్లు నోటి ద్వారా ఒంట్లో చేరే సెలైన్‌బాటిల్‌తో సమానం. మన శరీరానికి రోజుకు కనీసం 280 మిల్లిగ్రాముల సోడియం కావాలి. ఒక కొబ్బరి బోండాంలో దాదాపు 300 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది. అంటే శరీరానికి కావాల్సిన సోడియం రోజుకు సరిపడా అందినట్టే. ఇక పొటాషియం, కాల్షియం, ఫాస్ఫరస్ కూడా సమృద్ధిగా ఉంటాయి. అందుకే కొబ్బరినీళ్లు ఉత్తమ లవణ జలం. వీటిని మధ్యాహ్న భోజనానికి ఒక గంట ముందు, లేదా సాయంత్రం వేళల్లో తీసుకుంటే మంచిది. వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి కొబ్బరినీళ్లు ఉత్తమ సహాయకారి. ఎండల్లో వాంతులు, విరేచనాలు అవుతుంటే కొబ్బరినీళ్లను మెల్లమెల్లగా ఎక్కువసేపు తాగితే శరీరం పుంజుకుంటుంది. ఎండ వల్ల చర్మం టాన్ అయితే కొబ్బరినీళ్లతో బాగా రుద్దితే ఆ టాన్ పోతుంది. ముఖంపై మొటిమలు ఉంటే కొబ్బరినీళ్లలో ముంచిన దూదితో శుభ్రం చేస్తే అవి పోతాయి. వేసవిలో చెమట వల్ల వచ్చే దుర్వాసన పోవాలంటే కొబ్బరినీళ్లు తాగాలి. జీర్ణక్రియకు మంచిది. కొబ్బరినీళ్లలో ఉన్న పొటాషియం బీపీని నియంత్రించడానికి, కిడ్నీల పని తీరుకు తోడ్పడుతుంది. కొబ్బరి నీళ్లలో యాలకుల పొడి చిటికెడు వేసుకుని తాగితే అరికాళ్లలో మంటలు తగ్గుతాయి. 'దేహమే దేవాలయం' అన్నారు. దేవాలయంలో కొబ్బరికాయ కొడితే ఏ ఆధ్యాత్మిక ఫలితాలు కలుగుతాయో, కొబ్బరినీళ్లు తాగితే దేహమనే దేవాలయానికి అవే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

బ్యూటిప్స్



పిగ్మెంటేషన్... కీరాతో కట్



అరకప్పు కీరదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి పట్టించి 20 నిమిషాల పాటు ఆరనిచ్చిన తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేయాలి. కీరదోస పిగ్మెంటేషన్ సమస్యను దూరం చేస్తుంది. దీనివల్ల ముఖంపైన ముడతలు, సన్నని చారలు వంటి సమస్యలు దూరం అవుతాయి.

బార్లీతో మేని మిలమిల



ఒక పాత్రలో బార్లీ గింజల పొడిని తీసుకుని అందులో కొద్దికొద్దిగా గోరువెచ్చటి నీళ్లు పోసుకుంటూ ముద్దలా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. పావుగంట తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచు చేస్తే.. మచ్చలు, మృత కణాలు తొలగిపోయి చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది.

మిరియాలతో చుండ్రుకు చెక్!



మిరియాలు ఆరోగ్యానికెంతో మేలు చేస్తాయని అందరికీ తెలుసు. అయితే ఆరోగ్యానికే కాదు జుట్టు సంరక్షణకు సైతం మిరియాలు ఉపయోగపడతాయి. ముఖ్యంగా చుండ్రు సమస్యను చాలా సులువుగా పోగొట్టే సత్తా మిరియాలకు ఉంది. ఇందుకోసం ఒక ఉల్లిపాయను తీసుకుని పొట్టు తీసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. వీటిని మిక్సీజార్‌లో వేసి వీటితోపాటు టేబుల్ స్పూన్ నల్ల మిరియాలు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న మిశ్రమం నుంచి జ్యూస్‌ను సపరేట్ చేసుకోవాలి. ఇప్పుడు ఈ జ్యూస్‌లో టేబుల్ స్పూన్ ఆవనూనె, టేబుల్ స్పూన్ అలోవెరా జెల్ వేసుకుని అన్నీ కలిసేలా బాగా కలుపుకోవాలి. దీంతో ఒక హెయిర్ టానిక్ రెడీ అవుతుంది. ఈ టానిక్‌ను మాడుకు పట్టించి 10 నిమిషాల పాటు మసాజ్ చేసుకోవాలి. గంట తర్వాత మైల్డ్‌షాంపూతో శుభ్రంగా తలస్నానం చేయాలి. ఇలా చేస్తే ఎంత తీవ్రంగా ఉన్న చుండ్రు అయినా మాయం అవడంతోపాటు తెల్ల జుట్టు త్వరగా రాకుండా ఉంటుంది. జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.

• రోటరీ సర్వీస్

మాది సమష్టి సేవ



ప్రభుత్వం అన్నీ చేస్తుంది... కానీ!
చేయాల్సినవి ఇంకా ఎన్నో ఉంటాయి.
సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు అన్నం పెడుతుంది ప్రభుత్వం.
చెప్పుల్లేకపోతే వచ్చే వ్యాధులను అరికట్టేదెవరు?
స్కూలు భవనం కదుతుంది ప్రభుత్వం.
ప్రహరీలు... టాయిలెట్‌లను మరచిపోతుంటుంది.
హాస్పిటళ్లను కట్టిస్తుంది ప్రభుత్వం.
వైద్యపరికరాల్లో వెనుకబడుతుంటుంది.
'ప్రభుత్వం చేయలేని పనులు చేయడమే మా సేవ' అంటున్నారు రోటరీ క్లబ్ గవర్నర్ డా.శంకర్‌రెడ్డి.

'మనది పేద ప్రజలున్న దేశం. ప్రభుత్వాలు ఎంత చేసినా ఇంకా కొన్ని మిగిలే ఉంటాయి. ఆ ఖాళీలను భర్తీ చేయడానికి ముందుకు వచ్చే వాళ్లందరం సంఘటితమై చేస్తున్న సేవలే మా రోటరీ క్లబ్ సేవలు' అన్నారు బుసిరెడ్డి శంకర్‌రెడ్డి. ఒక రైతు తన పొలానికి నీటిని పెట్టుకున్న తర్వాత కాలువను పక్కపొలానికి మళ్లిస్తాడు. అంతే తప్ప నీటిని వృథాగా పోనివ్వడు. అలాగే జీవితంలో స్థిరపడిన తర్వాత సమాజానికి తిరిగి ఇవ్వాలి. అప్పుడే జీవితానికి సార్థకత అన్నారు. సమాజానికి తమ సంస్థ అందిస్తున్న సేవల గురించి సాక్షితో పంచుకున్నారాయన.

'కష్టపడడమే విజయానికి దారి'... ఇందులో సందేహం లేదు. కష్టపడి పైకి వచ్చిన వారిలో సేవాగుణం కూడా ఉంటుంది. నేను 1994లో మెంబర్‌షిప్ తీసుకున్నాను. అప్పటి నుంచి మా సీనియర్‌ల సర్వీస్‌ను చూస్తూ మేము ఇంకా వినూత్నంగా ఏమి చేయవచ్చనే ప్రణాళికలు వేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. సర్వీస్‌లో ఉండే సంతోషాన్ని ఆస్వాదిస్తున్నాను. చదువుకునే పిల్లవాడికి పెన్ను ఇవ్వడం కూడా చాలా సంతృప్తినిస్తుంది. ఆ పెన్ను అందుకునేటప్పుడు పిల్లల కళ్లలో చిన్న మెరుపు, ముఖంలో సంతోషం... ఇవి చాలు ఈ జీవితానికి అనిపిస్తుంది. నేను స్కూళ్ల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టడానికి కారణం కూడా అదే. మంచినీటి సౌకర్యం లేని స్కూళ్లలో ఆర్‌వో ప్లాంట్, కొన్ని స్కూళ్లకు టాయిలెట్‌లు, హ్యాండ్ వాష్ స్టేషన్‌లు, తరగతి గదుల నిర్మాణం, క్లాస్‌రూమ్‌లో బెంచీలతో మొదలైన మా సర్వీస్‌లో ఇప్పుడు పిల్లల ఆరోగ్యం ప్రధానంగా మారింది. ఎందుకంటే ప్రభుత్వ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లలో ఉండే పిల్లలకు ప్రభుత్వం కొంతవరకు సౌకర్యాలు కల్పిస్తుంది. కానీ అప్పటికప్పుడు తీర్చాల్సిన అవసరాలకు నిధులుండవు. వాటిల్లో ప్రధానమైనది ఆరోగ్యం. వాతావరణం మారిన ప్రతిసారీ పిల్లల మీద దాడి చేయడానికి సీజనల్ అనారోగ్యాలు పొంచి ఉంటాయి. మీరు ఊహించగలరా పాదాలకు సరైన పాదరక్షలు లేకపోవడం వల్ల చలికాలంలో పిల్లలు అనారోగ్యం బారిన పడతారు. నులిపురుగుల కారణంగా అనారోగ్యాల పాలవుతారు. హాస్టల్ ఆవరణలో కూడా చెప్పులతో తిరగాలని చెప్పడంతోపాటు మంచి బూట్లు ఇవ్వడం వరకు రోటరీ క్లబ్ ద్వారా చేస్తున్నాం. బూట్లు కూడా మంచి బ్రాండ్‌వే. లోటో కంపెనీ షూస్ మార్కెట్‌లో కొనాలంటే రెండు వేలవుతాయి. ఆ కంపెనీతో మాట్లాడి వారి సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) ప్రోగ్రామ్ కింద మూడు వందల లోపు ధరకే తీసుకున్నాం. మేము సర్వీస్ కోసం చేసే ప్రతి రూపాయి కూడా నేరుగా ఆపన్నులకే అందాలి. కమర్షియల్‌గా వ్యాపారాన్ని పెంపొందించే విధంగా ఉండదు. పిల్లలకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించడం వల్ల చాలామంది పిల్లల్లో కంటిచూపు సమస్యలున్నట్లు తెలిసింది. ప్రభుత్వం కంటి సమస్యల కోసం పెద్ద ఎత్తున వైద్యశిబిరాలు నిర్వహించినప్పటికీ పిల్లల మీద దృష్టి పెట్టలేదు. రవి గాంచని చోటును కవి గాంచును అన్నట్లు... ప్రభుత్వం చూపు పడని సమస్యల మీద మేము దృష్టి పెడుతున్నాం. శంకర్ నేత్రాలయ, మ్యాక్సివిజన్, ఆస్టర్ గ్రూప్ వైద్యసంస్థలతో కలిసి పని చేస్తున్నాం.

తక్షణ సాయం!

ఆరోగ్యం, చదువుతోపాటు ప్రకృతి విలయాలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులకు తక్షణ సాయం కోసం స్థానిక కలెక్టర్‌ల నుంచి పిలుపు వస్తుంది. అలా ఇల్లు కాలిపోయిన వాళ్లకు పాత్రలు, నిత్యావసర దినుసులు, దుస్తులు, దుప్పట్లు... వంటివి ఇస్తుంటాం. మా సేవలకు స్థిరమైన నిధి అంటూ ఏదీ ఉండదు. సాధారణంగా ఇందులో సభ్యులుగా జీవితంలో ఆర్థిక స్థిరత్వాన్ని సాధించి సమాజానికి తమ వంతుగా తిరిగి ఇవ్వాలనే ఉద్దేశంతో వచ్చే వాళ్లే ఉంటారు. తక్షణ సాయానికి ఆ స్థానిక క్లబ్ సభ్యులు సొంత డబ్బునే ఖర్చుచేస్తారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం చేపట్టే కార్యక్రమాలకు మాత్రం కచ్చితంగా ప్రాజెక్టు రిపోర్ట్, కొటేషన్ సిద్ధం చేసుకుని నిధుల సమీకరణ మొదలు పెడతాం. ఇందులో మూడింట ఒక వంతు క్లబ్, ఒక వంతు దాత, ఒక వంతు ఇంటర్నేషనల్ రోటరీ ఫౌండేషన్ సహకరిస్తుంది.



• బంజారా హిల్స్ గవర్నమెంట్ స్కూల్ పిల్లలకు షూస్ పంపిణీ

ఇది సమష్టి సేవ!

రోటరీ క్లబ్ ద్వారా అందించే సేవలన్నీ సమష్టి సేవలే. ఏ ఒక్కరమూ తమ వ్యక్తిగత ఖాతాలో వేసుకోకూడదు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ కలిపి మా పరిధిలో 113 క్లబ్‌లున్నాయి. ఎక్కడి అవసరాన్ని బట్టి అక్కడి సభ్యులు స్పందిస్తారు. సమష్టిగా నిర్ణయం తీసుకుంటాం. ఇక నా వ్యక్తిగత వివరాల విషయానికి వస్తే... మాది భద్రాచలం దగ్గర రెడ్డిపాలెం. పూర్వీకులు ఆంధ్రప్రదేశ్, పల్నాడు జిల్లా నర్సరావు పేట నుంచి భద్రాచలానికి వచ్చారు. సివిల్ కాంట్రాక్టర్‌గా ఐటీసీ భద్రాచలం పేపర్ బోర్డ్‌కు సర్వీస్ ఇస్తున్నాను. మా ఊరికి నేను తిరిగి ఇస్తున్నది నీటి వసతి. పేపర్ మిల్లు నుంచి వెలువడే వాడిన నీటిని మా ఊరి పంట పొలాలకు అందించే ఏర్పాటు కొంత వరకు పూర్తయింది. పైప్‌లైన్ పని ఇంకా ఉంది. మేము గోదావరి తీరాన ఉన్నప్పటికీ నది నుంచి మాకు నీళ్లు రావు. గ్రామాల్లో విస్తృతంగా బోర్‌వెల్స్ వేయించాం. బూర్గుంపాడులో నేను చదువుకున్న స్కూల్‌కి ఆర్‌వో ప్లాంట్ నా డబ్బుతో పెట్టించాను. 'ఇవ్వడం'లో ఉండే సంతృప్తి మాత్రమే మా చేత ఇన్ని పనులు చేయిస్తోంది. నాకు అరవై దాటాయి. కుటుంబ బాధ్యతలు పూర్తయ్యాయి. మా అమ్మాయి యూఎస్‌లో ఉంది, అబ్బాయి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఇక నేను సర్వీస్ కోసం చేస్తున్న ఖర్చు గురించి నా భార్య అన్నపూర్ణ ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. కొన్ని కార్యక్రమాలకు నాతోపాటు తను కూడా వస్తుంది. కాబట్టి సమాజంలో ఉన్న అవసరతను అర్థం చేసుకుంది, నన్ను కూడా అర్థం చేసుకుంది. కాబట్టే చేయగలుగుతున్నాను'' అని వివరించారు రొటేరియన్ డాక్టర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి.

శ్రీమంతులకు స్వాగతం!

జీవితంలో సుసంపన్నత సాధించిన వారిలో చాలా మందికి సొంత ఊరికి ఏదైనా చేయాలని ఉంటుంది. తాము చదువుకున్న స్కూల్‌ను అభివృద్ధి చేయాలని ఉంటుంది. అలాంటి శ్రీమంతులకు నేనిచ్చే సలహా ఒక్కటే. మా సర్వీస్ విధానంలో 'హ్యాపీ స్కూల్' కాన్సెప్ట్ ఉంది. ఒక పాఠశాలను హ్యాపీ స్కూల్‌గా గుర్తించాలంటే... కాంపౌండ్ వాల్, పాఠశాల భవనం, డిజిటల్ క్లాస్ రూములు, నీటి వసతి, టాయిలెట్‌లు ఉండాలి. అలా తీర్చిదిద్దడానికి 90 లక్షలు ఖర్చవుతుందనుకుంటే ముప్పై లక్షలతో ఒక దాత వస్తే, మా రోటరీ క్లబ్, అంతర్జాతీయ రోటరీ ఫౌండేషన్ నిధులతో పూర్తి చేయవచ్చు. గతంలో ఏపీలో కూడా మేము చాలా పాఠశాలలను దత్తత తీసుకున్నాం. ఇప్పుడు అక్కడ ప్రభుత్వమే అన్నీ సమకూరుస్తోంది. అక్కడ మా అవసరం లేదు. మాకు సర్వీస్ చేసే అవకాశమూ లేదు. తెలంగాణలో గడచిన ప్రభుత్వం పాఠశాలల మీద దృష్టి పెట్టకపోవడంతో మేము చేయగలిగినంత చేస్తూ వస్తున్నాం. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇటీవల హైదరాబాద్ నగరం, మెట్రో రైల్వే స్టేషన్‌లలో 65 వాటర్ కూలర్‌లనిచ్చాం. నీలోఫర్, ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌కి వైద్యపరికరాలు, స్పర్శ్ పేరుతో క్యాన్సర్ బాధితులకు పాలియేటివ్ కేర్, కొన్ని హాస్పిటళ్లకు అంబులెన్స్‌లు ఇచ్చింది రోటరీ క్లబ్. ఇక ఆలయాల్లో పూజలకు అన్ని ఏర్పాట్లూ ఉంటాయి. కానీ భక్తులకు సౌకర్యాలు పెద్దగా ఉండవు. మా భద్రాచలం, పర్ణశాలలో టాయిలెట్లు, భక్తులు దుస్తులు మార్చుకోవడానికి గదుల నిర్మాణం... ఇలా మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ ఉన్నాం.

– వాకా మంజులా రెడ్డి
ఫొటో: గడిగె బాలస్వామి

శనివారం 2-3-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 341



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



ఆరేళ్ల తర్వాత..

మహిళా క్రికెటర్ల కోసం రెడ్ బాల్ టోర్నీ 28 నుంచి పుణేలో నిర్వహణ - 11లో



సరికొత్త శిఖరాలపై సూచీలు

అమెరికాలో దిగివచ్చిన ద్రవ్యోల్బణం.. ర్యాలీకి లార్జ్ క్యాప్ షేర్ల దన్ను - 11లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బెంగళూరు కేఫ్‌లో పేలుడు

బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం ఐఈడీ బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 9 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



'మోదీ గ్యారంటీల'తో గెలుస్తాం

మోదీ గ్యారంటీలతో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 400కు పైగా సీట్లు సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

వివరాలు 6లో ▸



ముగిసిన నావల్నీ అంత్యక్రియలు

దశాబ్దాల పుతిన్ పాలనపై విమర్శలు ఎక్కుపెట్టిన నిరసన గళం, రష్యా విపక్ష నేత అలెక్సీ నావల్నీ అంత్యక్రియలు ముగిశాయి.

వివరాలు 6లో ▸



బంగ్లాదేశ్‌లో అగ్ని ప్రమాదం

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఏడంతస్తుల షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదం జరిగి 46 మంది సజీవ దహనం అయ్యారు.

వివరాలు 6లో ▸

తలరాతలు తిరగరాస్తూ..

చదువులు చక్కదిద్దేందుకు ఏకంగా రూ.73,000 కోట్లు వెచ్చించాం: సీఎం జగన్

ఇది మానవ వనరులపై మూలధన పెట్టుబడి.. భావి తరాల భవితకు బలమైన పునాది

- తరతరాల పేదరికం సంకెళ్లను తెంచేసే గొప్ప కార్యక్రమం
- ఇంగ్లిష్ మీడియం, బైజూస్ కంటెంట్, డిజిటల్ బోధనతో నాణ్యమైన చదువులు
- ఆన్‌లైన్ కోర్సులు అందించేలా అంతర్జాతీయ వర్సిటీలతో ఒప్పందం
- మన చదువుల ఘనతకు ఐరాసలో చిట్టి చెల్లెమ్మల ప్రసంగాలే నిదర్శనం
- జగన్ అనే ఒక్కడు పక్కకు తప్పుకుంటే జరిగే నష్టం ఏమిటన్నది ప్రతి ఒక్కరూ ఆలోచించాలి
- జగనన్న విద్యాదీవెనతో తల్లుల ఖాతాల్లోకి రూ.708.68 కోట్లు
- కృష్ణా జిల్లా పామర్రులో బటన్ నొక్కి ఖాతాల్లోకి జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఒక్క విద్యా దీవెన, వసతి దీవెనతో దాదాపు రూ.18 వేల కోట్లు లబ్ధి

2లో



కృష్ణా జిల్లా పామర్రులో జగనన్న విద్యాదీవెన చెక్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

14 ఏళ్లు, మూడు దఫాలు సీఎంగా ఉన్న చంద్రబాబు పేద పిల్లలకు చేసిన మంచి ఏమిటి? వారి భవిష్యత్తు మార్చాలని మీ అన్న చూపించిన తాపత్రయంలో కనీసం ఒక్క శాతమైనా చూపించారా? ఆయన చేసిన మంచేమిటి అంటే ఏ ఒక్కరికీ ఏదీ గుర్తురాదు. కానీ చంద్రబాబు పేరు చెబితే విద్యారంగానికి చేసిన చెడు గురించి మాత్రం చాలా చెప్పకోవచ్చు. గవర్నమెంట్ బడిని నీరుగార్చి నారాయణ, చైతన్య సంస్థల్ని పోషించింది చంద్రబాబు. అక్కడ డబ్బులు కట్టిన వారికి మాత్రమే ఇంగ్లిష్ మీడియం, గవర్నమెంట్ బడుల్లో మాత్రం తెలుగు మీడియం అని నిర్దేశించింది చంద్ర బాబు. మంచి చేయడానికి మీ బిడ్డ, మీ అన్న నాలుగు అడుగులు ముందుకేస్తే 8 అడుగులు వెనక్కు లాగాలని ప్రయత్నిస్తున్న మారీచులతో యుద్ధం చేస్తున్నాం. వాళ్లు చేస్తున్న యుద్ధం కేవలం జగన్‌తో కాదు! జగన్ అనే ఒక్కడు పక్కకు తప్పుకుంటే జరిగే నష్టం ఏమిటన్నది ప్రతి ఇంట్లో ప్రతి తల్లి, ప్రతి తండ్రి, ప్రతి పాప, పిల్లాడు ఆలోచన చేయాలి.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఫ్యాక్ట్‌చెక్

డీఎస్సీపై దగాకోరు రాతలు

- ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై రామోజీ కుటిల కథనం
- ఇప్పటికీ తెలంగాణలో పోస్టింగ్స్‌కు 1998, 2008 డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణ
- అప్పటి నుంచి మురిగిపోయిన పోస్టులతో కలిపే ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్
- ఏపీలో 15,000 పోస్టులు భర్తీ చేసిన సీఎం జగన్
- వీటిలో 1998 నుంచి పోస్టింగ్స్ లేని వారికీ ఉద్యోగాలు
- తాజాగా 6,100 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్
- వీటితో కలిపితే ఏపీలో ఇచ్చిన టీచర్ ఉద్యోగాలు 21,108

10లో

చంద్రబాబు, మహాసేన రాజేశ్‌లకు ధన్యవాదాలతో...

ఇట్లు.. నర్రెడ్డి సునీత



- సునీత ఢిల్లీ ప్రెస్‌మీట్‌తో తొలగిన ముసుగు.. వివేకా హత్య వెనుక ఉన్నది ఎల్లో గ్యాంగే
- మెజార్టీ ఉన్నా వివేకాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన పచ్చ ముఠా
- వివేకా ఉంటే జిల్లాలో రాజకీయ మనుగడ ఉండదని టీడీపీ భయం
- వైఎస్సార్‌సీపీకి ఓటేయొద్దంటూ అసలు స్వరూపం బయటపెట్టుకున్న సునీత

8లో



విజయసాయిరెడ్డి (నెల్లూరు) | మురుగుడు లావణ్య (మంగళగిరి) | ఇంతియాజ్ (కర్నూలు)

నెల్లూరు వైఎస్సార్‌సీపీ లోక్‌సభ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి

అసెంబ్లీ సమన్వయకర్తలుగా కర్నూలుకు ఇంతియాజ్, మంగళగిరికి మురుగుడు లావణ్య నియామకం

- వివరాలు 12లో

బాబు ఓకే చేస్తేనే

యాక్షన్..

- పవన్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా చంద్రబాబు ఓకే చెప్పాల్సిందే
- జనసేనకు 24 సీట్లు కేటాయించినా, ఇప్పటివరకు ఐదు మాత్రమే ఖరారు
- బాబు అభ్యంతరాలతో పవన్ పోటీచేసే నియోజకవర్గం పెండింగే.. రాజోలు, తణుకు, రాజమండ్రి రూరల్ కూడా..
- ఎన్నికలు సమీపిస్తోన్న వేళ హైదరాబాద్‌లో మకాం ఏమిటని జనసేన కార్యకర్తల ప్రశ్న

- వివరాలు 10లో




కృష్ణా జిల్లా పామర్రులో నిర్వహించిన 'విద్యా దీవెన' నగదు జమ సందర్భంగా నిర్వహించిన సభకు పోటెత్తిన విద్యార్థులు, ప్రజలు

తలరాతలు తిరగరాస్తూ..

సాక్షి ప్రతినిధి, విజయవాడ: పేదింటి పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా, తరతరాల తలరాతలను మార్చాలని గత 57 నెలలుగా మనందరి ప్రభుత్వం అడుగులు వేగంగా ముందుకు వేసిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఒక్క చదువులతోనే పేదరికాన్ని అధిగమించడం సాధ్యమని బలంగా విశ్వసించి విద్యారంగాన్ని సమూలంగా సంస్కరించినట్లు చెప్పారు. విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద, నాడు–నేడు తదితర పథకాలు, కార్యక్రమాల ద్వారా పేదల ఉన్నత చదువులకు భరోసా కల్పించామన్నారు. ప్రభుత్వ టీచర్లకు చెల్లించే జీతభత్యాలు కాకుండా పేద పిల్లలు చదువుకునేలా ప్రోత్సహిస్తూ వివిధ పథకాలు, సర్కారు స్కూళ్లను తీర్చిదిద్దేందుకు ఏకంగా రూ.73 వేల కోట్లకుపైగా వ్యయం చేసినట్లు వెల్లడించారు. పేదింటి బిడ్డల ఉన్నత చదువులకోసం ఇంతగా పరితపిస్తుంటే పెత్తందారులైన దుష్ట చతుష్టయానికి కంటగింపుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 2023 అక్టోబరు–డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి 9,44,666 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.708.68 కోట్లను సీఎం జగన్ శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో బటన్ నొక్కి నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ ఐదేళ్లుగా విద్యారంగ పురోభివృద్ధి కోసం తీసుకున్న విప్లవాత్మక చర్యలను వివరించారు.

పెద్ద చదువులు చదివే 93 శాతం పిల్లలకు లబ్ధి..

తరతరాల పేదరికం సంకెళ్లను తెంచేస్తూ పెద్ద చదువులు అనే పునాదులపై ఆకాశమే హద్దుగా పేదింటి పిల్లలు ఎదిగేందుకు దోహదం చేసే గొప్ప కార్యక్రమం ఈరోజు పామర్రు నుంచి జరుగుతోంది. వంద శాతం ఫీజులను పిల్లల తల్లులకే అందచేసి వారి ద్వారా కాలేజీలకు చెల్లించే జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని గత 57 నెలలుగా అమలు చేస్తున్నాం. ప్రతి త్రైమాసికం ముగిసిన వెంటనే క్రమం తప్పకుండా ఆ తల్లుల ఖాతాలకు ఫీజుల మొత్తాన్ని జమ చేయడం కొనసాగిస్తూ వచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చదువులు చదువుతున్న 9.45 లక్షల మంది పిల్లలకు అంటే ఏకంగా 93 శాతం మందికి జగనన్న విద్యా దీవెన ద్వారా మంచి చేస్తూ పూర్తి ఫీజులను మీ జగనన్న ప్రభుత్వమే చెల్లిస్తోంది. గతానికి, ఇప్పటికి మధ్య తేడాను ఆలోచించమని కోరుతున్నా.

ఆదాయ పరిమితిని పెంచాం..

మనం అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత మంది పిల్లలు బాగా చదివి బాగుపడాలని ఆరాటపడ్డాం. ఏ పేదవాడూ తన పిల్లల చదువుల కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదనే తపనతో ఆదాయ పరిమితిని పెంచాం. గతంలో రూ.లక్షకే పరిమితమైన ఆదాయ పరిమితిని ఏకంగా రూ.2.5 లక్షలకు పెంచి 93 శాతం మందికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా మంచి చేయగలిగాం. ఫీజులు ఇంతే కడతాం! ఇంతకన్నా ఎక్కువ కట్టాల్సి వస్తే మీ ఆస్తులు అమ్ముకోండి! మీ చావు మీరు చావండనే గత ప్రభుత్వ విధానాలకు పూర్తిగా స్వస్తి పలికాం. తల్లిదండ్రులు ఎవరూ ఇబ్బంది పడకుండా పూర్తి ఫీజులు కట్టే కార్యక్రమాన్ని మన భుజ స్కంధాలపై వేసుకున్నాం. త్రైమాసికం ముగిసిన వెంటనే తల్లుల ఖాతాల్లోకి ఫీజులు జమ చేస్తూ కాలేజీలకు అందచేసే గొప్ప సంప్రదాయానికి నాంది పలికాం. పిల్లలకు పూర్తి ఫీజులు చెల్లించే విద్యా దీవెనే కాకుండా ఖర్చుల కోసం ఇబ్బంది పడకూడదని జగనన్న వసతి దీవెన కార్యక్రమాన్ని కూడా తీసుకొచ్చి అమలు చేస్తున్నాం. తాజాగా అందిస్తున్న రూ.708 కోట్లతో కలిపి ఇప్పటిదాకా 29.66 లక్షల మందికి పిల్లలకు మంచి చేస్తూ జగనన్న విద్యాదీవెన అనే ఒక్క కార్యక్రమం ద్వారానే రూ.12,609 కోట్లు తల్లులకు అందచేశాం. జగనన్న వసతి దీవెన ద్వారా పిల్లల భోజనం, వసతి ఖర్చుల కోసం చెల్లించిన మొత్తం మరో రూ.4,275 కోట్లు ఉంటుంది. వచ్చే ఏప్రిల్‌లో వసతి దీవెన కింద విడుదల చేయనున్న మరో రూ.1,100 కోట్లు కూడా కలిపితే విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా వెచ్చిస్తున్న సొమ్ము ఏకంగా దాదాపు రూ.18 వేల కోట్లు అవుతుంది. పెద్ద చదువులు చదువుతున్న పిల్లలు బాగుపడాలి, ఆ కుటుంబాలు బాగుండాలనే సంకల్పంతో ప్రతి అడుగూ వేస్తూ వచ్చాం. మనందరి ప్రభుత్వం ప్రతి స్థాయిలోనూ విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చింది.

హ్యూమన్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్..

ప్రాథమిక స్థాయి నుంచి పెద్ద చదువుల వరకు విద్యారంగంలో వివిధ పథకాలు, కార్యక్రమాల కోసం 57 నెలల వ్యవధిలో రూ.73 వేల కోట్లు వ్యయం చేశాం. గవర్నమెంట్ టీచర్లకు ఇచ్చే జీతాల వ్యయం దీనికి అదనం. ఇదంతా పేద, మధ్య తరగతి కుటుంబాల మెరుగైన జీవితం కోసం మనం చేసిన హ్యూమన్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్. పేద కుటుంబాల్లో ప్రతి పాపా, ప్రతి బాబు గొప్ప చదువులతో ఇంజనీర్లు, కలెక్టర్లు, డాక్టర్లు, పెద్ద కంపెనీల్లో సీఈవోలుగా ఎదిగి ఆ కుటుంబాల తలరాతలు మారాలని, భవిష్యత్ బాగుండాలనే తపనతో అడుగులు వేస్తూ వచ్చాం. మన విద్యా విధానంలో మీ అన్న ప్రభుత్వం ఈ 57 నెలల్లో ఎలాంటి మార్పులు చేసింది? దానివల్ల ఎలాంటి ఫలితాలు రాబోతున్నాయి? అనేది ఒకసారి అందరూ గమనించాలని కోరుతున్నా. మన విద్యార్థులు రేపు ప్రపంచంతో పోటీ పడాల్సి ఉంటుంది. గత 30 ఏళ్లలో టెక్నాలజీ ఎంతో మారిపోయింది. ఆధునిక చదువులకు అనుగుణంగా మన విద్యా విధానాలను సంస్కరిస్తూ మెరుగైన పద్ధతులు, టెక్నాలజీని మన ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలకు అందుబాటులోకి తెస్తూ అడుగులు వేశాం.

చదువుల యుద్ధం..

ప్రభుత్వం స్కూళ్లలో మనం ఇంగ్లిషు మీడియం తెచ్చినందుకు మెచ్చుకోవాల్సింది పోయి పెత్తందారులైన చంద్రబాబు, ఈనాడు రామోజీ, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడితో యుద్ధం చేయాల్సి వస్తోంది. గవర్నమెంట్ బడులు మారాలని ఆరాటపడటం మన తప్పు! ఇంగ్లీష్ మీడియం తేవాలని తపనపడటం మనం చేసిన తప్పు! ఇలా ఆరాటపడినందుకు ఇంత మందితో యుద్ధం చేయాల్సి వస్తోంది. మనపై యుద్ధం చేస్తున్న వాళ్ల పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు ఏ మీడియంలో చదువుతున్నారని నిలదీస్తే ఏ ఒక్కరూ తెలుగు మీడియంలో చదువుతున్నారని చెప్పరు. వాళ్ల పిల్లలేమో ఇంగ్లిష్ మీడియంలో చదవాలి. పేదింటి పిల్లలనూ అలాగే చదివిస్తూ మీ జగన్ అడుగులు వేస్తుంటే మాత్రం తెలుగు భాష అంతరించి పోతోందంటూ యాగీ చేస్తూ మనమీద యుద్ధాన్ని ప్రకటిస్తున్నారు.

విద్యారంగంలోనూ క్లాస్ వార్..

ఇప్పుడు విద్యారంగంలో కూడా క్లాస్ వార్ జరుగుతోంది. పెత్తందార్లకు, పేదలకు మధ్య యుద్ధం ఇది. డబ్బున్న వారికి ఒక చదువులు, డబ్బులు లేని వారికి మరో చదువులు అనే ధోరణులపై జరుగుతున్న యుద్ధం ఇది. ఈ క్లాస్ వార్‌లో మీ కష్టాలు తెలిసిన అన్నగా మీ తరఫున ఒక విప్లవంగా, తిరుగుబాటుగా విద్యారంగంలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చాం.ఈ సంస్కరణలు, క్వాలిటీ ఎడ్యుకేషన్ కొనసాగకుంటే కూలీల పిల్లలు కూలీలుగానే, పనివారు పనివారుగానే, పేద సామాజిక వర్గాల పిల్లలు అదే పేదరికంలో మిగిలిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఈ విప్లవం, తిరుగుబాటు కొనసాగాలి. ఈ సంస్కరణలు వేగంగా అడుగులు పడుతూ పోవాలి. విదేశాల్లోని గొప్ప విశ్వవిద్యాలయాల కోర్సులను సైతం ఆన్‌లైన్‌లో మన పిల్లలకు అందుబాటులోకి తేవడం విప్లవాత్మక మార్పు. ఇవన్నీ మనం గతంలో ఎప్పుడూ చూడలేదు. మనం వచ్చే వరకు గవర్నమెంటు బడులలో ఇంగ్లిష్ మీడియం కూడా ఎవరూ చూడలేదు. ఇవన్నీ 57 నెలల కాలంలోనే శ్రీకారం చుట్టాం.

బాబు ఒక్క మంచీ చేయలేదు..

పిల్లలకు ప్రభుత్వ స్కూళ్లలో ఎలాంటి ఆహారం అందుతుందో చంద్రబాబు ఏనాడు కనీసం ధ్యాస పెట్టలేదు. బైజూస్ కంటెంట్, పిల్లలకు ట్యాబ్‌లు, డిజిటల్ బోధన అంతకన్నా లేదు. నాడు – నేడుతో స్కూళ్లను బాగుపరచాలన్న ఆలోచనే చేయలేదు. ఇంగ్లీషు మీడియం ఊసే లేదు. అమ్మ ఒడి దిశగా అడుగులు వేసిందీ లేదు. పెద్ద చదువులు చదువుతున్న పిల్లలకు పూర్తిగా ఫీజులు కట్టాలన్న ఆలోచనే ఏ రోజూ చేయలేదు. అంతర్జాతీయ విద్యా సంస్థలతో అనుసంధానం చేస్తూ మన కరిక్యులమ్ లో మార్పులు తెచ్చింది ఒక బోడి సున్నానే. విదేశీ విద్యా దీవెనతో ఏకంగా రూ.1.25 కోట్ల దాకా చదివించే బాధ్యత నాదీ అన్న ప్రోత్సాహకర మాటలే నాడు లేవు. రాష్ట్రంలో ఆయన పరిపాలన వల్ల జరిగిన మంచి ఒక్కటంటే ఒక్కటీ లేదు. గ్రామాలకు, సామాజిక వర్గాలకు, అవ్వాతాతలకు, రైతన్నలకు, అక్కచెల్లెమ్మలకు, చదువుకుంటున్న పిల్లలకు, జాబ్స్ కోసం వెతుక్కుంటున్న పిల్లలకు ఇది చేశానని ఆయన చెప్పగలిగే పరిస్థితే లేదు.

చదువులు చక్కదిద్దేందుకు ఏకంగా రూ.73,000 కోట్లు వెచ్చించాం: సీఎం జగన్

ఇది మానవ వనరులపై మూలధన పెట్టుబడి.. భావి తరాల భవితకు బలమైన పునాది



ల్యాప్‌టాప్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్న సీఎం వైఎస్ జగన్

నేటి విత్తనం.. రేపు మహా వృక్షం

ఇవాళ మన పిల్లలకు కావాల్సింది ఏదో కేవలం అక్షరాలు నేర్చుకోవడం మాత్రమే అనుకునే చదువులు కాదు. ఏదో ఒక డిగ్రీ తీసుకుంటే ఫర్వాలేదని భావించే చదువులు కానే కాదు. ఈరోజు మనకు కావాల్సింది క్వాలిటీ చదువులు. ఇవాల్టి తరం రేపు పోటీ ప్రపంచంలో నిలబడి గెలవగలిగే నాణ్యమైన చదువులు కావాలి. ఈ నిజం, అవసరాన్ని తెలుసుకున్నాం కాబట్టే మన పిల్లలందరూ భవిష్యత్తులో ప్రపంచంలో అతిపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు పొందేలా మన అడుగులు ముందుకు పడ్డాయి. ఈ దిశగా ప్రాథమిక విద్యలో కీలక మార్పులు తెచ్చాం. మనం వచ్చిన తర్వాతే గవర్నమెంట్ బడుల పరిస్థితులు మారాయి. ఇవాళ ఒకటో తరగతిలో మనం వేసే విత్తనం మరో 10–15 ఏళ్లలో చెట్టు అవుతుంది. మంచి భవిష్యత్ లేకపోతే ఆ చెట్టు ఒరిగిపోతుంది. అలా కాకుండా మన పిల్లలు పోటీ ప్రపంచంలో లీడర్లుగా ఎదగాలనే తపనతో అడుగులు వేస్తూ వచ్చాం. నాడు–నేడుతో గవర్నమెంట్ స్కూళ్లలో సమూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇంగ్లీషు మీడియం, సీబీఎస్‌ఈ నుంచి ఐబీ దాకా మన ప్రయాణం సాగుతోంది.

జగన్ అనే వ్యక్తి పక్కకుపోతే...!

జగన్ అనే ఒక్కడు పక్కకుపోతే రేపు పిల్లల చదువులు ఉండవు! గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లీషు మీడియం ఉండదు! 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ కథ దేవుడెరుగు విద్యారంగం గాలికి పోతుంది! ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, పేదవాడికి ఇంటికే మందులు, వ్యవసాయం గాలికి ఎగిరిపోతాయి. రైతన్న పూర్తిగా చతికిలబడిపోతాడు. అక్కచెల్లెమ్మల బతుకులు చిన్నాభిన్నం అవుతాయి. పేదవాడికి తోడుగా నిలబడుతూ, పేదవాడి భవిష్యత్ కోసం యుద్ధం చేస్తున్నది కేవలం మీ జగన్ మాత్రమే. అందుకనే ప్రతి ఒక్కరికీ చెబుతున్నా. వాళ్లు చెప్పే అబద్ధాలు, మోసాలను నమ్మకండి. రాబోయే రోజుల్లో ఇంకా అబద్ధాలు చెబుతారు. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారు కొనిస్తామంటారు. మీ ఇంటికి ఎవరు మంచి చేశారు? ఎవరి హయాంలో మంచి జరిగింది? అనే ఆలోచన చేయండి. మీ జగన్ వల్ల మీకు మంచి జరిగి ఉంటే మీ అన్నకు తోడుగా సైనికులుగా నిలబడండి. నేను చెప్పే ఈ మాటలు కచ్చితంగా గుర్తుపెట్టుకోండి.

పిల్లల బాధ్యత తీసుకున్నారు



తోడేళ్లన్నీ ఏకమైనా జగనన్న మనందరి కోసం పోరాడుతున్నారు. అట్టడుగు వర్గాలను పైకి తేవాలన్న సంకల్పం గొప్పది. వ్యవస్థలో మార్పు రావాలంటే విద్యతోనే సాధ్యమని భావిస్తూ సంస్కరణలు చేపట్టారు. స్కూళ్లు మొదలయ్యే జూన్, జూలై వచ్చిందంటే ప్రతి ఒక్కరూ పిల్లల గురించి ఆలోచిస్తారు. ఇప్పుడు జగనన్న ఆ బాధ్యత తీసుకున్నారు. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే జగనన్న 30 ఏళ్లు సీఎంగా ఉండాలి. సామాన్యుడైన నన్ను ఎమ్మెల్యేను చేశారు. ప్రాణం ఉన్నంతవరకు ఆయన వెంటే నడుస్తా. ముఠా నాయకులు, ప్యాకేజ్ స్టార్‌ను ప్రజలు తరిమి కొట్టాలి. ఓ వ్యక్తి ఇటీవల తరచూ అత్తగారింటికి నిమ్మకూరు వస్తున్నాడు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కొత్త కథలు చెబుతున్నాడు.

– కైలే అనిల్‌కుమార్, పామర్రు ఎమ్మెల్యే

విద్యార్థులకు వరంలా..



అమ్మలా గోరు ముద్ద అందిస్తూ నాన్నలా ఫీజులు చెల్లిస్తున్న మీది గొప్ప మనసు అన్నా. కృష్ణా యూనివర్సిటీలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా బీటెక్ చదువుకుంటున్నా. నాన్న చదువుకునే రోజుల్లో స్కాలర్‌షిప్ కోసం ఎన్నో ఆఫీస్‌ల చుట్టూ తిరిగినట్లు చెప్పారు. నేను ఏ ఒక్క ఆఫీస్‌కూ వెళ్లకుండా వలంటీర్ అన్నయ్య మా ఇంటికే వచ్చి పత్రాలు ఇచ్చారు. విజన్ ఉన్న మీరు సీఎంగా ఉండటం విద్యార్థులకు వరం. ప్రతిక్షణం మా గురించి ఆలోచించే మీరు మళ్లీ మళ్లీ సీఎం కావాలి. మీద్వారా మా కుటుంబం చాలా లబ్ధి పొందింది.

– పి.శ్రీ షణ్ముఖ సాయి ప్రియ, విద్యార్థిని

గొప్ప ప్రజా నాయకుడు మీరే..



మాది పేద కుటుంబం. నాన్న ప్రైవేట్ ఉద్యోగి. ఆయన జీతంపైనే కుటుంబం గడుస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్ పూర్తి చేశా. ప్రస్తుతం సివిల్ ఇంజనీరింగ్ మూడో ఏడాది చదువుతున్నా. విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా లబ్ధి పొందా. కరిక్యులమ్ కోర్సులతో పాటు ఇతర కోర్ సబ్జెక్టులు నేర్చుకోవడం వల్ల మంచి గ్రిప్ సంపాదించా. సాఫ్ట్‌వేర్ జాబ్స్‌కు అర్హత సాధించా. వరల్డ్ టాప్ యూనివర్సిటీలలో ఎంఎస్ చేయాలనుకుంటున్నా. మీరు యువతకు మంచి ప్రోత్సాహం అందిస్తున్నారు. మాల్కం గ్లాడ్‌వెల్ అనే ఇంగ్లిష్ రచయిత టెన్ థౌజండ్ అవర్స్ థియరీ రాశారు. మీరు కూడా టెన్ థౌజండ్ అవర్స్ ప్రజల మధ్య గడిపారు కాబట్టి ఇంత గొప్ప నాయకుడయ్యారు. నేను కూడా ఆ థియరీని పాటించి వరల్డ్‌లో గ్రేట్ ప్రొఫెషనల్ పేరు సాధించాక మళ్లీ మీ దగ్గరకు వచ్చి స్టేజ్‌పై నిలబడి మాట్లాడతానని మాట ఇస్తున్నా.

– దిల్షాద్, విద్యార్థిని

హాజరైన మంత్రులు, నేతలు

కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగి రమేష్, జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, టి.కల్పలత, మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, దూలం నాగేశ్వరరావు, ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎంఎస్ నాగిరెడ్డి, ఉన్నత విద్యాచైర్మన్ హేమచంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ పి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలిసారిగా ఓ ముఖ్యమంత్రి....

మన విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా టాప్ 50 ర్యాంకుల్లో ఉన్న 21 ఫ్యాకల్టీస్‌లో 330 కాలేజీల్లో సీట్లు సాధిస్తే జగనన్న విదేశీ విద్యా దీవెనతో రూ.1.25 కోట్ల వరకు ఫీజులు చెల్లించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది కూడా ఈ 57 నెలల కాలంలోనే. పిల్లల డిగ్రీలకు ప్రయోజనం దక్కేలా వారు ఏం చదువుతున్నారు? కరిక్యులమ్‌లో ఎలాంటి మార్పులు తేవాలి? అత్యున్నత భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు విద్యా వ్యవస్థలో ఎలాంటి మార్పులు తేవాలి? అని మొదటిసారిగా ఆలోచన చేసిన ముఖ్యమంత్రి మీ అన్న మాత్రమే. కరిక్యులమ్‌ను జాబ్ ఓరియెంటెండ్‌గా మార్చాం. నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులు తెచ్చాం. 10 నెలల తప్పనిసరి ఇంటర్న్ షిప్ తీసుకొచ్చింది ఇప్పుడే. మన కరిక్యులమ్‌లో సర్టిఫైడ్ ఆన్‌లైన్ వర్టికల్స్‌ను తొలిసారిగా తీసుకొచ్చాం. చదువుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ ఇవన్నీ తొలిసారిగా అనుసంధానం చేస్తూ అడుగులు వేశాం. డిగ్రీ పూర్తయ్యాక మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభించక ఇబ్బంది పడే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో విదేశాల్లో ఉన్నదేమిటి? ఇక్కడ లేనిదేమిటి? అని ఆలోచన చేసి అక్కడ సబ్జెక్టుల్లో ఉన్న వర్టికల్స్‌ను ఆన్‌లైన్‌లో మన పిల్లలకు అందుబాటులోకి తెచ్చింది కూడా మన ప్రభుత్వమే. ప్రఖ్యాత వర్సిటీల్లో ఉన్న దాదాపు 2 వేల కోర్సులన్నీ ఆన్‌లైన్ ద్వారా మన కరిక్యులమ్‌లో భాగాలుగా మారి సర్టిఫికెట్లు కూడా వారే ఇచ్చేలా అడుగులు వేశాం. అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడుతూ ఐబీ సర్టిఫికెట్లు చేతిలో పుచ్చుకొని హార్వర్డ్, ఎంఐటీ, ఎల్ఎస్ఈ, ఎల్‌బీఎస్ లాంటి అంతర్జాతీయ వర్సిటీల నుంచి ఆన్‌లైన్‌లో కోర్సులు పూర్తి చేసి పొందిన సర్టిఫికెట్లతో నైపుణ్యాలు సాధించిన మన విద్యార్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటే అంతర్జాతీయంగా మల్టీ నేషనల్ కంపెనీల్లో అందరికంటే ముందుంటారు.



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

జగన్నాథ రథం..

విప్లవాత్మక సంస్కరణలతో మన జగన్నాథ రథం వడివడిగా కదులుతోంది. స్కూల్ ఎడ్యుకేషన్‌లో సీబీఎస్‌ఈ నుంచి ఐబీ వరకు అడుగులు పడుతున్నాయి. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ విధానాన్ని మీ అన్న పరిపాలనలోనే తీసుకొచ్చాం. 3వ తరగతి నుంచే టోఫెల్ ఓరియెంటేషన్‌తో శిక్షణ ఇచ్చే కార్యక్రమం మొట్టమొదటిసారిగా జరుగుతోంది కూడా ఇప్పుడే. గవర్నమెంట్ స్కూళ్లలో బైలింగ్వల్ టెక్స్ట్‌బుక్స్ మన పిల్లల చేతుల్లో కనిపిస్తోంది కూడా ఇప్పుడే. ధనికుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉన్న బైజూస్ కంటెంట్‌ను పేద పిల్లలకు సైతం అందించింది ఈ 57 నెలల కాలంలోనే. మన పేద పిల్లలు కేవలం అక్షరాలు నేర్చుకునే లిటరసీ నుంచి డిజిటల్ యుగాన్ని శాసించే రీతిగా ఎదగాలని, 8వ తరగతికి వచ్చిన వెంటనే ప్రభుత్వం ఏకంగా ట్యాబ్‌లు ఇచ్చింది కూడా ఈ 57 నెలల కాలంలోనే. నాడు – నేడుతో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చేసి 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్ రూములో ఐఎఫ్‌పీ ప్యానెళ్లు తెచ్చింది మన ప్రభుత్వమే. పిల్లలను బడులకు పంపేలా ప్రోత్సహిస్తూ తల్లులకు అమ్మ ఒడితో ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తోంది కూడా మనమే. పిల్లలకు రోజుకో రుచికరమైన మెనూతో గోరుముద్దను పౌష్టికాహారంతో అందిస్తోంది కూడా ఈ 57 నెలలుగానే. ప్రతి మండలానికి కనీసం 2 జూనియర్ కాలేజీలు, అందులో ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా ఒకటి ఉండాలని ఏర్పాట్లు చేసింది కూడా మన ప్రభుత్వమే. విద్యా వ్యవస్థను మన ప్రభుత్వం ఎంత ఉన్నత స్థాయికి చేర్చిందో చెప్పేందుకు ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థినులు ఐక్యరాజ్యసమితిలో అనర్గళంగా ఇంగ్లీష్‌లో మాట్లాడిన అరుదైన ఘట్టమే నిదర్శనం. మన చదువుల ఘనతను చిట్టి చెల్లెమ్మలు ప్రపంచానికి చాటి చెప్పారు.

ఎమ్మెల్యే అనిల్‌ను చూసినప్పుడల్లా..

ఎమ్మెల్యే అనిల్‌ని చూసినప్పుడల్లా అందరూ తన మాదిరిగా ఉంటే ప్రతి నియోజకవర్గానికి మంచి జరుగుతుందని అనిపిస్తుంది. నిజాయతీ, నిబద్ధత ఉన్న అనిల్‌ను మీరందరూ దీవించండి. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి కొన్ని పనులు అడిగాడు. అధికారులను పిలిపించి అవన్నీ కచ్చితంగా యుద్ధ ప్రాతిపదికన చేస్తానని హామీ ఇస్తున్నా.




ముఖ్యమంత్రి ప్రసంగానికి మద్దతుగా కేరింతలు కొడుతున్న విద్యార్థినులు, అక్కచెల్లెమ్మలు

పెత్తందారులకో ధర్మం.. పేదలకో ధర్మమా?

ఇవాళ నేను చెబుతున్న ప్రతి మాటా ఆలోచన చేయమని మిమ్మల్ని కోరుతున్నా. తల్లిదండ్రులు, పిల్లలందరూ దీన్ని గమనించాలి. పెత్తందార్లయిన వారికో ధర్మమట! పేదలైన మీకో ధర్మమట! వారి పిల్లలకు ఒక బడి.. మన పిల్లలకు ఇంకో బడట! వారి చదువులు వేరట.. మన చదువులు వేరట! పెత్తందార్లుగా వారుండాలట... పనివారిగా మనం ఉండాలట! పరిశ్రమలు వారివట.. కార్మికులుగా మాత్రమే మనమట! సామ్రాజ్యాలన్నీ వారివట.. సామాన్యులుగా మాత్రమే మనం మిగిలిపోవాలట! వారి పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు ఉండొచ్చు కానీ మీ జగన్ పేద పిల్లలకు ట్యాబ్‌లిస్తే మాత్రం చెడగొడుతున్నారంటూ యాగీ చేస్తారు. ఇవన్నీ మన పిల్లలు ఎప్పటికీ పేదలుగానే ఉండిపోవాలని కోరుకొనే పెత్తందారీ మనస్తత్వానికి నిదర్శనాలుగా మన కళ్లెదుటే కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ విభాగాలు రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల నుంచే కొనాలి

గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు తమకు అవసరమైన వస్తువులను రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల నుంచే కొనుగోలు చేయాలని ప్రభుత్వం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడం కోసం కరోనా సమయంలో ప్రతి ప్రభుత్వ విభాగం చేసే కొనుగోళ్లలో 25శాతం ఎంఎస్ఎంఈల వద్ద తీసుకోవాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. కానీ, కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు పక్క రాష్ట్రాల ఎంఎస్ఎంఈల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తుండటంతో దీనిపై మరింత స్పష్టతనిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ తాజాగా గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థలు విధిగా తమ కొనుగోళ్లను రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల నుంచే చేయాలని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఉన్న ఎంఎస్ఎంఈలు, వాటి ఉత్పత్తుల వివరాలు అన్నీ 'ఏపీఎంఎస్ఎంఈ వన్' పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు చేసిన బిల్లులను ఆమోదించవద్దని ఆర్థిక శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులకు వర్క్‌షాపులు

సాక్షి, అమరావతి : ఎన్నికల ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులను పూర్తి స్థాయిలో భాగస్వాములను చేసేందుకు అవసరమైన వర్క్‌షాపులను ఈ నెల 10వ తేదీలోపు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు వీరి సహకారం, భాగస్వామ్యం అవసరమని, ఎన్నికల షెడ్యూలు ఖరారు కాకముందే ఈ వర్క్‌షాపులను నిర్వహించాలని సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సంసిద్ధతకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారులు తప్పని సరిగా సందర్శిస్తూ ఉండాలని, స్థానికులతో తరచుగా సమావేశాలు నిర్వహిస్తూ వారిలో ఎన్నికల ప్రక్రియపై సరైన విశ్వాసాన్ని పాదుకొల్పాలని సూచించారు. అలాగే మీడియా సెల్, సోషల్ మీడియా సెల్, కంట్రోల్ రూమ్‌లను సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకించి సోషల్ మీడియా సెల్‌లో నోడల్ అధికారి నియామకంతో పరిమితం కాకుండా సోషల్ మీడియా నిర్వహణపై నైపుణ్యం గల ముగ్గురిని నియమించి, పలు రకాల సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని సూచించారు. జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలను రూపొందించి 10వ తేదీలోపు అందించాలన్నారు. అదనపు సీఈవోలు కోటేశ్వరరావు, హరీం ధరప్రసాద్, డిప్యూటీ సీఈవో కె.విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ సీఈవో తాతబ్బాయ్ పాల్గొన్నారు.

పులివెందుల టీడీపీ సీనియర్ నేత సతీష్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

- కండువా వేసి ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్
- 27 సంవత్సరాలు టీడీపీ కోసం కష్టపడ్డా విలువలేదు: సతీష్‌కుమార్‌రెడ్డి
- టీడీపీలో సీనియర్లకు విలువలేదు.. అదో వ్యాపార సంస్థలా మారింది
- వైఎస్ ఫ్యామిలీని ఇబ్బంది పెట్టినా నన్ను జగన్ అక్కున చేర్చుకున్నారు
- సీఎం జగన్ ఆప్యాయతను జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను



సతీష్‌కుమార్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పులివెందుల టీడీపీ సీనియర్ నేత, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్.వి. సతీష్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద సతీష్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను వైఎస్ ఫ్యామిలీని ఇబ్బంది పెట్టినా.. తనను సీఎం జగన్ ఆహ్వానించి అక్కున చేర్చుకున్నారని చెప్పారు. సీఎం జగన్ చూపిన ప్రేమ, ఆప్యాయత ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. అలాంటి మంచి ఫ్యామిలీపై తాను ఎందుకు పోరాటం చేశానా.. అని బాధ కలిగిందని చెప్పారు.

టీడీపీలో సీనియర్లకు గౌరవం లేదు

టీడీపీలో చంద్రబాబు నాయకత్వం దిగజారిపోయి లోకేశ్ పెత్తనమే నడుస్తోందని సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీలో సీనియర్లకు గౌరవం లేదన్నారు. 27 సంవత్సరాలు పులివెందులలో టీడీపీ కోసం కష్టపడి పని చేస్తే.. ప్రతిఫలం ఇవ్వకపోగా, తనపై నిందలు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర మనస్తాపానికి గురై 2020 సంవత్సరంలో టీడీపీని వీడానని, రాజీనామా ఎందుకు చేశానో కూడా చంద్రబాబుకు సమాచారం ఇచ్చానని తెలిపారు. అయినా ఈ నాలుగేళ్లు పట్టించుకోలేదన్నారు. పార్టీని వీడుతున్నానని తెలిశాక చంద్రబాబు రాయబారం పంపారని, ఇది ఆయన అవకాశవాదానికి నిదర్శనమని చెప్పారు. చంద్రబాబు ఆహ్వానం నచ్చక, ఇక ఆలస్యం చేయడం మంచిది కాదనే ఆలోచనతో వైఎస్సార్‌సీపీలో చేరానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఓ వ్యాపార సంస్థగా మారిందని సతీష్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు పెత్తనం తగ్గి లోకేశ్ ఆదేశాలు అమలు అవుతున్నాయని, లోకేశ్‌ది అంతా వ్యాపార ధోరణి అని వివరించారు. ఒక పార్టీ అన్న రీతిలో టీడీపీని నడపటం లేదన్నారు. టీడీపీ నాయకులు అందరిలో అదే ఫీలింగ్ ఉందన్నారు.

విశ్వాసపాత్రుడిగా ఉంటాను

సీఎం జగన్ ఔదార్యం జీవితాంతం గుర్తుపెట్టుకుంటానని సతీష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. భవిష్యత్తులో సీఎం జగన్‌కు అత్యంత విశ్వాసపాత్రుడిగా పనిచేయాలని నిర్ణయించుకొన్నానని చెప్పారు. ఎన్నికల్లో పోటీపై తనకు ఎలాంటి ఆలోచన లేదన్నారు. తాను పులివెందులలో బాగా కష్టపడి పని చేసిన రోజుల్లోనే వైఎస్ జగన్ 90 వేల ఓట్ల మెజార్టీతో నెగ్గారని, నిజంగా పులివెందులలో తన అవసరం కూడా జగన్‌కు లేదన్నారు. అయినా సీఎం జగన్ పిలిచారని, ఆయన ఏ బాధ్యతలు ఇచ్చినా సమర్థవంతంగా, చిత్తశుద్ధితో, నిజాయితీగా నిర్వహిస్తానని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేత చేగొండి సూర్యప్రకాష్

- కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం జగన్
- పార్టీని సమర్థంగా నడపలేని అసమర్థుడు పవన్: చేగొండి
- చంద్రబాబు ఆనందం కోసం కాపుజాతిని అవమానించాడు
- ప్రజాస్వామ్యంపై పవన్‌కు నమ్మకం లేదు



చేగొండి సూర్యప్రకాష్‌ను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: జనసేన పీఏసీ మెంబర్, ఆ పార్టీ ఆచంట నియోజకవర్గ ఇన్‌చార్జి చేగొండి సూర్యప్రకాష్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు కళ్లల్లో ఆనందం కోసం హరిరామజోగయ్య, ముద్రగడలతో పాటు కాపుజాతిని పవన్ అవమానించాడని సూర్యప్రకాష్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంపై పవన్‌కు నమ్మకం లేదన్నారు. పార్టీని సమర్థంగా నడపలేని అసమర్థుడు పవన్ అని విమర్శించారు. తాను 2018లో జనసేనలో చేరి ఇప్పటివరకు కష్టపడి పనిచేశానని, బడుగుబలహీన వర్గాలకు పవన్ అండగా నిలబడతారని ఆశిస్తే అది నిరాశే అయ్యిందని చెప్పారు. పైకి కనిపించే పవన్ తీరు వేరు అని, లోపల వ్యవహరించే తీరు వేరు అని వెల్లడించారు. టీడీపీకి కొమ్ము కాసేందుకు, చంద్రబాబు, ఆయన కుమారుడిని సీఎం చేసేందుకే పవన్ పనిచేస్తున్నారని మండిపడ్డారు. జనసేనలో ఇప్పటి వరకు బూత్ కమిటీలు వేయలేదని, కనీసం వంద నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలను నియమించలేదని చెప్పారు. పార్టీ కోసం పనిచేసే నేతలకు కనీస మర్యాద లేకుండా నీచంగా పవన్ వ్యవహరిస్తున్నారని చెప్పారు. పార్టీని నాదెండ్ల చేతిలో పెట్టి జనసైనికులను నిలువునా ముంచేశారని విమర్శించారు. జనసేనలో నేతలెవ్వరికీ కనీస స్వేచ్ఛలేదన్నారు. తాను ఏ టికెట్, పదవి ఆశించకుండా వైఎస్సార్‌సీపీలో చేరానని, నేటి నుంచి క్రమశిక్షణ కలిగిన నేతగా సీఎం జగన్‌తో ప్రయాణిస్తానని చెప్పారు. పవన్‌కు అవసరం వచ్చినప్పుడే హరిరామజోగయ్య, ఆయన నేతృత్వంలో పనిచేసే కాపు సంక్షేమ సంఘం కావాలని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ సహా ఏ పార్టీకీ జోగయ్య కోవర్టు కాదని, కాపులను సీఎం చేయాలనేదే ఆయన ఆలోచన అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి. దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి శరత్‌కు

14 రోజుల రిమాండ్

విజయవాడ సబ్ జైలుకు తరలింపు • 10 రోజుల కస్టడీ కోరిన పోలీసులు



ప్రత్తిపాటి శరత్‌ను జడ్జి ముందు హాజరుపరిచేందుకు కారులో తీసుకువెళుతున్న పోలీసులు

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: అమరావతిలో కాంట్రాక్టుల ముసుగులో బోగస్ ఇన్వాయిస్‌లతో రూ.66.03 కోట్ల ప్రజాధనం కొల్లగొట్టిన కేసులో టీడీపీ సీనియర్ నేత ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌కు విజయవాడ న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. మౌలిక సదుపాయాల కాంట్రాక్టులను సబ్ లీజుకు తీసుకుని పనులు చేసినట్టు చూపిస్తూ బోగస్ ఇన్వాయిస్‌లతో ప్రత్తిపాటి కుటుంబానికి చెందిన అవెక్సా కార్పొరేషన్ అడ్డగోలుగా అవినీతికి పాల్పడింది. ఈ అవినీతి బాగోతాన్ని పూర్తి ఆధారాలతో కేంద్ర జీఎస్టీ ఇంటెలిజెన్స్, రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించి విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో విజయవాడ పోలీసులు ప్రత్తిపాటి శరత్‌ను అరెస్ట్ చేసి గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత విజయవాడలోని న్యాయస్థానంలో హాజరుపరిచారు. విజయవాడ పోలీసులు సమర్పించిన రిమాండ్ నివేదికతో సంతృప్తి చెందిన న్యాయస్థానం ప్రత్తిపాటి శరత్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. దాంతో ఆయన్ను పోలీసులు విజయవాడ సబ్ జైలుకు తరలించారు. కాగా, ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు నిందితుడు ప్రత్తిపాటి శరత్‌ను పదిరోజుల కస్టడీకి ఇవ్వాలని విజయవాడ పోలీసులు న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు న్యాయస్థానంలో శుక్రవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రత్తిపాటి శరత్‌కు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై విచారణను న్యాయస్థానం సోమవారానికి వాయిదా వేసింది.

ప్రత్తిపాటి ఓవర్ యాక్షన్

పోలీసులు ప్రత్తిపాటి శరత్‌కు విజయవాడ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో పుల్లారావు సహనం కోల్పోయారు. సాక్షాత్తూ న్యాయమూర్తి ఇంటి ఎదుటే విచక్షణా రహితంగా అనుచరులతో కలిసి అల్లర్లకు దిగారు. నిందితుడు శరత్‌ను న్యాయమూర్తి వద్ద హాజరు పరుస్తారనే సమాచారంతో ప్రత్తిపాటి పుల్లారావు గురువారం రాత్రి 10.30 సమయంలో విజయవాడలోని మాచవరంలో ఉన్న జడ్జి క్వార్టర్స్‌కు చేరుకున్నారు. చిలకలూరిపేట నుంచి 10 కార్లలో తను అనుచరులను తీసుకొచ్చారు. వీరితో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని టీడీపీ నాయకులు గద్దె రామ్మోహనరావు, దేవినేని ఉమా, పట్టాభి, కొల్లు రవీంద్ర తదితరులు అక్కడికి చేరుకున్నారు. జడ్జి క్వార్టర్స్‌లోకి నిందితుడు శరత్‌ను తీసుకెళ్తున్న వాహనాన్ని పుల్లారావు అనుచరులు అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారు. వాహనం లోపలికి వెళ్లిన తరువాత క్వార్టర్స్ ముఖద్వారం గేటును ఎక్కేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. న్యాయమూర్తి ఎదుట ఇరువర్గాల వాదనలు రాత్రి 2.30 గంటల వరకు కొనసాగాయి. తెల్లవారుజామున 3.30 గంటలకు బెయిల్ పిటిషన్ తిరస్కరిస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. దీంతో తన అనుచరులను పుల్లారావు రెచ్చగొట్టారు. రిమాండ్ నిమిత్తం నిందితుడు శరత్‌ను తీసుకెళ్లే పోలీస్ ఎస్కార్ట్ వాహనంపై వారు దాడికి దిగారు. ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్న పోలీసులతో తీవ్ర స్థాయిలో గొడవ పడ్డారు. పలువురు పోలీసు అధికారులను దూషించారు. ఈ లోగా టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు సామాజిక మాధ్యమాల్లో సీఎం జగన్‌పై దూషణలు మొదలు పెట్టారు. ఇదంతా సీఎం జగన్ కుట్రలో భాగమేనని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు.

> ఇంద్రియాల కంటే మనసు ఉత్తమమైనది.
> మనసు కంటే బుద్ధి శ్రేష్ఠమైనది. బుద్ధి కంటే జీవాత్మ అతిగొప్పది.
> జీవాత్మ కంటే అవ్యక్త శక్తి ఉత్తమమైనది.
> – కఠోపనిషత్తు

సాక్షి
శనివారం, 2 మార్చి 2024

ఇంత దారుణమా?!

ఉన్నత విద్యాసంస్థల్లో చేరే విద్యార్థినులు గతంతో పోలిస్తే 44 శాతం పెరిగారని మొన్న జనవరిలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఘనంగా ప్రకటించింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల పిల్లలు ఎక్కువుండటం శుభసూచకమని చెప్పింది. కానీ ఆడపిల్లల భద్రత విషయంలో ఉన్నత విద్యాసంస్థలు శ్రద్ధ పెడుతున్నాయా? వాటిని పర్యవేక్షించాల్సిన వ్యవస్థలు ఆ సంస్థలను అప్రమత్తం చేస్తున్నాయా? గుజరాత్‌లోని గాంధీనగర్‌లో కొలువుదీరిన గుజరాత్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (జీఎన్ఎల్‌యూ) వాలకం చూస్తే ఏదీ సక్రమంగా లేదన్న సందేహం కలుగుతుంది. నిరుడు సెప్టెంబర్‌లో మీడియాలో వచ్చిన కథనాలను గుజరాత్ హైకోర్టు పరిగణనలోకి తీసుకుని నియమించిన కమిటీ ఇచ్చిన నివేదిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ అనిరుద్ధ పి. మయీల నేతృత్వంలోని ధర్మాసనాన్ని దిగ్భ్రాంతి పరిచింది. ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సాగుతున్న లైంగిక నేరాలను కప్పిపుచ్చటానికి బాధ్యతాయుత స్థానాల్లో వున్న వారు ప్రయత్నించటం భీతి గొలుపుతున్నదని న్యాయమూర్తులు అన్నారంటే అక్కడి పరిస్థితులు ఎంతగా దిగజారాయో అర్థమవుతుంది. ఈ తరహా అకృత్యాలు, వికృతాలు రాజకీయ నాయకుల అండదండలు లేకుండా సాగవు. ఒక 'పలుకుబడిగల రాజకీయ నాయకుడు' ఇలాంటి నేరగాళ్లకు వత్తాసుగా ఉన్నాడని ఒక విద్యార్థిని చెప్పటం గమనార్హం. డైరెక్టర్, రిజిస్ట్రార్, మరికొందరు అధ్యాపకులపై సైతం ఆరోపణలు రావటం గమనిస్తే విశ్వవిద్యాలయం తోడేళ్ల పాలయిందా అన్న సందేహం తలెత్తుతుంది.

ప్రపంచీకరణకు తలుపులు బార్లా తెరిచాక దేశంలో ఉన్నత విద్యాసంస్థలు కళ్లు తేలేయటం మొదలైంది. సామాజిక శాస్త్రాల అధ్యయనం మహాపాపమని పాలకులే ప్రచారం చేయటం, విద్యార్జన అంతిమ ధ్యేయం కొలువులు సాధించటం మాత్రమేనన్న అభిప్రాయం కలిగించటం ఉన్నత విద్యాసంస్థలను క్రమేపీ దిగజార్చాయి. తాము ఈ సమాజం నుంచి వచ్చామని, తమ మేధస్సును దీని ఉన్నతికి వినియోగించాలన్న స్పృహ విద్యార్థుల్లో కరువైంది. చాలా ఉన్నత విద్యాసంస్థలు ఇప్పుడు కుల, మత, ప్రాంతీయ జాడ్యాల్లో కూరుకుపోయాయి. ఆడపిల్లల హాస్టళ్లలో సైతం ర్యాగింగ్‌లు సాగుతుండటం, కొందరు సస్పెండవుతున్నట్టు వార్తలు రావటం యాదృచ్ఛికం కాదు. వర్తమానంలో సినిమా హీరోలూ, క్రికెటర్లూ, ప్రపంచ సంగీత దిగ్గజాలూ ఆరాధ్య దైవాలవుతున్నారు. మాదకద్రవ్యాల సంగతి సరేసరి. ఇన్ని కశ్మలాల మధ్య కూనారిల్లుతున్న విద్యాసంస్థలు రాణిస్తాయని, విద్యార్థులకు వివేకాన్నీ, విజ్ఞానాన్నీ అందిస్తాయని నమ్మటం అమాయకత్వమే అవుతుంది. జీఎన్ఎల్‌యూలోని దారుణాలపై కనీసం అయిదేళ్లుగా ఆరోపణలు వినబడుతున్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో మారుపేర్లతో కొందరు విద్యార్థినులు తమకెదురైన చేదు అనుభవాలను ఏకరువు పెట్టిన ఉదంతాలున్నాయి. అటువంటి ఉదంతం ఆధారంగా మీడియాలో వచ్చిన కథనమే గుజరాత్ హైకోర్టును రంగంలోకి దించింది. కానీ విశ్వవిద్యాలయం ఏం చేసింది? చర్యల మాట అటుంచి... సాక్షాత్తూ హైకోర్టు ధర్మాసనమే అడిగిందన్న ఇంగితజ్ఞానం కూడా లేకుండా రిజిస్ట్రార్ బుకాయింపులకు దిగాడు. ఈ మహానుభావుడే అంతక్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టిన ఇద్దరు విద్యార్థినులను మందలించాడు. ఆఖరికి బాలికల హాస్టల్ వార్డెన్‌గా ఉన్న మహిళా ప్రొఫెసర్ సైతం వారిని భయపెట్టి ఆ పోస్టులను తొలగింపజేశారు. సంస్థ కీర్తిప్రతిష్ఠలు దెబ్బతింటాయన్న సాకుతోనే ఇదంతా సాగించారు. పేరుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) వుంది. ఒక మహిళా ప్రొఫెసర్ నేతృత్వంలోనే సాగుతోంది. కానీ ఆ కమిటీకి ఫిర్యాదు చేయటం దండగ అనుకున్నారో, దానిగురించి తెలియనే తెలియదో ఏ బాలికా వారికి ఫిర్యాదు చేయలేదు. కనీసం ఆ కమిటీ తనంత తానే విచారణ జరపాలి కదా... ఆ పని కూడా జరగలేదు. తొలుత దారుణాలు తన దృష్టికొచ్చాక హైకోర్టు నియమించిన కమిటీలో ఐసీసీ చైర్‌పర్సన్‌కు కూడా చోటిచ్చారు. కానీ ఆమె గారి నిర్వాకం తెలిశాక ఆ కమిటీని రద్దుచేసి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో మరో కమిటీని ఏర్పాటు చేశారు. కనుకనే ఈ అకృత్యాలు వెలుగులోకొచ్చాయి.

విద్యార్థుల్లో జిజ్ఞాస రేకెత్తించటం, తార్కిక శక్తిని పెంచటం, స్ఫూర్తి రగల్చటం, వారిని సామాజిక మార్పులకు చోదకశక్తులుగా మార్చటం ఉన్నత విద్య లక్ష్యం. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వంటిచోట తమ పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు ఎందుకు ఆసక్తి చూపుతారు? అక్కడైతే అత్యున్నత ప్రమాణాలున్న న్యాయవిద్య అందుతుందని, ఆ విశ్వవిద్యాలయంలో నిర్వహించే సెమినార్లు, ఇతర సదస్సులు తమ పిల్లలను ఉన్నతశ్రేణికి చేరుస్తాయని వారు ఆశిస్తారు. కానీ జరిగిందేమిటి? రేపన్నరోజున న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించి సమాజంలోని దురంతాలను అంతం చేయాల్సినవారే బాధితులుగా మారారు. ఎవరికి చెప్పుకోవాలో, ఎట్లా ఎదుర్కొనాలో తెలియని నిస్సహాయ స్థితిలో పడ్డారు. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఉదంతం తర్వాత జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నిర్భయ చట్టం వచ్చింది. విద్యాసంస్థల్లోనూ, పనిస్థలాల్లోనూ బాలికలకు, మహిళకు భద్రత కల్పించటం వ్యక్తుల, సంస్థల బాధ్యతగా ఆ చట్టం గుర్తించింది. విఫలమైన పక్షంలో కఠినంగా దండించే నిబంధనలున్నాయి. కానీ జరిగిందేమిటి? ఈ దురంతాలపై లోతుగా విచారణ జరగాలి. నేరగాళ్లకూ, వారికి తోడ్పడిన పెద్దలకూ కఠినశిక్షలు పడేలా చర్యలుండాలి. దేశంలోని ఉన్నత విద్యాసంస్థలన్నిటికీ ఆ చర్యలు ఒక హెచ్చరిక కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.సప్తమి రా.3.33 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** విశాఖ ఉ.10.31 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ప.2.40 నుండి 4.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.20 నుండి 7.54 వరకు, **అమృతఘడియలు:** రా.12.34 నుండి 2.19 వరకు.

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం: 6.02
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

పంట విక్రయంలో సాంకేతిక దన్ను

విశ్లేషణ



సంజీవ్ చోప్రా

పీవీ నరసింహారావు హయాంలో 1994లో 'స్మాల్ ఫార్మర్స్ అగ్రి–బిజినెస్ కన్సార్టియం' (ఎస్ఎఫ్ఏసీ) ఏర్పాటుచేయడం అర్థవంతమైన విధానపరమైన జోక్యం. ఆ సంస్థే ఇప్పుడు వ్యవసాయం కోసం జాతీయ ఎలక్ట్రానిక్ మార్కెట్‌ను ఏర్పాటు చేసే బాధ్యత చూస్తోంది. దీని కారణంగా, 2016లో నరేంద్ర మోదీ ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్' (ఈ–నామ్) పేరిట ఒక 'ఫిజిటల్' (ఫిజికల్ ప్లస్ డిజిటల్) మార్కెట్‌ను ప్రారంభించారు. దీనివల్ల 23 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 1.07 కోట్ల మంది రైతులకు వారి సొంత భాషలో, వారి మొబైల్ ఫోన్‌లో లావాదేవీలు జరిపే స్వేచ్ఛ, సౌలభ్యం ఏర్పడ్డాయి. 2024 జనవరి నాటికి, ఈ–నామ్ వల్ల రూ. 3 లక్షల కోట్లకు పైగా వ్యాపారం జరిగింది. దీనికి మరింత ఊపునిచ్చేలా, ఇ–మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయడానికిగానూ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక్కో నియంత్రిత మండీకి నిధులు సమకూర్చింది.

మాజీ ప్రధానులు చరణ్ సింగ్, పీవీ నరసింహారావు, శాస్త్రవేత్త–అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌లకు ఇటీవల భారతరత్న ప్రదానం చేయడం భారతీయ రైతు వ్యవస్థాపక స్ఫూర్తికి నివాళి అనే చెప్పాలి. ఈ ముగ్గురూ వ్యవసాయంతో పాటు రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. స్వామినాథన్ అందించిన తోడ్పాటు సుపరిచితమే కాదు, అది అందరూ గుర్తించిన విషయమే. అయితే హరిత విప్లవాన్ని విజయవంతం చేసిన రాజకీయ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. సోవియట్, చైనీస్ తరహా 'సామూహిక వ్యవసాయం'లో ఉన్న ప్రమాదాలను నెహ్రూకి వివరించినది చరణ్ సింగ్. రైతులు రాటుదేలిపోయిన స్వతంత్ర సాగుదారులనీ, ప్రణాళికా సంఘం మెచ్చుకున్న 'ల్యాండ్ పూలింగ్, సహకార వ్యవసాయం' అనే కేంద్రీకృత ప్రణాళికను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారనీ చరణ్ సింగ్ స్పష్టం చేశారు.

దార్శనికుడి విధాన జోక్యం

పీవీ నరసింహారావు హయాంలో భారతదేశం, ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరి వ్యవసాయ ఒప్పందంపై సంతకం చేసింది. అప్పటి వరకు, భారతదేశ విధాన వ్యవస్థ దిగుమతులను పరిమితం చేసింది. పీవీ ఆధ్వర్యంలో, భారతదేశం వ్యవసాయ ఎగుమతులను ఒక ముఖ్యమైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెట్టేదిగా చూసింది. ఏపీఈడీఏ (అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ)కి బడ్జెటరీ, సంస్థాగత మద్దతుతో, ఆయన భారతీయ వ్యవసాయాన్ని ప్రపంచవ్యాప్త పోటీదారుగా మార్చడంలో తోడ్పడ్డారు. అయినప్పటికీ దేశీయ వాణిజ్యం మాత్రం రైతుల కోసం కాకుండా, సేకరణ ఏజెన్సీలకూ, వ్యవసాయ పంటల మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ)లలోని నమోదైన వ్యాపారులకూ అనుకూలంగా నిర్బంధ వాణిజ్య పద్ధతుల ద్వారా నిర్వహించబడుతూనే ఉంది.

1994లో 'స్మాల్ ఫార్మర్స్ అగ్రి–బిజినెస్ కన్సార్టియం' (ఎస్ఎఫ్ఏసీ) స్థాపన, పీవీ చేసిన అత్యంత అర్థవంతమైన విధానపరమైన జోక్యం కావచ్చు. ఈ సంస్థకే వ్యవసాయం కోసం జాతీయ ఎలక్ట్రానిక్ మార్కెట్‌ను ఏర్పాటు చేసే బాధ్యతను అప్పగించారు. 2016 ఏప్రిల్ 14న ప్రధాని నరేంద్ర మోదీ ఎస్ఎఫ్ఏసీ మద్దతుతో 'ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్' (ఈ–నామ్) పేరిట ఒక 'ఫిజిటల్' (ఫిజికల్ ప్లస్ డిజిటల్) మార్కెట్‌ను ప్రారంభించారు. ఇది ఫిజికల్ బ్యాక్ ఎండ్‌తో కూడిన సింగిల్ విండో పోర్టల్. కార్యాచరణ సమాచారం, భౌతిక మౌలిక సదుపాయాలు, వాణిజ్య ఎంపికలు, చెల్లింపులపై ఎలక్ట్రానిక్ సెటిల్‌మెంట్లను ఇది అందిస్తుంది.

నేడు, ఎస్ఎఫ్ఏసీ చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల 23 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 1,389 నియంత్రిత హోల్‌సేల్ మార్కెట్‌లలో, 1.07 కోట్ల మంది రైతులు వారి సొంత భాషలో, వారి మొబైల్ ఫోన్‌లలో లావాదేవీలు జరిపే స్వేచ్ఛ, సౌలభ్యం కలిగి ఉన్నారు. భాగస్వామ్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మరో 1.7 లక్షల ఇంటిగ్రేటెడ్ లైసెన్స్‌లను జారీ చేశారు. ఈ వేదికకు తమ మద్దతును ప్రతిబింబించేలా దాదాపు 3,500 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు) ఇందులో చురుకుగా పాల్గొనడం గమనార్హం. 2024 జనవరి నాటికి, ఈ–నామ్ వల్ల రూ. 3 లక్షల కోట్లకు పైగా వ్యాపారం జరిగింది.



తగిన బాధ్యత

ఈ విజయవంతమైన నేపథ్యాన్ని పంచుకోవడం అత్యవసరం. రైతుకు విపత్కరమైన అమ్మకాల నుండి రక్షణ కల్పించే ఉద్దేశంతో 1950వ దశకంలో 'ఏపీఎంసీ'లను ప్రవేశపెట్టారు. 'ధర ఆవిష్కరణ'ను నిర్ధారించడానికీ, కనీస మద్దతు ధర వ్యవస్థలో రాష్ట్ర ఏజెన్సీల ద్వారా సేకరణకు వేదికను అందించడానికీ ఇవి రూపొందాయి. అయితే, ఈ ప్రక్రియలో, వారు మధ్యవర్తుల ప్రత్యేక తరగతిని కూడా సృష్టించారు. నిర్దిష్ట మండీలో దాని అధికారికమైన కమాండ్ ఏరియాతో లైసెన్స్ కలిగి ఉన్న వ్యాపారిని స్థిరపరిచారు.

అయితే, భారతదేశం ఐటీ సూపర్‌పవర్‌గా అవతరించడం, రైతు నుండి మార్కెట్ ఉత్పత్తి విధానంలోకి వ్యవసాయం మారడంతో, వాణిజ్య పరిమితి నిబంధనలను మార్చవలసిన అవసరం ఏర్పడింది. సాంకేతికతలు, ఆర్థిక సాధనాల ద్వారా సన్నకారు, చిన్న రైతులకు వాణిజ్య నిబంధనలను మెరుగుపరచడానికి ఎస్ఎఫ్ఏసీ వంటి సంస్థలు స్థాపితమయ్యాయి. వ్యవసాయ–వ్యాపార వ్యవస్థాపకులకు వెంచర్ క్యాపిటల్ నిధులను అందించడం నుండి మౌలిక సదుపాయాల కల్పన వరకు ఎస్ఎఫ్ఏసీ కొత్త పుంతలు తొక్కింది. అందుకే ఈ–నామ్ స్థాపన బాధ్యతను ఎస్ఎఫ్ఏసీకే అప్పగించడంలో ఆశ్చర్యం లేదు మరి.

దీనికి మరింత ఊపునిచ్చేలా, ఇ–మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయడానికిగానూ కంప్యూటర్ హార్డ్‌వేర్, ఇంటర్నెట్ సౌకర్యం, పరీక్షా పరికరాలు వంటి సామగ్రి లేదా మౌలిక సదుపాయాల కోసం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక్కో నియంత్రిత మండీకి రూ. 30 లక్షలు మంజూరు చేసింది. క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకేజింగ్ సౌకర్యాలు, బయో–కంపోస్టింగ్ యూనిట్ వంటి అదనపు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ మొత్తాన్ని 2017లో రూ.75 లక్షలకు పెంచారు. మొదటి మూడేళ్లలో దాదాపు 200 మండీలను దీని పరిధిలోకి తీసుకురాగా, 2020 మే నాటికి మరో 415 మండీలు జమయ్యాయి. 2022 జూలై నాటికి మరో 260 మండీలు, 2023 మార్చి నాటికి మరో 101 మండీలు పెరిగాయి. గత సంవత్సరం ముగిసేనాటికి మరో 28 వీటికి కలిశాయి. ప్రతి త్రైమాసికంలో ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది.

మరింత పురోగమించేలా...

విధాన రూపకల్పన అనేది సులభం. కానీ భౌతిక, ఐటీ మౌలిక సదుపాయాల కల్పనే కష్టం. ఇంకా కష్టతరమైనది క్షేత్రస్థాయిలో చేసే పని. ఈ–నామ్‌తో అనుసంధానమైన ప్రతి మండీకి ఒక ఏడాది పాటు ప్రారంభ శిక్షణ కోసం ఎస్ఎఫ్ఏసీ ఒక ఐటీ నిపుణుడిని (మండి విశ్లేషకుడు) గుర్తించి, మద్దతునిస్తుంది. వారు రాష్ట్ర సమన్వయ కర్త(ల)కు నివేదిస్తారు. ఈ సమన్వయకర్తలు ఒక్కొక్కరు 50 మండీల రోజువారీ సమన్వయాన్ని నిర్వహిస్తారు. ఈ–నామ్ విధానంలోని రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, మండి అధికారులందరికీ ఉచితంగా శిక్షణ ఇవ్వడం కూడా వీరి బాధ్యత.

తర్వాత ఏమిటి? సాధించిన పురోగతితో ఆగకుండా, ఈ–నామ్ కొత్త, ఉన్నత ప్రమాణాలను ఏర్పరుస్తోంది. దీని సవరించిన ఆదేశంలో రైతులకు పోటీ ధరలను సాధ్యం చేయడం కోసం కృషి చేస్తుంది. ఏపీఎంసీ నియంత్రిత మార్కెట్ కమిటీ మండీలకు వెలుపల కూడా వేదికలను ఏర్పాటుచేయడం ద్వారా దీన్ని సాధిస్తుంది. ఈ–నామ్ ద్వారా గిడ్డంగి ఆధారిత విక్రయానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంది. అంతిమంగా, ధరను కనుగొనడం, విక్రయించే స్వేచ్ఛ అనేవి రైతుకు ఎక్కువ మేలు చేస్తాయి.

వ్యాసకర్త లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ మాజీ డైరెక్టర్ ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అప్పటివరకే...



కాంగ్రెస్‌లో ఉండే సంఘీయులు కాంగ్రెస్ లోపల ఉన్నంతవరకే బీజేపీకి ఉపయోగం. వాళ్లను ఒకసారి బయటికి పంపేస్తే, వాళ్ల విలువ క్రమంగా సున్నా అవుతుంది.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

గెలిచే అవకాశం



అన్ని అంచనాలను దాటేస్తూ ఇండియా ఎకానమీ 8.4 శాతం జీడీపీ వృద్ధిరేటును (అక్టోబర్– డిసెంబర్ వరకు) నమోదు చేసింది. ఇది ఈ సంవత్సర ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరిన్ని ఎక్కువ సీట్లతో గెలిచే అవకాశాలను మరింతగా పెంచింది.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

నా నిరసన



దీన్ని నేను పోస్ట్ చేయడం వల్ల లాభం లేదని తెలుసు. దీనివల్ల తేడా కూడా ఏమీ ఉండదు. కానీ గాజా నరమేధానికి కారణం అవుతున్న ఇజ్రాయెల్, యూఎస్ ప్రభుత్వాల మీద; వాటికి మద్దతు ఇస్తున్నవారి మీద నా ఆగ్రహం, అసహ్యాలను నియంత్రించుకోలేక ఇది రాస్తున్నాను.

– బార్నెట్ ఆర్. రూబిన్, యూఎస్ పొలిటికల్ సైంటిస్ట్

అరగంట ముందు...



భోంచేస్తున్నప్పుడు నీటిని తాగడం అనేది జీర్ణక్రియకు ఆత్మాహత్యా సదృశం. దానికి బదులుగా భోజనానికి అరగంట ముందు నీళ్లు తాగండి. దీనివల్ల అవసరానికి మించి తినడం ఆగుతుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. జీర్ణ రసాయనాలు పలుచబడవు.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

అది తప్పు



ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న అత్యధికుల్లో అరబ్ యూదులు, అరబ్ ముస్లింలు, ఆఫ్రికన్ యూదులు, టర్కిష్ యూదులు ఉన్నారు. 'శ్వేత సామ్రాజ్యవాద ప్రాజెక్టు' అని ఇజ్రాయెల్‌ను పిలవడమంటే దారుణ అమాయకత్వం. – లుయీ అహ్మద్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

నలభీముల సాటి



చాలామంది కుక్స్, షెఫ్స్ ఉన్నారు; కానీ ఎవరూ ఇంతియాజ్ ఖురేషీకి సాటిరారు. పాకశాస్త్ర కళను అభ్యసిస్తున్న వాళ్లు ఎవరైనా ఆయన్ని ఒక ఐకాన్‌గా, స్ఫూర్తి ప్రదాతగా చూస్తారు. ఆహారం మీద ఆయనకు గొప్ప కుతూహలం ఉండేది. ఆయన లేని లోటు కనబడుతోంది. (దమ్‌పుఖ్త్– చిన్న మంట మీద నెమ్మదిగా ఉడికించే సంప్రదాయాన్ని పునరుద్ధరించిన ఇంతియాజ్ ఖురేషీ తన 93వ ఏట ఇటీవల మరణించారు.) – సదాఫ్ హుస్సేన్, షెఫ్

విసిగిస్తే అంతే మరి...



పడిపోయాడని 92 ఏళ్ల మా నాన్నను హాస్పిటల్‌కు తీసుకెళ్లాను. రక్తమోడుతున్న చేతికి చికిత్స చేయాల్సింది పోయి, ఆయన్ని 1. మీరు కోవిడ్, ఫ్లూ బూస్టర్స్ ఠంచనుగా వేసుకుంటున్నారా? 2. మీ ఇంట్లో తుపాకులు ఉన్నాయా? 3. మీకు ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నాయా? అని అడిగారు. ఆయనకేమో చెవుడు. 'డాడ్, నిన్ను నువ్వు చంపుకోవాలనుకుంటున్నావా?' అని ఆవిడ అడుగు తోంది' అని విడమరిచాను. 'ఇప్పటిదాకా అయితే అనిపించలేదు' అని గట్టిగా నవ్వారు.

– కెల్లీ పాల్, యూఎస్ రచయిత్రి

ఇన్ బాక్స్

సంపూర్ణ విజయం ఖాయం

ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వైసీపీ విజయం సాధిస్తుందన్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్షాలు అన్నీ యెల్లో ముఠాగా ఏర్పడి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా అనేక దుష్ప్రచారాలకు పాల్పడటం చూస్తుంటే జగన్ మళ్లీ గెలుస్తాడని వారు గట్టిగా నమ్ముతున్నారనిపిస్తోంది. దాదాపు తాను ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన జగన్ మళ్లీ ఎన్నికలకు ప్రజలపై అత్యంత విశ్వాసం ఉంచి 'సిద్ధం' అవ్వడం చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గిన్నిస్ బుక్‌లో ఎక్కదగిన భీమిలి, దెందులూరు, రాప్తాడు 'సిద్ధం' సభలకు వచ్చిన అశేష జనవాహిని మరోసారి జగన్ విజయం తథ్యం అని చెప్పకనే చెబుతోంది.

జగన్ ముఖ్యమంత్రి కావాలని 2019 ఎన్నికలలో 49.95 శాతం ఓటర్లు ఫ్యాన్ గుర్తును ఎంచుకున్నారు. 151 అసెంబ్లీ, 22 లోక్‌సభ స్థానాలలో గెలిపించారు. జగనన్న ప్రజలకు మాట ఇచ్చిన విధంగానే 57 నెలల్లో 125 సార్లు బటన్ నొక్కి 85 శాతం ప్రజలకు 2.55 లక్షల కోట్ల రూపాయలను డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో వేశారు. పెన్షన్లు, రైతు భరోసాల వంటి పథకాలు ఎందరినో ఆదుకొంటున్నాయి. పెద్దెత్తున ఎస్సీ, ఎస్టీ, బీసీలకూ, మహిళలకూ, మైనారిటీలకూ పదవులను ఇచ్చి వారికి పరిపాలనలో భాగస్వామ్యాన్ని కలిగించి గౌరవించారు. ఇంగ్లీష్ విద్య, 'అమ్మఒడి', ఆరోగ్య రంగంలో వినూత్న అభివృద్ధి వంటివి జగన్ ప్రభుత్వ విజన్‌కు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు వెల్లువలా వచ్చాయి. బాబు అవినీతి, ఆశ్రిత పక్షపాత జన్మభూమి కమిటీలను కూకటి వేళ్ళతో జగన్ పెకలించి వేశారు. గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా గ్రామ సచివాలయ వ్యవస్థ తెచ్చారు. ప్రభుత్వ పథకాల వల్ల రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఏదో ఒక లబ్ధి పొందుతూనే ఉంది. 'నవరత్నాల'తో సర్వ జనుల జీవన ప్రమాణాలను, ఆదాయాన్ని పెంచారు. వీటన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రజలు జగన్ ఊహిస్తున్న విధంగానే 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25కు 25 పార్లమెంటు స్థానాలలో వైసీపీకే విజయం చేకూర్చడం ఖాయం.

– ఆచార్య జి. రామచంద్రారెడ్డి, ఏపీ అధికార భాషా సంఘం సభ్యులు

కుల రహిత భారతం సాధ్యమే

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

భారతదేశానికి 'కులం' అనేది ఓ శాపం లాంటిది. కుల వ్యవస్థ... తద్వారా వచ్చిన సామాజిక అంతరాల వల్ల ఉత్పత్తి శక్తుల ప్రతిభ నిర్వీర్యమైంది. మనిషిని మనిషిగా చూడలేని దుర్మార్గ వ్యవస్థ వేల ఏండ్లుగా కొనసాగుతోంది. అంబేడ్కర్ లాంటి ప్రపంచ మేధావియే కుల వ్యవస్థ దుర్మార్గం వల్ల విపరీతమైన వేదనకు గురయ్యారు. ఈ కులవ్యవస్థ పొడగింపు ప్రజాస్వామ్య ప్రభుత్వాల కాలంలోనూ కొనసాగడం గమనార్హం.

కులవ్యవస్థ భారత జాతిని నిర్వీర్యం చేసింది. దేశంలోని 85 శాతం ప్రజలను సేవకులుగా మార్చింది. అందుకే కుల రహిత భారతాన్ని కోరుకున్నారు అంబేడ్కర్. భారతదేశం కుల రహితంగా మారేంత వరకూ, ఆ వ్యవస్థ వల్ల వచ్చిన సామాజిక అంతరాలు పోయే వరకూ శూద్రులకు, అతిశూద్రులకు రిజర్వేషన్లు కల్పించాలని పోరాడి రాజ్యాంగంలో పొందుపరిచారు. కుల నిర్మూలన సిద్ధాంతాన్ని అందించారు. కులరహిత భారతాన్నీ, సెక్యులర్ భారతాన్నీ అంబేడ్కర్ కోరుకున్నారు. కానీ, రాజ్యాధికారంలో ఉంటున్నదీ, రాజ్యాంగాన్ని అమలుపరిచే స్థానంలో ఉంటున్నదీ కుల వ్యవస్థ వల్ల లాభపడుతున్న వారే కావడం వల్ల కుల నిర్మూలన జరుగడం లేదు. రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశిక సూత్రాలు కూడా అమలు కావడం లేదు.

ఏది ఏమైనా దేశాన్ని అంధకార యుగంలోకి తీసుకు వెళ్ళే కులవ్యవస్థ అంతరించాల్సిందే. కులవ్యవస్థ అంతరించడమంటే వృత్తి పనులు అంతరించడం కాదు. అన్ని దేశాల్లోనూ వివిధ వృత్తులకు సంబంధించిన పనులున్నాయి, కానీ కులాలు లేవు. కుల వృత్తులు లేవు. అయితే కులవ్యవస్థ లేనిచోట అన్ని సమస్యలూ పరిష్కారమైనాయా అంటే కాక పోయి ఉండవచ్చుగాక. కాని, కులవ్యవస్థ



వల్ల వచ్చే పుట్టుకతోనే దఖలుపడే అధికారాలు, ఆస్తులు, వివక్ష, పేదరికం, సామాజిక అంతరాలు అక్కడ లేవు. దేశంలోని కోట్లాది మందిని అస్పృశ్యులుగా ముద్ర వేయడం ఏ దేశంలోనూ లేదు. ఒక్క భారత్‌లో తప్ప. కుల రహిత భారతం ఏర్పడితే భారత జాతి అంతా ఒక్క టవుతుంది. సామాజిక అంతరాలు దూరమవుతాయి. ఎవరికిష్టమైన పనిని, వృత్తిని వారు స్వీకరిస్తారు. ఇది తక్కువ పని, అది ఎక్కువ పని అనే భేద భావాలు తొలగిపోతాయి. విదేశాల్లోలా కులాల బట్టి కాకుండా ఎవరికి ఏ పనిలో నైపుణ్యముంటుందో ఏ పని చేయడానికి ఇష్టపడుతారో ఆ పని చేస్తారు. అందరూ అన్ని పనులూ చేస్తుంటే సామాజిక అంతరాలు ఆటోమేటిక్‌గా తొలగిపోతాయి.

కులాలను కాపాడుతున్నవారు కులాలతో సామాజిక గౌరవం, ఆస్తులు, రాజ్యాధికారం అనుభవిస్తున్నారు. వీళ్ళు కులనిర్మూలనకు సహకరించకపోగా కులాలను పెంచి పోషిస్తున్నారు. వీరి స్థానంలో కుల బాధితులూ, కులంలో అత్యంత హీనస్థితిలో ఉన్నవారూ, మూలజాతుల వారూ రాజ్యాధికారంలోకి వస్తే మంచి ఫలితం ఉంటుంది. వీరు కనీసం యాభై ఏళ్లు పరిపాలన చేస్తే కుల నిర్మూలన జరుగుతుంది.

నిచ్చెన మెట్ల కుల సమాజంలో అట్టడుగున ఉన్నవారు రాజ్యాధిరారంలోకి వస్తే పై మెట్టుపై ఉన్న వారు మాకీ కులాలు వద్దని మొత్తుకుంటారు. కుల నిర్మూలనకు సహకరిస్తారు. ఎలాగూ వేల ఏండ్లుగా బాధితులైన మూలజాతుల వారు తాము పాలకులై తమను ఇన్నేండ్లుగా బాధలో ఉంచిన కులాన్ని నిర్మూలించే ప్రయత్నం చేస్తారు. ఇలా అటు అగ్రకులాల వారూ, ఇటు శూద్ర, అతిశూద్ర కులాలవారూ కులనిర్మూలనకు సహకరిస్తే ఓ యాభై అరవై ఏళ్లల్లో దేశం లోంచి కులం మాయమైపోతుంది.

వ్యాసకర్త ప్రముఖ కథా రచయిత
మొబైల్: 91829 18567

తామరాకుపై నీటిబొట్టు!

'శూన్యమైన మనస్సు' అనేది సాధ్యమయ్యే పనేనా? అంటే కాదనే సమాధానం వస్తుంది. బాహ్య ప్రపంచాన్ని పూర్తిగా త్యజించి చేసే అతి కఠోరమైన తపస్సులో కూడా మనస్సు శూన్యం కాదన్న విషయాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే ఇందులో నిజం అర్థమౌతుంది. తపస్సు ఒక ధ్యానం. ఏదైతే ధ్యానించబడుతుందో దానితో మనసు నిండిపోయి ఉంటుంది. మనస్సును ఎంతవరకు ఖాళీ చెయ్యగలమంటే 'ఏకాగ్ర చిత్తం' అనే స్థాయి వరకే అనేది సత్యం. అంతకు మించిన స్థితి సాధ్యమయ్యేది కాదు. ధ్యానంలో అయినా, తపస్సులో అయినా పనిచేస్తూ ఉండేది ఏకాగ్ర చిత్తమే అన్నది అర్థం చేసుకోవచ్చు. విషయ లాలసకు లోనుకాని చిత్తం ఏకాగ్రతను అతి సులభంగా అందిపుచ్చుకునే సామర్థ్యం కలిగినదిగా ఉంటుంది. రోజువారీ జీవనంలో అనివార్యంగా వచ్చే సుఖం, అనగా ప్రయత్నం చేసి కూడా తాను నివారించ లేని సుఖాన్ని అనుభవించడం విషయలాలస అనిపించుకోదు. కనుపర్తి అబ్బయామాత్యుడు 'కవిరాజ మనోరంజనం' కావ్యం, ప్రథమాశ్వాసం లోని ఒక పద్యంలో, ఆ స్థితిలోని ఔన్నత్యాన్ని ఇలా వర్ణించాడు:



జ్యోతిర్మయం

నిర్విషయ చిత్తుడగు బ్రహ్మనిష్ఠునకును
దనుసుఖంబులు ప్రారబ్ధమున ఘటించు
నంతియే కాని యవి వాని నంటకుండు
గమలపత్రాగ్రమున జలకణిక వోలె.

విషయలాలసకు లోనుకాకుండా, నిర్విషయ చిత్తంతో బ్రహ్మైక్యం సాధించడమనే కోరిక తప్ప మరే ఇతర కోరిక లేని మనసు కలిగిన వ్యక్తికి కూడా 'తను సుఖంబులు' – అనగా శరీరానికి సంబంధించిన సుఖాలు – రోజువారీ జీవితంలో ఆ వ్యక్తి ఆచరించే కర్మలకు అనుగుణంగా తప్పక కలుగుతూనే ఉంటాయి. తప్పించుకోవాలన్నా తప్పనివిగా ఆ సుఖాలు ఉంటుంటాయి. అయినప్పటికీ ఆ సుఖాలు అతడి అంతరంగాన్ని అంటిపెట్టుకుని ఉండి, జీవితాన్ని ప్రభావితం చేసేవిగా మాత్రం ఉండవు. 'తామరాకుపై నీటిబొట్టు' చందంగా ఉంటాయి అని పోల్చాడు కనుపర్తి అబ్బయామాత్యుడు పై పద్యంలో. ఆ పోలికలో 'నీటిబొట్టు' అని చెప్పడానికి 'జలకణిక' అనే కొత్త మాటను ఉద్దేశపూర్వకంగానే ప్రయోగించాడు. పాపం అంటనిది, పవిత్రతకు ప్రతిరూపం అయినటువంటిది అయిన 'నిప్పుకణిక' నుంచి స్ఫూర్తిని పొంది సృజించిన మాట ఈ 'జలకణిక' 'నిప్పుకణిక' అంత పవిత్రమైనదే తామరాకుపై నిలిచి ఉండే 'జలకణిక' వంటి నిర్విషయ చిత్తుడి నిర్వికార అంతరంగం అని చెప్పడం అందులో కవి ఉద్దేశ్యం.

– భట్టు వెంకటరావు

ఆంధ్ర ప్రజలారా.. షర్మిలను నమ్మొద్దు

తెలంగాణలో పార్టీ పెట్టి మమ్మల్ని నట్టేట ముంచింది

- రాజన్న బిడ్డనంటూ వచ్చి నయవంచన చేసింది
- తెలంగాణ వైఎస్సార్‌టీపీ నేతల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ నేతలు సుధీర్‌బాబు, గుప్తా, రాజ్‌కుమార్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తా, అందుకే ఇక్కడ పార్టీ పెడుతున్నా.. వైఎస్సార్ అభిమానులు, నాయకులు నా వెంట నడవండి. నేను నిలబడతా.. మిమ్మల్ని నిలబెడతా'.. అంటూ మాటలు చెప్పిన షర్మిల చివరకు తమను నట్టేట ముంచిందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. 'రెండు, మూడేళ్ల షర్మిల వెంట నడిచాం. లక్షల రూపాయలు ఖర్చుచేశాం. చివరికి ఎవరికీ చెప్పకుండా కాంగ్రెస్‌తో చీకటి ఒప్పందాలు చేసుకుని పార్టీని విలీనం చేసింది. మమ్మల్ని ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బ తీసింది. తెలంగాణ నుంచి పారిపోయి ఆంధ్రకు వచ్చి పీసీసీ పదవి దక్కించుకుంది'.. అని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంధ్ర ప్రజలారా మీకు చేతులెత్తి దండం పెడతాం.. షర్మిలను నమ్మొద్దంటూ హెచ్చరించారు. షర్మిల చేతిలో ఆర్థికంగా నష్టపోయి, రాజకీయంగా భవిష్యత్ కోల్పోయిన వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర నాయకులు శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు.

రూ.30లక్షలు వసూలుచేశారు..

ఉమ్మడి ఖమ్మం జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు మాట్లాడుతూ.. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టిన నాటి నుంచి తాను పార్టీ ఖమ్మంజిల్లా అధ్యక్షుడుగా పనిచేస్తున్నానని.. కరోనా కష్ట సమయంలో ఖమ్మంలో సంకల్ప సభ నిర్వహించానన్నారు. సతీష్, కొండలరావు, సుబ్బారావు అనే ముగ్గురి కోటరీలోనే షర్మిల పాదయాత్ర చేపట్టారని, సతీష్ అనే వ్యక్తి ప్రతి జిల్లాలో నాయకుల నుంచి రూ.లక్షలు వసూలు చేశారన్నారు. జిల్లా అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న తన వద్దే సతీష్ రూ.30లక్షలు వసూలు చేశారని.. ఇందుకు తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. షర్మిల కల్లబొల్లి కబుర్లు చెప్పి ఆర్థికంగా, రాజకీయంగా తమ జీవితాలు నాశనం చేసిందని ఆరోపించారు.

ఆంధ్రలో ఎక్కడ తిరిగినా అడ్డుకుంటాం

తెలంగాణలో పార్టీ పెట్టే రోజు ఆంధ్రలో రాజన్న రాజ్యం వచ్చింది. తెలంగాణలో కూడా రాజన్న రాజ్యం తేవాలని పార్టీ పెడుతున్నానని షర్మిల చెప్పిందని వైఎస్సార్‌టీపీ ఎస్టీ విభాగం నాయకులు బాణోతు రాజ్‌కుమార్ అన్నారు. దీంతో తాను షర్మిల వెంట పాదయాత్ర చేశానన్నారు. రాజన్న బిడ్డ అంటే పులిబిడ్డ అనుకున్నామని కానీ, ఆమె పిల్లిలా ఆంధ్రకు పారిపోయి ఊసరవెల్లిలా రంగులు మార్చిందని మండిపడ్డారు. ఏపీలో ఆమె ఎక్కడ తిరిగినా, ఎక్కడ పోటీచేసినా అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు. ఇక క్రిస్టియన్ మైనార్టీ నాయకులు డేవిడ్ శాంతారావు మాట్లాడుతూ.. షర్మిల అబద్ధాలకు మారుపేరన్నారు. ఆమె మాటలు నమ్మి తెలంగాణలో అనేకమంది నాయకుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. సమావేశంలో.. 'ఆంధ్రప్రదేశ్ ప్రజలారా జర జాగ్రత్త!' అని రూపొందించిన కరపత్రం విడుదల చేశారు.

రాప్తాడులో 'సభ'బు కాదు బాబూ!

- 'సిద్ధం' సభతో జనం పోల్చి చూస్తారు
- ఆ స్థాయిలో జయప్రదం కాకపోతే ఇబ్బందే
- చంద్రబాబుకు టీడీపీ నేతల హితవు
- ఉన్నపళంగా పెనుకొండకు సభాస్థలి మార్పు
- ధర్మవరం సీటుపై స్పష్టత ఇస్తేనే సహకారమన్న పరిటాల కుటుంబం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఈనెల 4న నిర్వహించాల్సిన చంద్రబాబు సభను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు మార్చారు. కొంతమంది తెలుగుదేశం పార్టీ నేతలు శుక్రవారం పెనుకొండలో హెలిప్యాడ్ కోసం స్థలం కూడా చూశారు. ఉన్నపళంగా సభా ప్రాంతాన్ని మార్చడంపై టీడీపీ కార్యకర్తల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. తమకు ధర్మవరం ఎమ్మెల్యే సీటుపై స్పష్టత ఇస్తేగానీ రాప్తాడులో సభ నిర్వహణకు సహకరించలేమని పరిటాల సునీత వర్గం చెప్పినట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాప్తాడు సీటు సునీతకు కేటాయించగా.. ధర్మవరం సీటు తన కుమారుడు పరిటాల శ్రీరామ్‌కు ఇవ్వాలని ఆమె పట్టుపడుతున్నారు. కానీ వరదాపురం సూరికి ధర్మవరం సీటు ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాప్తాడులో సభ నిర్వహించడం సరికాదని పెనుకొండకు మార్చినట్టు తెలుస్తోంది.

సిద్ధం సభతో పోల్చుకుంటారు!

ఫిబ్రవరి 18న వైఎస్సార్ సీపీ రాప్తాడులో 'సిద్ధం' సభ నిర్వహించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరైన ఈ సభకు చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు తరలివచ్చారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు ఈ నియోజకవర్గంలో సభ నిర్వహిస్తే 'సిద్ధం' సభతో ప్రజలు పోల్చుకుంటారని, సభ జయప్రదం కాకపోతే కార్యకర్తల్లో మనోధైర్యం సడలే అవకాశం ఉంటుందని పార్టీ నేతలు కొందరు చంద్రబాబుకు చెప్పినట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాప్తాడు సిద్ధం సభ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఈ పరిస్థితుల్లో మూడు దఫాలు ముఖ్యమంత్రిగా, ఎక్కువ కాలం ప్రతిపక్ష నేతగా ఉన్న బాబు ఇక్కడ సభ పెట్టి, అది ఫెయిల్ అయితే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని ఆ పార్టీ నేతలు చెప్పినట్టు తెలిసింది. దీంతో ఉన్నపళంగా సభను రాప్తాడు నుంచి పెనుకొండకు మార్చారు. నెలరోజుల క్రితం ఉరవకొండలో చంద్రబాబు సభ నిర్వహించినప్పుడు కూడా జనం అంతంతమాత్రంగానే వచ్చారు.

కట్టడి చేసేందుకే 24 సీట్లకే పరిమితం

పవన్‌కు బాబు సముచిత స్థానం కల్పిస్తారంటే నమ్మేదెవరు?: మాజీ ఎంపీ జోగయ్య



పాలకొల్లు సెంట్రల్: వెన్నుపోటు రాజకీయాలకు అలవాటు పడ్డ చంద్రబాబు ఎన్నికల తరువాత పవన్ కళ్యాణ్‌కు సముచిత స్థానం కల్పిస్తాడని ఎవరు నమ్ముతారని మాజీ ఎంపీ హరిరామజోగయ్య ప్రశ్నించారు. జనసేనను నిర్వీర్యం చేసి లోకేష్‌కు అధికారం కట్టబెడతారనే భయం జనసైనికులందరిలోనూ ఉందన్నారు. ఎన్నికలకు ముందే పవన్ స్థానం ఏమిటో తేల్చాలని జనసైనికుల తరపున డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. పవన్‌ను పదే పదే ప్యాకేజీ స్టార్‌గా విమర్శిస్తున్నా చంద్రబాబు, లోకేశ్ ఎందుకు నోరు విప్పడం లేదో తెలుసా? అని నిలదీశారు. పవన్‌ను ప్యాకేజీ స్టార్‌గా నమ్మించడం ద్వారా జనసేనను నిర్వీర్యం చేసి లబ్ధి పొందాలని టీడీపీ కుట్రలు చేస్తోందన్నారు. పవన్‌ను ఒంటరిని చేస్తూ చంద్రబాబుకు దాసోహం అనేలా ఎల్లో మీడియా ప్రచారం చేస్తోందన్నారు. తన సలహాలను వక్రీకరిస్తూ వైఎస్సార్‌సీపీ కోవర్టుగా ఎల్లో మీడియా తనపై ముద్ర వేయడం ఎంతవరకూ సమంజసమని నిలదీశారు. ఈమేరకు పవన్‌కు రాసిన మరో లేఖను శుక్రవారం పాలకొల్లులో ఆయన మీడియాకు విడుదల చేశారు. చంద్రబాబు కాబోయే ముఖ్యమంత్రి అని గతంలో పేర్కొన్న నారా లోకేశ్, పవన్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్నా టీడీపీ పొలిట్ బ్యూరో ఆమోదం ఉండాలనటాన్ని జోగయ్య గుర్తు చేశారు. జనసేనకు 40 నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులున్నా 24 సీట్లకే కుదించటాన్ని బట్టి చంద్రబాబును శాసించకుండా జాగ్రత్త పడుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. జనసేన మద్దతు లేకుండా టీడీపీ గెలవడం అసాధ్యమని చంద్రబాబుకు తెలుసని జోగయ్య పేర్కొన్నారు. ఇకనైనా మిత్రులెవరో, శత్రువులెవరో పవన్ తెలుసుకోవాలన్నారు.

హింసించిన బాబును కాపులు ఎలా నమ్ముతారు?

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, అమరావతి: గడచిన ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేళ్లను చెప్పి.. ఓటు వేయండి.. అంటూ మా పార్టీ అభ్యర్థులు అడుగుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. విజయవాడలో శుక్రవారం ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్‌గా డీవీ సూర్యనారాయణరాజు పదవీ బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథి మంత్రి మాట్లాడుతూ.. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసి ప్రజలకు తాను ఫలానాది చేశానని చెప్పుకునే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. జనసేన – టీడీపీ విడుదల చేసిన జాబితాను పరిశీలిస్తే కాపుల్ని కమ్మలు, కమ్మ కులస్తులను కాపులు నమ్మడం లేదనేది తేలిపోయిందని చెప్పారు. వంగవీటి రంగా నుంచి ముద్రగడ పద్మనాభం వరకు కాపులను హింసించిన చంద్రబాబును, టీడీపీని ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డీవీ సూర్యనారాయణరాజును అభినందిస్తున్న మంత్రి అమర్‌నాథ్ →



వికేంద్రీకరణ పాలనకే ఆదరణ

1,251వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: వికేంద్రీకరణ, మూడు రాజధానులపైనే రాష్ట్రంలో చర్చ కొనసాగుతుందని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి చేసే పార్టీనే ఆదరించేందుకు ప్రజలంతా మొగ్గు చూపుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,251వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రం నలుమూలలా అభివృద్ధి చెందితే అన్ని వర్గాలు, కులాలు, మతాలు, ప్రాంతాలు సమానాభివృద్ధి జరుగుతుంది కానీ, ఒకే వర్గం, ఒకే ప్రాంతం, ఓ సామాజిక వర్గ ప్రయోజనాల కోసమే రాజధాని అభివృద్ధి చేస్తే మిగిలిన వారి సంగతేంటని ప్రశ్నించారు. చంద్రబాబు రాష్ట్రంలో కులవాదాన్ని రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని కుట్రలు పన్నుతున్నాడన్నారు. రాజధాని ప్రాంతంలో రైతు కూలీలకు జీవన భృతి పెంచి హామీ ఇచ్చిన 14 రోజుల్లో జీవో విడుదల చేసి అందజేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. పవన్‌కళ్యాణ్ పిచ్చి పట్టిన వాడిలా వేదికలపై మాట్లాడుతున్న మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, బోదాల సౌమ్య, బోదాల సలోమీ, కారుమూరి పుష్పరాజు, బొలిమేర శ్యామ్యూల్, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పరమ నీచుడు

- ఇంత నీచుడిని ప్రపంచంలో ఎవరూ చూసి ఉండరు
- కుటుంబాల మధ్య చిచ్చు పెట్టడం వెన్నతో పెట్టిన విద్య
- బాబు కబంధ హస్తాల్లో షర్మిల, సునీత చిక్కుకున్నారు
- తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి ధ్వజం



సాక్షి, విశాఖపట్నం: కుటుంబాల మధ్య చిచ్చు పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఏపీ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి ధ్వజమెత్తారు. షర్మిల, సునీత ఆయన కబంధ హస్తాల్లో చిక్కుకున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అంత పరమనీచుడు ప్రపంచంలోనే ఎవరూ ఉండరన్నారు. శుక్రవారం విశాఖపట్నం ఎండాడలో లక్ష్మీపార్వతి మీడియాతో మాట్లాడారు. రామ్‌గోపాల్ వర్మ తీసిన వ్యూహం సినిమాలో వంద శాతం చంద్రబాబు క్యారెక్టర్‌ను చూపించారని తెలిపారు. చంద్రబాబు గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. సొంత మామను వెన్నుపోటు పొడిచిన వ్యక్తి అతడన్నారు. అప్పుడు ఎన్టీఆర్‌కు, ఆయన కుమారుడికి మధ్య చిచ్చు పెట్టాడని, ఇప్పుడు వైఎస్సార్ కుటుంబంలో అన్నాచెల్లెళ్ల మధ్య చిచ్చు పెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఏ కుటుంబాన్ని విడదీద్దామా..? ఎవరికి వెన్నుపోటు పొడుద్దామా..? అని చూస్తుంటాడని నిప్పులు చెరిగారు. చంద్రబాబు సమర్థుడు అయితే గత ఎన్నికల్లో 23 సీట్లకే ఎందుకు పరిమితమయ్యారని ప్రశ్నించారు. ఆయనపై 50కి పైగా కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. చంద్రబాబు ఒక స్మగ్లర్, ఒక అరాచక శక్తి అని విమర్శించారు అవినీతిలో కూరుకున్న బాబు దగ్గరకు వెళ్లి పవన్ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. వివేకా హత్య ఎవరు చేశారో అందరికీ తెలుసని చెప్పారు. సునీత కూడా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, దీని వెనుక చంద్రబాబు హస్తముందన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబుకు సంస్కారం లేదని ధ్వజమెత్తారు. బాబుకు నిజమైన మొగుడు సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనన్నారు. జనసైనికులకు ఉన్న పౌరుషం కూడా పవన్ కళ్యాణ్‌కు లేదన్నారు. కాపులను చంద్రబాబుకు తాకట్టు పెట్టడానికి సిద్ధమయ్యాడని మండిపడ్డారు. బాబు మాయలో పడి ఆయనలా కావద్దని హితవు పలికారు. సీఎం జగన్ గురించి పవన్ హద్దులు దాటి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు చేతిలో పవన్ బందీ అయ్యాడన్నారు.

హోదా మాట ఎత్తకుండానే సీఎం జగన్ పాలన

ఏపీసీసీ చీఫ్ షర్మిల



తిరుపతి సిటీ/తిరుపతి అలిపిరి: సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక హోదా మాట ఎత్తకుండా పాలన సాగిస్తున్నారని ఏపీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ సాధన సభకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తిరుపతిలోని ఇదే ప్రాంగణంలో 2014లో ఎన్నికల ప్రచారంలో మోదీ.. పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇచ్చితీరుతానని స్వామి వారి సాక్షిగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే ఆంధ్రాను పట్టించుకోకపోగా మూడు నామాల వానికే పంగనామాలు పెట్టాడని విమర్శించారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు ఊసరవెల్లిలా రంగులు మార్చుతూ ప్రత్యేక హోదా 15 ఏళ్లు కావాలని డిమాండ్ చేసి.. అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా సంజీవినా.. అంటూ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. మద్యం నిషేధం అని చెప్పి కల్తీ మద్యం అమ్ముతుండటంతో రాష్ట్రంలో 25 శాతం మరణాలు పెరిగాయని ఆరోపించారు. విభజన హామీలు నెరవేర్చి రాజన్న రాజ్యం తేవాలనే రాష్ట్రంలో కోమాలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు షర్మిల తెలిపారు. అనంతరం ఏఐసీసీ సీనియర్ నేత సచిన్ పైలెట్, మాజీ ఎంపీ చింతామోహన్‌లు ప్రసంగించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

లావొక్కింత మితిమీరె!

100 కోట్లు దాటిన స్థూలకాయులు ● వారిలో టీనేజీ దాటనివారే 16 కోట్లు

ప్రపంచం లావెక్కిపోతోంది. అన్ని దేశాల్లోనూ కలిపి స్థూలకాయుల సంఖ్య ఇప్పటికే అక్షరాలా 100 కోట్లు దాటేసింది! 1990 నుంచే వీరి సంఖ్యలో ఏకంగా నాలుగు రెట్ల పెరుగుదల నమోదైంది. మూడు దశాబ్దాల క్రితం దాకా పెద్దల్లోనే ఎక్కువగా కన్పించిన ఊబకాయ సమస్య ఇప్పుడు చిన్నారుల్లో కూడా పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఆధునిక జీవితపు ఒత్తిళ్లతో పాటు పౌష్టికాహార లోపం కూడా దీనికి ప్రధాన కారణమేనని తాజా అధ్యయనంలో తేలింది. మొత్తమ్మీద ప్రపంచవ్యాప్తంగా 2022 నాటికే వయోజనుల్లో ఊబకాయుల సంఖ్య 88 కోట్లు దాటింది. అలాగే టీనేజీ లోపు వయసు వారిలోనూ 16 కోట్ల పై చిలుకు ఊబకాయంతో బాధపడుతున్నారు. టోంగా, నౌరు, సమోవా తదితర దేశాల్లో మూడొంతులకు పైగా జనం ఊబకాయులేనట! 1990 నుంచి 2022 మధ్య పలు గణాంకాలు తదితరాల ఆధారంగా అధ్యయనం సాగింది. ఈ జాబితాలో అమెరికా కూడా పురుషుల్లో పదో స్థానంలో, మహిళల్లో 36వ స్థానంలో నిలిచింది. ఈ దేశాల్లో అనారోగ్యకరమైన ఆహారపు టలవాట్లే సమస్యకు ప్రధాన కారణమని తేలినట్టు అధ్యయన బృంద సభ్యుడు ప్రొఫెసర్ మజీద్ ఎజాటి వెల్లడించారు. మరోవైపు తక్కువ బరువుతో బాధపడుతున్న వారి సంఖ్యలో 50 శాతం తగ్గదల నమోదైంది. కాకపోతే నిరుపేద దేశాలు, సమాజాల్లో ఇది ఇంకా ప్రబల సమస్యగానే ఉందని అధ్యయనం పేర్కొంది. భారత్‌లోనూ ఊబకాయుల సంఖ్య 8 కోట్లు దాటినట్టు వెల్లడించింది.

తక్షణం మేల్కొనాలి...

ఒకప్పుడు ప్రధానంగా పెద్దవాళ్లలోనే కన్పించిన స్థూలకాయ సమస్య ఇప్పుడు స్కూలు వయసు చిన్నారుల్లోనూ ప్రబలమవుతుండటం చాలా ఆందోళనకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ గేబ్రియేసస్ అన్నారు. చిన్న వయసులోనే గుర్తించి అరికట్టాల్సిన అవసరాన్ని తాజా సర్వే మరోసారి నొక్కిచెప్పిందని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా పెద్ద ఎత్తున ముందుకు రావాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకరమైన ఆహారం, నియమిత వ్యాయామాలు తదితరాలను జీవన శైలిలో భాగంగా మార్చుకోవడం తప్పనిసరన్నారు. పలు దేశాల్లో ప్రధానంగా పౌష్టికాహార లోపమే స్థూలకాయానికి దారి తీస్తోందని అధ్యయనంలో పాలుపంచుకున్న మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ గుహా ప్రదీప అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులు, కోవిడ్ కల్లోలం, ఉక్రెయిన్ యుద్ధం వంటివన్నీ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయని వివరించారు. ''ఇవి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఖరీదైన వ్యవహారంగా మార్చేస్తున్నాయి. ఫలితంగా చాలా దేశాల్లో ప్రజలకు చాలీచాలని, నాసిరకం ఆహారం అందుతోంది'' అని ఆవేదన వెలిబుచ్చారు.

మహిళల్లో టాప్ 10 ఊబకాయ దేశాలు	
దేశం	ఊబకాయుల శాతం
టోంగా	81
అమెరికన్ సమోవా	81
సమోవా	75
తొకలావ్	75
తువలు	73
కుక్ ఐలాండ్స్	73
నౌరు	73
న్యూయే	71
ఈజిప్ట్	59
మైక్రొనేసియా	57

పురుషుల్లో టాప్ 10 ఊబకాయ దేశాలు	
దేశం	ఊబకాయుల శాతం
అమెరికన్ సమోవా	70
నౌరు	70
తొకలావ్	67
కుక్ ఐలాండ్స్	66
న్యూయే	64
టోంగా	63
తువలు	58
సమోవా	53
ఫ్రెంచ్ పాలినేసియా	47
అమెరికా	42



ఇలా చేశారు...

- అధ్యయనంలో 1,500 మందికి పైగా రీసెర్చర్లు పాలుపంచుకున్నారు.
- ఎన్‌సీడీ రిస్క్ ఫ్యాక్టర్ కొలాబరేషన్ పేరిట వీరంతా ప్రపంచ ఆరోగ్య సంస్థతో పని చేశారు.
- ప్రపంచవ్యాప్తంగా 190కి పైగా దేశాల నుంచి ఐదేళ్ల పైబడ్డ 22 కోట్ల మందికి పైగా ప్రజల ఎత్తు, బరువు తదితర శారీరక కొలతలను సేకరించారు.
- ఊబకాయాన్ని నిర్ధారించేందుకు బాడీ మాస్ ఇండెక్స్‌ను ఆధారంగా తీసుకున్నారు.

గణాంకాలివీ...

- ప్రపంచవ్యాప్తంగా వయోజనుల్లో 88 కోట్లు, టీనేజీ, ఆ లోపు వారిలో దాదాపు 16 కోట్ల మంది ఊబకాయులున్నారు.
- వయోజన ఊబకాయుల్లో 50 కోట్లకు పైగా పురుషులు కాగా 38 కోట్ల మంది స్త్రీలు.
- 1990లో వయోజనుల్లో ఊబకాయుల సంఖ్య 20 కోట్ల లోపే ఉండేది.
- వారిలో స్త్రీలు 13 కోట్లు కాగా 7 కోట్ల మందికి పైగా పురుషులుండేవారు.

భారత్‌లోనూ...

భారత్ కూడా ఊబకాయ సమస్యతో బాధపడుతోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య బాగా పెరుగుతుందటం ఆందోళన కలిగిస్తోంది. వయోజన మహిళల్లో ఊబకాయులు 1990లో కేవలం 1.2 శాతముండగా 2022 నాటికి ఏకంగా 9.8 శాతానికి పెరిగారు. పురుష జనాభాలో ఊబకాయుల సంఖ్య 0.5 శాతం నుంచి 5.4 శాతానికి పెరిగింది. మొత్తమ్మీద 2022 నాటికి దేశవ్యాప్తంగా 4.4 కోట్ల మహిళలు, 2.6 కోట్ల మంది పురుషులు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఇక దేశవ్యాప్తంగా 5–19 ఏళ్ల మధ్య వయస్కున్న పిల్లల్లో దాదాపు 1.25 కోట్ల మంది ఊబకాయులేనని అధ్యయనంలో తేలింది. 75 లక్షలతో వీరిలో అబ్బాయిల సంఖ్యే ఎక్కువ.

- సాక్షి, నేషనల్ డెస్క్

మోదీతో దీదీ భేటీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ శుక్రవారం కోల్‌కతాలో భేటీ అయ్యారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, ఇతర సమస్యలను ప్రస్తావించినట్టు అనంతరం మీడియాకు చెప్పారు. రూ.1.18 లక్షల కోట్ల బకాయిలు రావాలంటూ మమత రెండు రోజుల పాటు ధర్నాకు దిగడం, అంతేగాక జాతీయ ఉపాధి హామీ కూలీలకు మమత సర్కారే చెల్లింపులు చేయడం తెలిసిందే.

కులం, మతం, భాష పేరుతో ఓట్లడగొద్దు

దేవుళ్లను అవమానించేలా మాట్లాడరాదు ● పార్టీలకు ఈసీ హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: కులం, మతం, భాష ప్రాతిపదికన ఓట్లు అడగవద్దని, ఇతర మతాల దేవుళ్లను, దేవతలను కించపరచరాదని పార్టీలకు, నేతలకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ శుక్రవారం అడ్వైజరీ విడుదల చేసింది. గతంలో నియమావళిని ఉల్లంఘించి నోటీసులందుకున్న స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు మరోసారి తప్పిదానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవంది. ప్రచార సమయంలో మర్యాదలు, సంయమనం పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రత్యర్థులను కించపరిచడం, అవమానించడం, సదరు పోస్ట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేయడం కూడదని పేర్కొంది. విద్వేషానికి వ్యాఖ్యలకు పార్టీలు దూరంగా ఉండాలని కోరింది. ''స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు నియమావళిని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉల్లంఘించరాదు. వీటిని నిశితంగా పరిశీలిస్తుంటాం. సమాజంలో వర్గ విభేదాలను, శత్రుత్వాన్ని పెంచే మాటలు, చర్యలకు దూరంగా ఉండాలి. ఓటర్లను తప్పుదోవ పట్టించే లక్ష్యంతో తప్పుడు ప్రకటనలు లేదా నిరాధార ఆరోపణలను ప్రచారం చేయవద్దు. వ్యక్తిగత దాడులకు దూరంగా ఉండాలి. దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా లేదా మరే ఇతర ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదు'' అని స్పష్టం చేసింది. మహిళల గౌరవం, గౌరవానికి భంగం కలిగించే ఎటువంటి చర్యలు లేదా ప్రకటనలను నివారించాలని ఈసీ కోరింది. సోషల్ మీడియాలో సంయమనం పాటించాలని, ప్రత్యర్థుల ప్రతిష్టకు భంగం కలిగించేలా పోస్ట్‌లను షేర్ చేయడం మానుకోవాలని పేర్కొంది.



శుక్రవారం లఖ్‌నవూలో ఎన్నికల కాఫీ టేబుల్ బుక్ విడుదల చేస్తున్న సీఈసీ రాజీవ్ కుమార్



ఆంక్షల మధ్య నవాల్నీ అంత్యక్రియలు

మాస్కో: రష్యా విపక్ష నేత అలెక్సీ నవాల్నీ అంత్యక్రియలు శుక్రవారం ఆంక్షల నడుమ ముగిశాయి. జైల్లో అనుమానాస్పద రీతిలో మరణించిన ఆయన మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించేందుకు పుతిన్ సర్కారు ఒక పట్టాన అంగీకరించని విషయం తెలిసిందే. అనంతరం సర్కారు భయంతో అంత్యక్రియ నిర్వహణకు చర్చిలు కూడా వెనకడుగు వేశాయి. ఎట్టకేలకు మాస్కోలోని ఓ చర్చి ఒప్పుకున్నా శ్మశానవాటికకు పార్థివదేహాన్ని తరలించేందుకు వాహనం దొరకడమూ గగనమే అయింది. మృతదేహాన్ని తరలించేందుకు ముందుకొచ్చిన వారికి బెదిరింపులు వచ్చినట్టు నావల్నీ అధికార ప్రతినిధి కీరా యార్మిష్ చెప్పారు. చివరకు మాస్కో పరిధిలోని మేరినో జిల్లా బోరిసోవస్కోయిా శ్మశానవాటికలో నవాల్నీ పార్థివ దేహాన్ని ఖననం చేశారు. జనం గుమికూడొద్దన్న ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరుచేస్తూ వేలాదిగా వేలాదిగా మద్దతుదారులు, ఉద్యమకారులు, అభిమానులు హాజరయ్యారు. మృతదేహాన్ని ఉంచిన మదర్ ఆఫ్ గాడ్ సూథీ మై సారోస్ చర్చిలో వేలాదిగా నివాళులర్పించారు. నవాల్నీ నవాల్నీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అమెరికా, ఫ్రాన్స్ రాయబారులు తదితరులు పుష్పగుచ్ఛాలుంచి అంజలి ఘటించారు. అంత్యక్రియల్లో ఆంక్షలు అతిక్రమించిన వారికి శిక్షలు తప్పవని ప్రభుత్వ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు.

'మోదీ గ్యారంటీల'తో గెలుస్తాం

ఎన్డీయేకు 400 సీట్లు తథ్యం
- నా జీవితంలో ప్రతిక్షణం ప్రజలకే అంకితం: మోదీ
- జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

బర్వాడా/సింద్రీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 400కుపైగా సీట్లు సాధించడం తథ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. మోదీ గ్యారంటీలే తమను గెలిపిస్తాయని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా తాను ఎక్కడికి వెళ్లినా 'మోదీ గ్యారంటీ' అనే నినాదం గట్టిగా వినిపిస్తోందని చెప్పారు. ప్రజల ఆశలు అంతమైన చోటునుంచే మోదీ గ్యారంటీ ప్రారంభమవుతుందని మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ జిల్లాలోని సింద్రీలో రూ.35,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. జాతికి అంకితం ఇచ్చారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అనంతరం 'విజయ్ సంకల్ప్ మహార్యాలీ'లో ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఇండియా కూడా ఒకటి అని గుర్తుచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో 8.4 వృద్ధి రేటు నమోదైందని, ఇది చాలా ప్రోత్సాహకరంగా ఉందని వెల్లడించారు.



ప్రజల కలలే మా ప్రతిజ్ఞ

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. జార్ఖండ్‌లో అధికార జేఎంఎం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని మండిపడ్డారు. రూ.350 కోట్ల నగదుతో జార్ఖండ్‌లో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ దొరికిపోవడాన్ని మోదీ ప్రస్తావించారు. అన్ని నోట్ల కట్టలు తన జీవితంలో ఏనాడూ చూడలేదని అన్నారు. ఆ సొమ్మంతా జార్ఖండ్ ప్రజలదేనని తేల్చిచెప్పారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాల్సిన డబ్బును కాంగ్రెస్ నేతలు లూటీ చేశారని ధ్వజమెత్తారు. వారు దోచుకున్న సొమ్మును తిరిగి వసూలు చేసి, ప్రజలకు అందజేస్తామని, ఇది మోదీ గ్యారంటీ అని చెప్పారు. జార్ఖండ్ ప్రజలు కష్టపడి పనిచేస్తారని, వారి కష్టం వృథా కానివ్వబోమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఎంత బురద చల్లినా కమలం(బీజేపీ గుర్తు) ప్రతిచోటా వికసిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. 'ప్రజల కలలే మా ప్రతిజ్ఞ, వారి సంక్షేమమే మోదీ గ్యారంటీ' అని స్పష్టం చేశారు. తన జీవితంలో ప్రతిక్షణం ప్రజలకే అంకితం అని పేర్కొన్నారు. జనం బాగు కోసమే తాను పని చేస్తున్నానని వెల్లడించారు. దేశంలో గత పదేళ్లలో ఏకంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని హర్షం వ్యక్తం చేశారు. పేదరికాన్ని పూర్తిగా అంతం చేసే దిశగా ముందడుగు వేస్తున్నామని తెలిపారు.

సందేశ్‌ఖాలీపై నోరు విప్పరెందుకు?

ప్రధాని మోదీ శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. హుగ్లీ జిల్లాలోని ఆరామ్‌బాగ్‌లో రూ.7,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ పాలనలో అరాచక శక్తులు చెలరేగిపోతున్నాయని మోదీ మండిపడ్డారు. సందేశ్‌ఖాలీలో మహిళలు ఘోరమైన అకృత్యాలు జరిగాయని, దీనిపై ప్రతిపక్ష ఇండియా కూటమి ఎందుకు నోరువిప్పడం లేదని నిలదీశారు. సందేశ్‌ఖాలీలో మన అక్కచెల్లెమ్మలను తృణమూల్ కాంగ్రెస్ నేతలు వేధించారని, అత్యాచారాలు చేశారని, ఇది నిజంగా సిగ్గుచేటు అని ధ్వజమెత్తారు. నిందితులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు.

బెంగళూరు కేఫ్‌లో బాంబు పేలుడు


పేలుడు తర్వాత భీతావహంగా మారిన ఘటనా స్థలి

10 మందికి గాయాలు

సాక్షి, బెంగళూరు: బాంబు పేలుడు ఘటనతో బెంగళూరు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నగరంలో నిత్యం రద్దీగా ఉండే వైట్‌ఫీల్డ్ పరిధిలోని బ్రూక్‌ఫీల్డ్ ప్రాంతంలోని రామేశ్వరం కేఫ్‌లో మధ్యాహ్నం వేళ ఈ బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కేఫ్ సిబ్బంది సహా 10 మంది గాయపడ్డారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా పేలుడు సంభవించిందని తొలుత అందరూ భావించారు. 30 ఏళ్లలోపు వయసు వ్యక్తి ఒకరు ఆ కేఫ్‌లోని హ్యాండ్‌వాష్ వద్ద ఉన్న చెత్తబుట్టలో ఒక బ్యాగును పడేసి వెళ్లినట్లు అక్కడి సీసీటీవీ ఫుటేజీలో కనిపించింది. అత్యాధునిక పేలుడు పదార్థం(ఐఈడీ) వల్లే ఈ పేలుడు సంభవించిందని బాంబు నిర్వీర్య బలగాలు, ఫోరెన్సిక్స్ ల్యాబొరేటరీ, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందాలు ఒక ప్రాథమిక అంచనాకు వచ్చాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఆ వ్యక్తిని గుర్తించారు. టోకెన్ కౌంటర్ వద్ద రవ్వ ఇడ్లీ ఆర్డర్ చేసిన ఆ వ్యక్తి తర్వాత తినకుండా వెళ్లిపోయినట్లు సీసీటీవీలో రికార్డయింది. పోయేముందు ఒక బ్యాగును అక్కడి హ్యాండ్‌వాష్ దగ్గరి చెత్తబుట్టలో పడేసినట్లు కనిపిస్తోంది. ఒక గంట తర్వాత బాంబు పేలింది. ఐఈడీ బాంబును టైమర్ సాయంతో పేల్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఘటనాస్థలిని కర్ణాటక డీజీపీ సందర్శించారు. 'ఈ బాంబు పేలుడు ఘటనలో ఇప్పటికే లభించిన ఆధారాల సాయంతో దర్యాప్తు ముమ్మరం చేశాం' అని రాష్ట్ర డీజీపీ అలోక్ మోహన్ చెప్పారు. ''కేఫ్‌లో తినేందుకు అప్పుడే అక్కడికొచ్చాం. 40 మంది దాకా ఉన్నాం. ఒక్కసారిగా భారీ పేలుడు జరగడంతో ప్రాణభయంతో పరుగులు తీశాం'' అని ప్రత్యక్ష సాక్షులు ఎడిసన్, అమృత్ చెప్పారు. ఎన్ఐఏ బృందం ఘటనా స్థలిని సందర్శించింది. పేలుడు స్థలంలో బ్యాటరీ, వైర్లను గుర్తించారు. కేవలం పది సెకండ్ల వ్యవధిలో రెండు పేలుళ్లు సంభవించాయని కెఫే ఎండీ, సహ వ్యవస్థాపకురాలు దివ్య చెప్పారు.

దుండగులను వదలిపెట్టం

కేఫ్‌లో పేలుడుకు ఐఈడీ బాంబే కారణమని ఆ రాష్ట్రముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. ''నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెడతాం. ఈ ఘటన వెనుక ఉన్నది ఎంతటి వారైనా విడిచి పెట్టేది లేదు' అని శుక్రవారం మైసూరులో వ్యాఖ్యానించారు. '' ఘటనపై పోలీసు శాఖ దర్యాప్తు చేపట్టింది. సీసీకెమెరాల ద్వారా నిందితుల ఆచూకీ గుర్తించేందుకు చర్యలు చేపట్టాం. ఇది ఉగ్రవాదుల పనిలా లేదు. పేలుడు ఘటన వెనుక ఉన్నవారిని కఠినంగా శిక్షిస్తాం' అని సీఎం అన్నారు.

ఢాకాలో ఘోర అగ్ని ప్రమాదం

షాపింగ్ మాల్‌లో మంటలు.. 46 మంది దుర్మరణం



ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో గురువారం రాత్రి ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఏడంతస్తుల షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగి 46 మంది సజీవ దహనమయ్యారు. 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. పలువురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి గ్యాస్ లీకేజీయే కారణమని భావిస్తున్నారు. బైలీ రోడ్డు ప్రాంతంలోని గ్రీన్ కోజీ కాటేజీలో పలు రెస్టారెంట్లు, వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఈ భవనం మొదటి అంతస్తులోని రెస్టారెంట్‌లో రాత్రి 9.50 గంటల ప్రాంతంలో చెలరేగిన మంటలు పై అంతస్తులకు శరవేగంగా వ్యాపించాయి. దీంతో అందులోని వారంతా ప్రాణభయంతో పై అంతస్తులకు చేరుకున్నారు. అగ్ని మాపక సిబ్బంది సుమారు 75 మందిని నిచ్చెనల సాయంతో కిందికి దించారు. మంటలను అర్ధరాత్రి 12.30 గంటలకు అదుపులోకి తీసుకురాగలిగారు. ఘటనపై ప్రధాని షేక్ హసీనా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రక్షణ ఉత్పత్తుల కొనుగోలుకు ఒప్పందాలు

న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్లు, అత్యాధునిక రాడార్లు, ఆయుధ వ్యవస్థలు, మిగ్–29 జెట్ విమానాలకు ఏరో ఇంజిన్ల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం రూ.39,125 కోట్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకుంది. ఇందులో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)తో ఒకటి, బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(బీఏపీఎల్)తో రెండు, లార్సెన్ అండ్ టూబ్రోతో రెండు ఒప్పందాలు ఉన్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణశాఖ కార్యదర్శి గిరిధర్ అరమానె సమక్షంలో శుక్రవారం ఆయా సంస్థల ప్రతినిధులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. 'సైనిక బలగాల పోరాట సామర్థ్యాన్ని మరింత ఇనుమడింప జేసే ఈ ఒప్పందాలు దేశీయ సంస్థల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేస్తాయి. భవిష్యత్తులో విదేశీ పరికరాల తయారీపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి'అని రక్షణశాఖ తెలిపింది. ఒప్పందంలో భాగంగా భారత్– రష్యాల జాయింట్ వెంచర్ బీఏపీఎల్ నుంచి 200 బ్రహ్మోస్ క్షిపణులను రక్షణశాఖ కొనుగోలు చేయనుంది.

తుండా విడుదలపై సుప్రీంకు సీబీఐ

న్యూఢిల్లీ: 1993 వరుస పేలుళ్ల కేసులో అబ్దుల్ కరీం తుండా(81)ను నిర్దోషిగా పేర్కొంటూ స్పెషల్ కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని సీబీఐ తెలిపింది. కోర్టు తీర్పును క్షుణ్నంగా పరిశీలించాక సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని పేర్కొంది.తుండాపై మోపిన అభియోగాలను రుజువు చేసేందుకు అవసరమైన సాక్ష్యాధారాలను ప్రాసిక్యూషన్ చూపలేకపోయిందని పేర్కొన్న అజ్మీర్‌లోని ప్రత్యేక టాడా కోర్టు అతడిని నిర్దోషిగా తేల్చింది. ఇదే కేసులో రైళ్లలో బాంబులను అమర్చినట్లు ఉన్న ఆరోపణలు రుజువు కావడంతో ఇర్ఫాన్, హమీదుద్దీన్ అనే వారికి కోర్టు జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. బాబ్రీ మసీదు విధ్వంసానికి ఏడాదైన సందర్భంగా 1993 డిసెంబర్ 5, 6 తేదీల్లో లక్నో, కాన్పూర్, హైదరాబాద్, సూరత్, ముంబైల్లోని రైళ్లలో వరుసగా పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనల్లో ఇద్దరు చనిపోగా మరో 22 మంది గాయపడ్డారు.

స్టాలిన్‌కు చైనా భాషలో శుభాకాంక్షలు

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు రాష్ట్ర బీజేపీ విభాగం శుక్రవారం చైనా భాషలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. 'బీజేపీ తమిళనాడు విభాగం గౌరవ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఆయనకు ఇష్టమైన భాషలో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతోంది'అని 'ఎక్స్'లో పేర్కొంది. అందులో ప్రధాని మోదీ, పార్టీ చీఫ్ నడ్డా, తమిళనాడు విభాగం అధ్యక్షుడు అన్నామలై చిత్రాలు, ఆపక్కనే స్టాలిన్ చిత్రం కింద చైనీస్ భాషలో ఒక సందేశం ఉంది. రాష్ట్రంలో ఇస్రో కాంప్లెక్స్ సముదాయం ప్రారంభం సందర్భంగా ఇటీవల డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలో చైనా జెండా కనిపించడం వివాదం రేపింది. ఈ నేపథ్యంలోనే బీజేపీ ఈ మేరకు స్పందించడం విశేషం. అయితే, ఆ ప్రకటనలో పొరపాటున చైనా జెండా అచ్చయిందే తప్ప, ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని ఆ ప్రకటన ఇచ్చిన మంత్రి రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల శకం: ముర్ము

బెర్హంపూర్: దేశాభివృద్ధిలో మహిళల శకం మొదలైందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. జాతి నిర్మాణంలో నేడు బాలికలు అన్ని రంగాల్లో కీలకంగా మారారని, ఈ పరిణామం ఎంతో ప్రోత్సాహకరమైందని పేర్కొన్నారు. గంజాం జిల్లాలోని బెర్హంపూర్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. సాహిత్యం, సంస్కృతి, సంగీతం వంటి రంగాల్లో మహిళ భాగస్వామ్యం ప్రశంసనీయమని తెలిపారు. 'సైన్స్, టెక్నాలజీ మొదలుకొని పోలీసు, ఆర్మీ వరకు ప్రతి రంగంలోనూ మన కుమార్తెల సామర్థ్యం కనిపిస్తోంది. ఇప్పుడు మనం మహిళాభివృద్ధి దశ నుంచి మహిళల సారథ్యంలో అభివృద్ధి వైపు పయనిస్తున్నాం'అని రాష్ట్రపతి తెలిపారు.

పంజాబ్‌లో ఆప్ కార్యకర్త కాల్చివేత

అమృత్‌సర్: పంజాబ్‌లో అధికార పార్టీ ఆప్‌నకు చెందిన ఓ కార్యకర్తను గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. తారన్‌తారన్ జిల్లాకు చెందిన గుర్‌ప్రీత్ సింగ్ అలియాస్ గోపీ చోహల్ కోర్టు కేసు విషయమై కపుర్తలా వైపు కారులో ఒక్కడే వెళ్తున్నాడు. కారును వెంబడిస్తున్న దుండగులు ఫతేబాద్, గోయింద్వాల్ సాహిబ్ మధ్యలోని రైల్వే క్రాసింగ్ వద్ద అతడిపైకి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి పరారయ్యాడు. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు గుర్‌ప్రీత్ సింగ్ అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

33% రాజ్యసభ సభ్యులపై క్రిమినల్ కేసులు

న్యూఢిల్లీ: రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 245. వీరిలో 225 మంది సిట్టింగ్ ఎంపీలపై నమోదైన క్రిమినల్ కేసులు, వారి ఆస్తులను ఎన్నికల హక్కుల సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) విశ్లేషించింది. ఒక నివేదిక విడుదల చేసింది. 225 మంది రాజ్యసభ సభ్యుల్లో 33 శాతం మంది(75 మంది)పై క్రిమినల్ కేసులు ఉన్నట్లు గుర్తించింది. ఈ విషయాన్ని వారే స్వయంగా అఫిడవిట్లలో ప్రస్తావించారని వెల్లడించింది. 225 మంది సభ్యుల మొత్తం ఆస్తుల విలువ రూ.19,602 కోట్లు అని తేల్చింది. అలాగే వీరిలో 14 శాతం మంది.. అంటే 31 మంది బిలియనీర్లు ఉన్నారని తెలియజేసింది. 18 శాతం మంది(40 మంది) ఎంపీలపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన నేరాల్లో కేసులు నమోదయ్యాయని పేర్కొంది.

పాక్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్‌గా సాదిక్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ముస్లిం లీగ్(నవాజ్)(పీఎంఎల్–ఎన్), పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ)మరికొన్ని పార్టీలతో ఏర్పడిన సంకీర్ణ కూటమిలో పదవుల పంపిణీ కొలిక్కి వస్తోంది. నేషనల్ అసెంబ్లీ స్పీకర్ పదవికి శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో పీఎంఎల్–ఎన్ సీనియర్ నేత సర్దార్ అయాజ్ సాదిక్, డిప్యూటీ స్పీకర్‌గా పీపీపీ నేత గులాం ముస్తాఫాషా ఎన్నికయ్యారు. అయాజ్ సాదిక్‌కు 291 ఓట్లకు గాను 199 ఓట్లు రాగా, తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ బలపరిచిన అమిర్ డోగార్‌కు 91ఓట్లు దక్కాయి. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్‌లో చేరిన విషయం తెలిసిందే. తాజా పరిణామంతో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పీఎంఎల్–ఎన్ బలపరిచిన అభ్యర్థి ప్రధాని పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

మేం వినబోం.. హైకోర్టుకు చెప్పకోండి

ఆశారాం బాపు శిక్ష రద్దు పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: టీనేజీ అమ్మాయిలపై లైంగిక దాడులు, అత్యాచారం ఆరోపణల్లో దోషిగా తేలి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న వివాదాస్పద గురువు ఆశారాం బాపు తన శిక్షను రద్దుచేయాలంటూ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ విషయంలో తామేమీ వినదల్చుకోలేదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ''ఏదైనా ఉపశమనం కావాలంటే రాజస్థాన్ హైకోర్టుకు వెళ్లండి'' అని స్పష్టం చేసింది. అయితే ఈ మేరకు ఆశారం గతంలో పెట్టుకున్న పిటిషన్లను రాజస్థాన్ హైకోర్టు నాలుగుసార్లు కొట్టేసిందని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆశారాం శిక్ష రద్దుచేసి మహారాష్ట్ర ఆస్పత్రిలో వైద్యానికి అవకాశం ఇవ్వాలని కోరారు. తామేమీ చేయలేవని, మళ్లీ హైకోర్టుకే వెళ్లాలని ధర్మాసనం స్పష్టం చేసింది. 2013 ఏడాదిలో తన ఆశ్రమంలో టీనేజీ అమ్మాయిని రేప్ చేశాడనే కేసులో అదే ఏడాది అరెస్టయి 2018లో పోక్సో కోర్టు యావజ్జీవ శిక్ష విధించిన నాటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు.

బిహార్‌లో ఆగని ఫిరాయింపుల పర్వం

పట్నా: బిహార్‌లోని మహాఘట్‌బంధన్ కూటమిలో ఫిరాయింపుల ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆర్‌జేడీకి చెందిన మరో ఎమ్మెల్యే భరత్ బింద్ అసెంబ్లీ సమావేశాల చివరి రోజైన శుక్రవారం ఎన్‌డీఏ పక్షంలోకి మారారు. కాంగ్రెస్‌కు చెందిన మహిళా ఎమ్మెల్యే నీతూ కుమారి పార్టీ లోక్‌సభ టిక్కెట్ ఇస్తే సరేసరి లేకుంటే బీజేపీలో చేరడం ఖాయమని ప్రకటించారు. ఇప్పటికే ఆర్‌జేడీకి చెందిన స్పీకర్ అవధ్ బిహారీ చౌధరిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా అదే పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఓటేయడం, నితీశ్ కుమార్ ప్రభుత్వానికి మద్దతు తెలపడం తెలిసిందే. తాజా పరిణామాలతో 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఎన్‌డీఏ బలం 135కు చేరుకుంది.

ఐఐపీఈ భవన నిర్మాణానికి నేడు ప్రధాని మోదీ శంకుస్థాపన

- వర్చువల్ విధానంలో పాల్గొననున్న నరేంద్ర మోదీ
- వంగలిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ వర్సిటీ ఏర్పాటు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం(అనకాపల్లి): అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) విశ్వవిద్యాలయం శాశ్వత భవన నిర్మాణాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. బిహార్‌లోని పాట్నా నుంచి వర్చువల్ విధానంలో సాయంత్రం 5.15 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని వర్సిటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య కె.విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి శక్తి అవసరాలను తీర్చడానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే దిశగా ఈ ప్రపంచ స్థాయి వర్సిటీ నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. కాగా, వర్సిటీ భవన నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమం, సభా వేదిక ఏర్పాట్లను పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ పరిశీలించారు.

4న కర్నూలుకు సీఎం జగన్

జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు


కర్నూలు (సెంట్రల్): సీఎం జగన్ ఈ నెల 4న కర్నూలుకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. జగన్నాథగట్టుపై నిర్మించ తలపెట్టిన జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేస్తారన్నారు. శుక్రవారం కలెక్టర్ సృజన, జేసీ నారపు రెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా జగన్నాథగట్టుకి వెళ్లారు. తాత్కాలిక హెలిప్యాడ్, వేదిక, పైలాన్ ఆవిష్కరణ పనులను పరిశీలించారు. కాగా, దేశంలోనే రెండో న్యాయ విశ్వవిద్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జగన్నాథ గట్టుపై దాదాపు 100 ఎకరాల భూమిని కేటాయించింది. అందులో భాగంగానే ఈ నెల 4న సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు ఆగమశాస్త్రం ప్రకారం శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాల వద్ద స్వామివారి యాగశాల ప్రవేశం కార్యక్రమాన్ని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు నాయకత్వం వహించే చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కంకణాలకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి కార్యనిర్వహణాధికారి కంకణాన్ని ధరించారు. బ్రహ్మోత్సవ క్రతువులకు అంకురార్పణ చేశారు.

పాడికి భరోసాపై కాలకూట విషం

పాడి రైతు చిరునవ్వులు చిందిస్తుంటే ఈనాడులో విషపురాతలు



- 'జగనన్న పాల వెల్లువ'తో పాడి రైతులకు ఆర్థిక భద్రత
- ప్రైవేటు డెయిరీలకు మిన్నగా లీటరుకు రూ.10–20 మేర అదనంగా లబ్ధి
- మూడేళ్లలోనే రోజుకు 3.75 లక్షల లీటర్లు సేకరిస్తున్న అమూల్
- మూతపడిన చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ కోసం అమూల్‌తో ఒప్పందం
- ఒంగోలు డెయిరీ పునరుద్ధరణకు చర్చలు
- ఈ రెండు చోట్ల రూ.785 కోట్ల పెట్టుబడులు పెడుతున్న అమూల్
- డెయిరీలో కొంత భాగమే లీజుకు.. ఆస్తులపై ఎలాంటి హక్కులుండవు

సాక్షి, అమరావతి: సంక్షోభంలో చిక్కుకుని మూతపడ్డ సహకార పాల డెయిరీలను పునరుద్ధరించారు.. ప్రైవేటు డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు సహకార రంగంలో అగ్రగామిగా ఉన్న అమూల్‌తో ఒప్పందం చేసుకుని పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించారు. లీటర్‌కు రూ.4 చొప్పున అదనపు లబ్ధి చేకూరుస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మిన్నగా లీటర్‌కు రూ.10 నుంచి రూ.20 వరకూ అదనపు లబ్ధి చేకూరుస్తున్నారు. ఇప్పుడు పాడి రైతు చిరునవ్వులు చిందిస్తుంటే ఈనాడు రామోజీకి నచ్చడం లేదు. తన హయాంలో పాడి రైతును దగా చేసిన చంద్రబాబుకు బాకా ఊదడమే లక్ష్యంగా విషపు రాతలతో తెగబడుతున్నారు. తన బురద రాతలతో పాడి రైతుకు భరోసాపై ఓర్వలేనితనంతో కాలకూట విషం కక్కుతున్నారు. 'పాడి కష్టం..అమూల్ పాలు' అంటూ కాకిలెక్కలతో ఈనాడు తన అక్రోశాన్ని వెళ్లగక్కింది.

ఈనాడు ఆరోపణ: ఏళ్లు గడుస్తున్నా.. పెరగని పాలసేకరణ

వాస్తవం: రాష్ట్రంలోని ప్రైవేటు డెయిరీలన్నీ కలిపి రోజుకు 22 లక్షల లీటర్ల పాలు సేకరిస్తుంటే.. అమూల్ సంస్థ కేవలం 3.45 లక్షల లీటర్లు మాత్రమే సేకరిస్తోందని ఆరోపించారు. దశాబ్దాల చరిత్ర ఉన్న రాష్ట్రంలోని ప్రైవేట్ డెయిరీలు రోజుకు 4 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నాయి. నిండా మూడేళ్లు కూడా నిండని అమూల్ సంస్థ రోజుకు 3.75 లక్షల లీటర్ల పాలు సేకరిస్తోంది. నేడు 4778 గ్రామాల్లో 4.15 లక్షల మంది మహిళా పాడి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 1,09,763 మంది రోజూ పాలు పోస్తున్నారు. 2023 జూలైలో రోజుకు 1.74 లక్షల లీటర్లు పాలు సేకరణ చేయగా.. 2024 జనవరి నాటికి 3.75 లక్షల లీటర్ల పాలసేకరణకు చేరుకుంది. 4 లక్షల లీటర్ల పాల సేకరణకు ప్రైవేటు డెయిరీలకు రెండు దశాబ్దాలకు పైగా పడితే అమూల్ కేవలం మూడేళ్లలో 4 లక్షల లీటర్లకు చేరువలో ఉంది.

ఆరోపణ: నమ్మించి నట్టేట ముంచారు

వాస్తవం: మధ్యవర్తులు లేకుండా మహిళా పాడి రైతులకు నేరుగా ప్రతి పదిరోజులకోసారి పాల బిల్లులను చెల్లిస్తున్నారు. ప్రత్యేక ప్రోత్సాహకం కింద ప్రతి లీటర్‌కు పాల నాణ్యత మేరకు రూపాయి నుంచి రూ.2.75 చొప్పున అందిస్తున్నారు. 180 రోజులకు తక్కువకాకుండా పాలు పోసే మహిళా పాడి రైతులకు మూడేళ్లలో రాయిల్టీ ఇన్సెంటివ్ కింద ఇప్పటి వరకు రూ.4.93 కోట్లు చెల్లించారు.

ఆరోపణ: ప్రైవేటు డెయిరీ కంటే తక్కువ ధర?

వాస్తవం: జగనన్న పాల వెల్లువ ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి పాల సేకరణ ధరలు ఏడు సార్లు పెంచారు. ఫలితంగా గేదె పాలు లీటరుకు రూ.18.29(రూ.71.47 నుంచి రూ.89.76) ఆవు పాలకు రూ.9.49(రూ.34.20 నుంచి రూ.43.69)కు పెంచారు. 13 శాతం కొవ్వు, 9 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో లీటరుకు గరిష్టంగా రూ.104 చొప్పున పాడిరైతులకు ఇస్తున్నారు. ఈ ధర రాష్ట్రంలో ఏ ఒక్క ప్రైవేటు డెయిరీ చెల్లించడం లేదు. ప్రైవేటు డెయిరీలు పాల ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ ధర, ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు తక్కువ ధర చెల్లిస్తుంటే, జగనన్న పాల వెల్లువలో సీజన్‌తో సంబంధం లేకుండా గిట్టుబాటు ధర అందిస్తున్నారు. అమూల్ ధరలు పెంచడంతో ప్రైవేటు డెయిరీలు కూడా తమ పాలసేకరణ ధరలను పెంచాల్సి వచ్చింది. ఫలితంగా ప్రైవేటు డెయిరీల నుంచి పాలు పోసే రైతులకు ఈ ప్రాజెక్టు ఫలితంగా రూ.4818.05 కోట్ల అదనపు లబ్ధి చేకూరింది.

ఆరోపణ: పాడి రైతులకు చేయూత ఏదీ?

వాస్తవం: పాడి రైతులకు 20 శాతం సీపీతో అత్యంత నాణ్యమైన పశువుల దాణా సరఫరా చేస్తున్నారు. ఈ కారణంగానే గరిష్ట ధర పొందుతున్నారు. ఇంతవరకు 1065 టన్నుల దాణా పంపిణీ చేశారు. క్రమం తప్పకుండా పాలుపోసే వారికి నిర్వహణ ఖర్చులు, దాణా, పశువైద్య సాయం, నీరు, విద్యుత్ సరఫరా వంటి వాటి కోసం వర్కింగ్ క్యాపిటల్ రుణాలు కూడా అందిస్తున్నారు. పాల సేకరణకు 317 మండలాల్లో 6684 గ్రామాలను గుర్తించారు. ఇప్పటికే 137 చోట్ల బీఎంసీయూ భవనాలు నిర్మించారు. గ్రామ స్థాయిలో పాల సేకరణ, పరీక్ష, శీతలీకరణ కార్యకలాపాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.126 కోట్లు విడుదల చేసింది.

ఆరోపణ: గలీజు ఒప్పందాలు.. అప్పు తీర్చి అప్పగించారు..

వాస్తవం: చంద్రబాబు ప్రభుత్వంలోనే ప్రైవేటు డెయిరీలు మూతపడ్డాయి. అలాగే యూహెచ్‌టీ, పౌడర్ ప్లాంట్లు, ఎంసీసీలతో పాటు 141 బీఎంసీయూలను మూసేశారు. మూతపడిన డెయిరీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. లిక్విడేషన్‌లో ఉన్న చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ కోసం అమూల్‌తో ఒప్పందం చేసుకుంది. డెయిరీలోని కొంత భాగాన్ని మాత్రమే అమూల్‌కు లీజుకు ఇచ్చారు. వాటి ఆస్తులు, భూములపై అమూల్‌కు ఎలాంటి హక్కులు కల్పించలేదు. ఈ ప్రాజెక్టు కోసం అమూల్ రూ.385 కోట్లు పెట్టుబడులు పెడుతోంది. చిత్తూరు డెయిరీకి రూ.182 కోట్లు అప్పులు తీర్చి అప్పగించారంటూ చేసిన ఆరోపణలో వాస్తవం లేదు. ఈ బకాయిలన్నీ గత ప్రభుత్వ హయాం నుంచి ఉన్నవే. వాటిని క్లియర్ చేసిందే తప్ప అమూల్‌కు లీజుకు ఇచ్చేందుకు చెల్లించలేదు. ఒంగోలు డెయిరీని మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలన్న సంకల్పంతో అమూల్‌కు లీజుకు ఇచ్చేలా చర్చలు జరుగుతున్నాయి. రూ.400 కోట్లకు పైగా పెట్టుబడులు అమూల్ పెట్టేందుకు ముందుకొచ్చింది. అలాంటపుడు రూ.60 వేల కోట్ల విలువైన ఆస్తులు ధారాదత్తం చేస్తున్నారని పస లేని రాతలు రాస్తున్నారు.

'యూటీఎస్'తో సులభంగా రైల్ టికెట్లు

దక్షిణ మధ్య రైల్వే సీసీఎం కె.సాంబశివరావు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులకు క్యూలైన్‌ల నుంచి విముక్తి కలిగేలా అన్‌రిజర్వ్‌డ్ టికెట్‌లను పొందేందుకు యూటీఎస్ మొబైల్ యాప్ సులభమైన మార్గమని దక్షిణ మధ్య రైల్వే సీసీఎం (చీఫ్ కమర్షియల్ మేనేజర్) కె.సాంబశివరావు వెల్లడించారు. శుక్రవారం డీఆర్ఎం కార్యాలయంలో 'ప్యాసింజర్ బిజినెస్' అనే అంశంలో యూటీఎస్ మొబైల్ యాప్, డిజిటల్ చెల్లింపులపై సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యూటీఎస్ వినియోగంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ దేశంలోనే రెండోస్థానంలో ఉందన్నారు. విజయవాడ డివిజన్‌లో 2023–24లో యూటీఎస్ యాప్ వాటా 3.3 శాతం, ఏటీవీఎం వాటా 26 శాతం ఉండటంపై డివిజన్ అధికారులను ఆయన్ను అభినందించారు. ప్రయాణికుల్లో యూటీఎస్ యాప్‌పై అవగాహన కల్పించడం, స్టేషన్‌లలో ఏటీవీఎం వినియోగాన్ని పెంచడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి టికెట్ విక్రయాల్లో 10 శాతం వాటా ఉండేలా యూటీఎఫ్, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. ఇందుకోసం ప్రయాణికులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో యూటీఎస్, ఏటీవీఎంల వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఫిబ్రవరిలో ప్రయాణికుల నుంచి రూ.109.17 కోట్లు ఆదాయం రాగా అందులో రూ.23.69 కోట్లు యూటీఎస్ యాప్ వాటా ఉందన్నారు. ఈ సెమినార్‌లో డీసీఎం ఎండీ ఆలీఖాన్, ఏసీఎం ఎస్ఎస్‌పీ రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు, కమర్షియల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అధికారులందించిన ఆర్థిక సాయం చెక్కులను చూపుతున్న విభిన్న ప్రతిభావంతులు, రోగులు. చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



జగనన్నకు విన్నపం.. తక్షణ సాయం

- పామర్రుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన పలువురు బాధితులు
- ఆర్థిక సాయం చేయాలని విన్నపం
- తక్షణం సహాయం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశం
- వెంటనే చెక్కులు అందించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు

సాక్షి, మచిలీపట్నం: ఆర్థిక సహాయం కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పలువురు బాధితులకు తక్షణం సహాయం అందింది. విద్యాదీవెన ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్ శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రుకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు, అనారోగ్య బాధితులు సీఎం జగన్‌ను కలిసి తమ బాధను చెప్పుకొని సాయం కోరుతూ వినతిపత్రాలు అందించారు. దీనిపై సీఎం మానవత్వంతో వెంటనే స్పందించి బాధితులను ఆదుకునేందుకు తక్షణం సహాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.రాజబాబు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మచిలీపట్నం, పామర్రు ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్, పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా పామర్రులోని ఆరేపల్లి కళ్యాణ మండపంలో మొత్తం 18 మందికి రూ. 37.50 లక్షలు అందజేశారు.

సాయం ఇలా..

వై.శ్యామ్ రూ. లక్ష, పి.సురేష్‌బాబు రూ. 2 లక్షలు, టి.వీరవెంకటేశ్వరరావు రూ.5లక్షలు, జి.పండుబాబు రూ. లక్ష, కె.దుర్గాప్రసాద్ రూ. 2 లక్షలు, ఎం.లోకేశ్ రూ.3 లక్షలు, ఎస్.అవినాష్ రూ. 3 లక్షలు, వై.జశ్వంత్ రూ. లక్ష, ఎస్.కార్తీక్ రూ. 50 వేలు, ఎ.ఎస్తేరురాణి రూ. 2 లక్షలు, కె.ఇమ్మానియేల్ రూ. లక్ష, కె.మౌనిక రూ. లక్ష, జె.సోంబాబు రూ.5లక్షలు, జె.వెంకటసుబ్బ రావమ్మ రూ.3లక్షలు, చింతపల్లి అచ్చియ్య రూ. 2 లక్షలు, పి.దుర్గారావు రూ.3లక్షలు, పి.జ్యోతి రూ. లక్ష, పెద్దిరాజు వీల్ చైర్, రూ.లక్ష సహాయం అందుకున్నారు.

రాష్ట్ర పండుగగా

అహోబిలేశుడి పార్వేట ఉత్సవం

జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఆళ్లగడ్డ: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అహోబిలేశుడి పార్వేట ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో 9 విడుదల చేసింది. ఆయా ప్రాంత భక్తుల విశ్వాసాలకు పెద్దపీట వేసింది. సంక్రాంతి పర్వదినం ముగిసిన మూడోరోజు నుంచి అహోబిలేశుడు పార్వేటకు బయలు దేరి భక్తుల మధ్యనే 46 రోజులు పర్యటిస్తారు. ఈ పర్యటనలో 33 గ్రామాల్లోని ప్రజలు ఆ గ్రామానికి పార్వేట పల్లకీ వచ్చినప్పుడు బంధుమిత్రులను పిలుచుకొని వేడుకలు జరుపుకొంటారు. స్వామి ఉన్నన్ని రోజులు జానపద సాంస్కృతిక, పౌరాణిక నాటకాలు, హరి, బుర్రకథలు ప్రదర్శిస్తారు. ఇలాంటి ఉత్సవానికి అరుదైన గౌరవం దక్కింది. 16వ శతాబ్దం నుంచి విశేష చరిత్ర కల్గిన పార్వేట మహోత్సవానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా పార్వేట ఉత్సవం ఒకే రోజు ఉదయం నుంచి రాత్రిలోపు ముగుస్తుంది. అయితే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒక్క అహోబిలేశుడి పార్వేట ఉత్సవం మాత్రమే 46 రోజుల పాటు జరగడం విశేషం.

అన్నమయ్య కీర్తనల్లో ప్రస్తావన: ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమయ్యకు అహోబిల క్షేత్రానికి అవినాభావ సంబంధం ఉంది. అహోబిల ప్రథమ పీఠాధిపతి దగ్గర అన్నమయ్య శిష్యరికం చేశారు. 12 ఏళ్ల పాటు ఆయన అహోబిలంలో నివాసం ఉండి నారసింహుడిపై వేలాది కీర్తనలు రచించారు. అందులో 'దేవ శిఖామణి దివిజుల, వొండగంగ వేవేల గతులు వెలసి వాడే'(నరసింహస్వామి గుర్రంపై వీదివీధిన తిరుగుతూ తన పెళ్లికి భక్తులు అందించే సారెలు స్వీకరిస్తాడు అంటూ ఓ కీర్తనలో పార్వేట ఉత్సవాలను ప్రస్తావించారు).

నాయీబ్రాహ్మణులకు సీఎం అత్యున్నత గౌరవం

- చంద్రబాబు మాటలు తమను ఎప్పటికీ బాధిస్తూనే ఉంటాయన్న నేతలు
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ సమావేశం

సాక్షి, అమరావతి: తమ శ్రేయస్సు కోసం సీఎం జగన్ నిరంతరం శ్రమిస్తున్నారని నాయీ బ్రాహ్మణులు కొనియాడారు. గతంలో ముఖ్యమంత్రి హోదాలో తోకలు కత్తిరిస్తానని తమను ఉద్దేశించి చంద్రబాబు అన్న మాటలు నాయీ బ్రాహ్మణులను ఎప్పటికీ బాధిస్తూనే ఉంటుందని వారన్నారు. తమను చంద్రబాబు అలా అవమానిస్తే సీఎం వైఎస్ జగన్ మాత్రం తమకు టీటీడీ బోర్డులో స్థానం కల్పించి నాయీ బ్రాహ్మణులకు అత్యున్నత గౌరవం ఇచ్చారని వారు గుర్తుచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్లు పుల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు సిద్ధవటం యానాదయ్య మాట్లాడుతూ.. టీటీడీ బోర్డు సభ్యునిగా తనను నియమించడం ద్వారా సీఎం జగన్ నాయి బ్రాహ్మణులకు సమాజంలో ఒక గౌరవాన్ని తీసుకొచ్చారన్నారు. నాయీ బ్రాహ్మణులకు దాదాపు 1100 దేవాలయాల్లోని పాలకవర్గాలలో స్థానం కల్పించారన్నారు. బార్బర్ షాపులకు ఉచితంగా 150 యూనిట్ల వరకు విద్యుత్ ఇవ్వడం ఎందరికో మేలు జరుగుతుందని ఆయన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు మనందరం అండగా నిలవాలని ఆయన కోరారు. శాసనమండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకు సీఎం జగన్ బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ప్రత్యర్థి పార్టీల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా నాయీబ్రాహ్మణులు వైఎస్సార్‌సీపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని కోరారు. ఈ సమావేశంలో నాయీ బ్రాహ్మణ జేఏసీ నేత నరసింహారావు, కార్పొరేషన్ డైరెక్టర్ కనకారావు ఇంకా పలువురు డైరెక్టర్లు, వివిధ జిల్లాల నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు పాల్గొన్నారు.

పవన్‌ను నమ్ముకుంటే ఆస్తులను అమ్ముకోవడమే..

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం(చిత్తూరు జిల్లా): చంద్రబాబు పల్లకి మోయడానికి తప్ప పావలా వంతుకు కూడా పవన్‌కళ్యాణ్ పనికిరారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శ్రీరంగరాజపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు కాళ్ల దగ్గర పవన్ తన అభిమానులను, కులాన్ని తాకట్టు పెట్టాడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాక్షస సమూహమంతా ఓవైపు ఉంటే జగన్ ఒక్కడే మరోవైపు నిలబడ్డారని చెప్పారు. పవన్‌ను నుమ్ముకున్న వారంతా తమ ఆస్తులు అమ్ముకోవాల్సిందేనన్నారు. చంద్రబాబు తన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిస్తే.. పవన్ తన కులానికి, అభిమానులకు వెన్నుపోటు పొడిచారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ టార్గెట్ క్లియర్‌గా ఉందని తెలిపారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగనన్న కావాలో.. రాష్ట్రానికి ఏమీ చేయలేని చంద్రబాబు, పవన్, బీజేపీ, కాంగ్రెస్ కావాలో రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారని నారాయణస్వామి అన్నారు.

క్లుప్తంగా...

టీడీపీకి రాష్ట్ర కార్యదర్శి రంగారావు రాజీనామా

అవమానంతో పార్టీని వీడుతున్నానని లేఖ



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలూరు రంగారావు తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రంగారావు శుక్రవారం చంద్రబాబుకు ఫ్యాక్స్ ద్వారా తన రాజీనామా లేఖను పంపారు. రాష్ట్రస్థాయి గిరిజన నాయకుడిగా నిజాయితీగా పార్టీలో పనిచేస్తుంటే ఓర్వలేని టీడీపీ నేతలు, నా కులాన్ని అవమానపరిచారని, ఓ జాతీయ నాయకుడు ఎస్సీ, ఎస్టీలను అవమానకరంగా మాట్లాడారని లేఖలో పేర్కొన్నారు. 'టీడీపీలో 2011 నుంచి 2020 వరకు వార్డు కార్యకర్త స్థాయి నుంచి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఐదుసార్లు పనిచేశాను. ఆ తరువాత 2017లో రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడిగా, ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నాను.అయినా నన్ను అనేకమార్లు అవమానపరిచారు. టీడీపీలో 30 సంవత్సరాల పాటు విశ్వాసంతో మెలిగినందుకు సరైన గుణపాఠం చెప్పారు. కాబట్టి పార్టీకి రాజీ నామా చేస్తున్నాను' అని లేఖలో తెలియజేశారు.

నేడు, రేపు బీజేపీ కీలక సమావేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పొత్తులపై పూర్తి మౌనం పాటిస్తున్న భారతీయ జనతా పార్టీ.. మరోవైపు తమ పార్టీ ఎన్నికల కార్యక్రమాలను మాత్రం ముందుగా నిర్ణయించుకున్న మేరకు కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలతో పాటు 175 అసెంబ్లీ స్థానాలలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసే ప్రతిపాదిత అభ్యర్థుల ప్రాథమిక జాబితాను ఖరారు చేసేందుకు శని, ఆదివారాల్లో రెండురోజులపాటు కీలక సమావేశాలు నిర్వహించనుంది. బీజేపీ కూడా తమతో పొత్తులో కలిసి వస్తుందంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ గత 20 రోజులుగా మీడియాకు ఇచ్చే లీకులు ఒకవైపు... పొత్తులకు సంబంధించి ఏ నిర్ణయమైనా మా పార్టీ జాతీయ నాయకత్వం తీసుకుంటుందంటూ బీజేపీ రాష్ట్ర నాయకత్వం చేస్తున్న ప్రకటనలు మరోవైపు.. మూడు పార్టీల కార్యకర్తలను గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి. అయినప్పటికీ వాటిపై ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయకుండా కమలం పార్టీ జాతీయ నాయకత్వం మౌనం పాటిస్తుండడం తెలిసిందే. అదే సమయంలో రాష్ట్రంలో తమ పార్టీ ఎన్నికల కార్యక్రమాలను యథావిధిగా బీజేపీ నేతలు నిర్వహించుకుంటూ పోతుండడం గమనార్హం. ఈ క్రమంలో శని, ఆదివారాల్లో జరిగే సమావేశాల్లో జిల్లాల వారీగా స్థానిక పార్టీ ముఖ్యనాయకులతో చర్చించి ఒక్కో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ నుంచి పోటీ చేసేందుకు అవకాశమున్న ముగ్గురేసి ప్రతిపాదిత అభ్యర్థుల పేర్లను ఖరారు చేసి, ఆ జాబితాను కేంద్ర పార్టీకి పంపనున్నారు. శనివారం సగం జిల్లాల నేతలతోనూ, ఆదివారం మిగిలిన సగం జిల్లాల నేతలతో ఈ భేటీలు కొనసాగనున్నట్టు పార్టీ వర్గాలు వివరించాయి.

భర్తను కాపాడుకునేందుకు బాబుతో సునీత కుమ్మక్కు

- తండ్రిని చంపిన దస్తగిరిని అభినందించడం సిగ్గుమాలిన చర్య
- వైఎస్సార్ జిల్లా ప్రజా ప్రతినిధులు



పులివెందుల: వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబే నడిపిస్తున్నారని రుజువైందని, ఇన్నాళ్లకు ముసుగు తొలగిపోయిందని వైఎస్సార్ కడప జిల్లా లింగాల ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ పుష్ప, మాజీ ఎంపీపీ అమృత పేర్కొన్నారు. ఢిల్లీ వేదికగా మాయల ఫకీర్ చంద్రబాబు మరో డ్రామాకు తెర తీశారని విమర్శించారు. సీఎం జగన్‌పై బురద చల్లి ఎన్నికల్లో చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేందుకే సునీత రాజకీయ కుట్రతో ఆరోపణలు చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. వైఎస్ కుటుంబంపై బురద చల్లడం ద్వారా ఆమె ఎవరికి లబ్ధి చేకూర్చాలని ప్రయత్నిస్తున్నారో ప్రజలు గ్రహించారన్నారు. ఈ కేసులో తన భర్త రాజశేఖర్‌రెడ్డిని కాపాడుకునేందుకే చంద్రబాబుతో సునీత చేతులు కలిపిందని పేర్కొన్నారు. శుక్రవారం లింగాలలో వారు మీడియాతో మాట్లాడారు. కన్నతండ్రిని కిరాతకంగా చంపిన దస్తగిరిని సునీత అభినందించడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. గొడ్డలితో నరికి చంపానని ప్రకటించిన వ్యక్తిని అభినందించే వారిని ఏమనుకోవాలని ప్రశ్నించారు. సునీత, రాజశేఖర్‌రెడ్డి దంపతులను సీబీఐ విచారిస్తే ఎందుకు అంత అసహనం? అని నిలదీశారు. వివేకా రెండో భార్య గురించి సునీత ఎందుకు మాట్లాడలేదో చెప్పాలన్నారు. ఆమెను దూషిస్తూ మెస్సేజ్‌లు పెట్టిన విషయాన్ని సునీత ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. షమీమ్, సునీత కుటుంబాల మధ్య ఆస్తి తగాదాలున్న విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. వివేకా రాసిన లేఖ, సెల్‌ఫోన్‌ను ఎందుకు దాచి పెట్టారని ప్రశ్నించారు. సీబీఐ ఇవన్నీ ఎందుకు పరిగణలోకి తీసుకోలేదో జవాబు చెప్పాలన్నారు. వివేకా చనిపోయిన రోజు ఇంట్లోని విలువైన డాక్యుమెంట్లు ఎక్కడ ఉన్నాయో సునీత ప్రజలకు వెల్లడించాలని సూచించారు. నాడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి సంఖ్యాబలం ఉన్నా చంద్రబాబు రూ.కోట్లు వెదజల్లి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను ప్రలోభాలకు గురిచేసి వివేకాను ఓడించిన విషయం సునీతకు తెలియదా? అని ప్రశ్నించారు.

చంద్రబాబు, మహాసేన రాజేష్‌లకు ధన్యవాదాలతో..

ఇట్లు నర్రెడ్డి సునీత

- సునీత ఢిల్లీ ప్రెస్‌మీట్‌తో తొలగిన ముసుగు
- వివేకా హత్య వెనుక ఉన్నది ఎల్లో గ్యాంగే
- మెజార్టీ ఉన్నా వివేకాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన పచ్చ ముఠా
- వివేకా ఉంటే జిల్లాలో రాజకీయ మనుగడ ఉండదని టీడీపీ భయం
- వివేకా రెండో వివాహంతోనే ఆ కుటుంబంలో విభేదాలు
- వివేకా మృతితో సునీత కుటుంబానికే ఆర్థికంగా లబ్ధి
- వివేకా లేఖను రహస్యంగా ఉంచడం వెనుక ఉద్దేశమూ నిజాలు బయటకు రాకూడదనే
- గుండెపోటుతో వివేకా మరణించినట్లు చేసిన ప్రచారమూ వారిదే
- వివేకా రెండో వివాహం...కుటుంబ విభేదాలు కప్పిపుచ్చడం ఎందుకో!
- తండ్రి హంతకులు, కుట్రదారులనే వెనకేసుకొచ్చిన సునీత
- వారితో కొంతకాలంగా సునీత దంపతుల సాన్నిహిత్యం
- చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే సునీత సానుభూతి డ్రామా
- వైఎస్సార్‌సీపీకి ఓటేయొద్దంటూ అసలు స్వరూపం బయటపెట్టుకున్న సునీత

మాటలు మార్చిన సునీత



సునీత వైఖరి ఊసరవెల్లిని తలపిస్తోంది. తన తండ్రి వైఎస్ వివేకా హత్య వెనుక టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణ రెడ్డి, అప్పటి టీడీపీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి ఉన్నారని ఆమె 2019 మార్చిలో చెప్పారు. అంతే కాదు.. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి విజయం కోసం తన తండ్రి చివరి వరకూ కృషి చేశారని కూడా చెప్పారు. ఈ మేరకు 2019 మార్చి 21న హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మరీ తన తండ్రి వివేకా, ఎంపీ అవినాష్‌రెడ్డి మధ్య ఉన్న అన్యోన్యతను వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుట్ర పూరితంగా వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబంపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసి తన తండ్రి కోరిక నెరవేర్చాలని ఆమె ప్రజలను కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా కొంతకాలం అదే వైఖరి అవలంబించారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ప్లేటు ఫిరాయించారు. సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి పూర్తిగా చంద్రబాబు గుప్పిట్లోకి వెళ్లి టీడీపీ రాజకీయ కుట్రలో భాగస్వాములయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై అవాస్తవ ఆరోపణలు చేయడం మొదలెట్టారు. క్రమంగా మాటలు మారుస్తూ ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌ను విచారించాలంటున్నారు. చివరగా వైఎస్సార్‌సీపీకి ఓటేయొద్దంటూ ముసుగు తొలగించేశారు. తన ఎల్లో విధానాన్ని బహిర్గతం చేశారు.

సాక్షి, అమరావతి: 'నాకు అన్ని విధాలుగా మద్దతుగా నిలిచిన చంద్రబాబు, పి.గన్నవరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి రాజేష్ మహాసేనలకు కృతజ్ఞతలు'.. అంటూ మూడేళ్లుగా తన వెనుక ఉండి, తనను ఎవరు ఆడిస్తున్నారో, తన నోటి నుంచి వస్తున్న మాటల వెనుక స్క్రిప్ట్ ఎవరిదో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత విస్పష్టంగా వెల్లడించారు. ఇన్నాళ్లా తాను కప్పుకున్న ముసుగును తొలగించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించేందుకు చంద్రబాబు ఆమెను తెరమీదకు తెచ్చారు. శుక్రవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో తన తండ్రి, మాజీ మంత్రి వైఎస్ వివేకా కేసుతో ప్రారంభించి, చివరకు ఏపీ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటేయొద్దని కోరుతూ తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నారు. తన తండ్రి వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తుపై మరోసారి అవాస్తవాలు, అభూత కల్పనలు జోడించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. అందుకోసం 2017లో ఎమ్మెల్సీ ఎన్నికల ఉదంతాన్ని వక్రీకరించారు. ఆమె తండ్రిని కుట్రతో ఓడించిన చంద్రబాబు ముఠాను వెనకేసుకొచ్చారు. ఆ ముఠా సభ్యులు బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డితో సునీత, ఆమె భర్త సన్నిహితంగా ఉంటున్న విషయాన్ని దాటవేశారు. ఆమె తండ్రి రెండో వివాహంతో కుటుంబంలో తలెత్తిన విభేదాలను మరుగున పరచడానికి చూశారు. వివేకాను హత్య చేశానని అంగీకరించిన దస్తగిరితో మాటామంతీ కొనసాగిస్తున్న విషయం బయటి ప్రపంచం గుర్తించడంలేదనే భ్రమలో ఉన్నారు. వెరసి తాను చంద్రబాబు గూటిలో చిలకనని స్పష్టం చేశారు. చంద్రబాబు నేర్పిన నాలుగు పలుకులనే పలికారు. చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే సునీత సానుభూతి డ్రామా ఆడారు.

వివేకాను కుట్రతో ఓడించినందుకా చంద్రబాబు, ఆయన ముఠాకు కృతజ్ఞతలు?

సునీత టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన పార్టీ సభ్యులు బీటెక్ రవి, మహాసేన రాజేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలపడమే విడ్డూరం. వృత్తి రీత్యా డాక్టరైన సునీత ఉద్దేశపూర్వకంగా మతిమరుపు నటిస్తున్నట్టుగా ఉన్నారు. ఎందుకంటే వైఎస్ వివేకానందరెడ్డిని 2017లో కుట్రతో రాజకీయంగా అంతమొందించింది చంద్రబాబే. తర్వాత 2019లో ఆయన్ని భౌతికంగా అంతం చేసిందీ చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను ఎంపీ అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి ఓడించారని ఆమె అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరం. 2017లో వైఎస్సార్ జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ వివేకాను పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎంపిక చేశారు. జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందినవారే కావడంతో ఆయన సునాయాసంగా గెలుస్తారని అంతా భావించారు. వివేకా ఎమ్మెల్సీగా ఎన్నికైతే జిల్లాలో టీడీపీకి ఉనికే ఉండదని చంద్రబాబు భావించారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురి చేసి వారి వైపు లాక్కున్నారు. కుట్రపూరితంగా వివేకాను ఓడించారు. ఈ వ్యవహారంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి కీలకపాత్ర పోషించారు.

హత్య వెనుకా ఎల్లో గ్యాంగే..!

ఇక 2019 సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని వైఎస్ జగన్ అభ్యర్థిగా ఖరారు చేశారు. నియోజకవర్గం పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా వైఎస్ వివేకానందరెడ్డిని నియమించారు. వివేకానందరెడ్డి పార్టీ విజయం కోసం ఎన్నికల వ్యూహాలు పన్నుతూ అందర్నీ కలుపుకొంటూ దూసుకుపోతున్నారు. దాంతో అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి ఆదినారాయణ రెడ్డి బెంబేలెత్తారు. వివేకా జీవించి ఉంటే వారితో పాటు బీటెక్ రవికీ రాజకీయంగా ప్రతిబంధకంగా మారుతారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ వివేకా హత్యకు గురయ్యారు. అంటే వివేకా భౌతికంగా లేకపోవడం రాజకీయంగా ప్రయోజనం కలిగిస్తుందని టీడీపీ పెద్దలు భావించారన్నది సుస్పష్టం. వివేకా హత్యకు ముందు టీడీపీ నేతలు కొందరితో రహస్య సమావేశాలు, హత్య తరువాత ఆ నేతలు వ్యవహరించిన తీరే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. వివేకాతో ఆర్థిక విభేదాలు తలెత్తిన కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డితో బీటెక్ రవి సాన్నిహిత్యం పెంచుకున్నారు. హత్యకు ముందు రోజు అంటే 2019 మార్చి 14 సాయంత్రం టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవితో హరిత హోటల్‌లో రెండుసార్లు సమావేశమయ్యారు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి తర్వాత కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందడం గమనార్హం. సిట్ దర్యాప్తులో నార్కో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి తిరస్కరించడం సందేహాలకు తావిస్తోంది. అంటే వివేకా హత్య వెనుక ఎల్లో గ్యాంగ్ ఉందన్నది స్పష్టమవుతోంది. కానీ ఆ పచ్చ ముఠాలోని చంద్రబాబు, బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డిలను సునీత వెనకేసుకు వస్తుండటం వెనుక ఆంతర్యం ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

కుటుంబ వివాదాల మాటేమిటి?

వివేకానందరెడ్డి రెండో వివాహంతో కుటుంబంలో రేగిన విభేదాలు, ఆస్తుల కోసం ఘర్షణలు సునీత మరుగున పెడుతున్న మరో ప్రధాన అంశం. వివేకా మరణిస్తే ఎవరికి ప్రయోజనం, ఆయనతో వ్యక్తిగతంగా ఆస్తిపరంగా, రాజకీయంగా ఎవరికి విభేదాలు ఉన్నాయన్నది ఈ కేసు దర్యాప్తులో అత్యంత కీలకం. షమీమ్ అనే మహిళను వివేకా రెండో వివాహం చేసుకున్నారు. ఆ మహిళకు పుట్టిన కుమారునికి ఆస్తిలో భాగం ఇవ్వాలని భావించారు. తన రాజకీయ వారసునిగా చేస్తానని కూడా ప్రకటించారు. దాంతో ఆ కుటుంబంలో ఆస్తి వివాదాలు, రాజకీయ వారసత్వ వివాదాలు తీవ్రస్థాయిలో తలెత్తాయి. వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తీవ్రంగా గొడవపడి ఆయన్ని విడిచిపెట్టి హైదరాబాద్‌లో ఉంటున్నారు. కుటుంబానికి చెందిన కంపెనీల్లో వివేకాకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేశారు. సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి షమీమ్ ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డారు. వివేకానందరెడ్డి అప్పటికే ఆమెకు ఇచ్చిన ఓ ఇంటి పత్రాలను బలవంతంగా తీసుకున్నారు. షమీమ్, సునీత దూషించుకుంటూ చేసుకున్న వాట్సాప్ చాటింగ్‌ను కూడా అప్పట్లోనే సిట్ బృందం వెలికితీసింది. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని, ఆమె కుమారుడిని హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నా అవడంలేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. షమీమ్ కూడా సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో ఇవన్నీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డి జీవించి లేకపోతే ఆయన కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదికే ఎక్కువ ప్రయోజనమన్నది స్పష్టమవుతోంది. వివేకాను హత్య చేసిన తరువాత ఆయన నివాసంలో కొన్ని ఆస్తి పత్రాలు, రౌండ్ సీల్ కోసం హంతకులు వెదికారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంటే వివేకా తన రెండో భార్యకు రాసిచ్చిన ఆస్తి పత్రాలను ఆ ఇంటి నుంచి తీసుకువెళ్లారన్నది స్పష్టం. వివేకా లేకపోతే ఆస్తి మొత్తం దక్కడంతోపాటు రాజకీయ వారసత్వం కూడా తమకే వస్తుందన్న ఉద్దేశం ఆయన బావమరిది, అల్లుడికి ఉందన్నది స్పష్టమైంది.

లేఖను గోప్యంగా ఉంచి.. గుండెపోటు ప్రచారం

వివేకా గుండెపోటుతో చనిపోయారని ప్రచారం చేసేందుకు ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి పక్కా పన్నాగంతోనే వ్యవహరించారు. శివప్రకాశ్‌రెడ్డి మొదటగా ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని చెప్పారు. అదే విషయాన్ని ఆదినారాయణ రెడ్డి మీడియాకు వెల్లడించారు. దాంతో వివేకా గుండెపోటుతో మరణించారనే అసత్య సమాచారం బయటకు వచ్చింది. టీవీ చానళ్లలో ప్రసారమైంది. ఆ ప్రచారాన్ని కొనసాగించేందుకు వివేకా రాసిన లేఖను కుమార్తె, అల్లుడు రహస్యంగా ఉంచారు. ఆ లేఖను మొదటగా ఆ రోజు ఉదయం 6.10 గంటలలోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి ఆ విషయాన్ని సునీత భర్త రాజశేఖరరెడ్డికి చెప్పారు. తాము వచ్చే వరకు ఆ లేఖ, వివేకా సెల్‌ఫోన్‌ను ఎవరికి ఇవ్వకుండా దాచి ఉంచాలని రాజశేఖరరెడ్డి ఆయనతో చెప్పారు. ఆ లేఖను వెంటనే పోలీసులకు అప్పగించమని వారు చెప్పి ఉంటే వివేకాని హత్య చేశారన్న విషయం వెంటనే అందరికీ తెలిసిపోయేది. కానీ ఆ లేఖను ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారు. ఆ రోజు మధ్యాహ్నం 1 గంట సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డికి ఆ లేఖను సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి ఇచ్చారు. వారు ఆ లేఖను చదివిన వెంటనే దాన్ని పోలీసులకు అప్పగించలేదు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖ, సెల్‌ఫోన్‌ను పోలీసులకు ఇచ్చారు. ఆ లేఖను సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి ఎందుకు గోప్యంగా ఉంచారన్నది ఈ కేసులో కీలక అంశం. వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారనే ప్రచారం చేసే ఉద్దేశంతోనే ఆ లేఖను బయట పెట్టకూడదని వారు నిర్ణయించారా అన్నది ఇక్కడ అందరికీ కలిగే సందేహం.

వివేకా హంతకులతో సఖ్యత.. ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవితో సాన్నిహిత్యం

వివేకాను గొడ్డలితో నరికి చంపానని అంగీకరించిన హంతకుడు దస్తగిరితో సునీత సఖ్యతతో ఉండటం వెనుక గూడుపుఠాణి ఏమిటన్నది మరో కీలకాంశం. టీడీపీ ప్రభుత్వంలో నియమించిన సిట్, తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్, సీబీఐ కూడా వివేకానందరెడ్డిని దస్తగిరితో సహా నలుగురు హత్య చేశారని నిర్ధారించాయి. వివేకాను గొడ్డలితో స్వయంగా నరికాను అని చెప్పిన దస్తగిరి అప్రూవర్‌గా మారడంతోనే ఈ కేసు దర్యాప్తు దారితప్పింది. సునీత, ఆమె భర్త దస్తగిరితో పలుసార్లు భేటీ అవుతున్నారు. టీడీపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవితోనూ సన్నిహితంగా ఉంటున్నారు. అంటే వివేకా కుటుంబం, టీడీపీ నేతల పన్నాగంలో భాగంగానే దస్తగిరి అప్రూవర్‌గా మారారన్నది సుస్పష్టం. వివేకా హంతకుడితో, రాజకీయ ప్రత్యర్థులతోనూ ఆ కుటుంబం సన్నిహితంగా ఉండటం ఈ హత్య కుట్రలో వారి సామూహిక భాగస్వామ్యాన్ని బహిర్గతం చేస్తోంది.

వారంరోజుల్లో తేలిపోయేదే అయితే చంద్రబాబునే ప్రశ్నించాలి

వివేకా హత్య కేసు వారం రోజుల్లోనే తేలిపోవాలి కానీ, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని సునీత ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమే. ఎందుకంటే వివేకా హత్యకు గురైనప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది చంద్రబాబే. అప్పుడు వారం రోజుల్లోనే ఆ హత్య కేసును ఎందుకు ఛేదించలేదని సునీత ప్రశ్నించాల్సింది చంద్రబాబునే. ఇలా ప్రశ్నించకపోగా, వెనకేసుకు వస్తుండటం వెనుక ఉద్దేశం ఏమిటన్నది నిగ్గు తేలాలి. అంతేకాదు వివేకా హత్య జరిగిన వెంటనే ఆ కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు చంద్రబాబు అమరావతి నుంచి పెద్ద కథే నడిపారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు కడప ఎస్పీతో, మంత్రి ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ కేసు దర్యాప్తును ప్రభావితం చేశారు. అయినా సునీత చంద్రబాబును ప్రశ్నించడంలేదు.

ఇప్పుడు కేసు సీబీఐ చేతుల్లో ఉంది... ప్రశ్నించాల్సింది కేంద్రాన్ని కదా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వివేకా హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. కానీ ఆ దర్యాప్తును అడ్డుకుంది సునీతే. రాష్ట్ర పోలీసుల దర్యాప్తు వద్దని, సీబీఐ దర్యాప్తు కావాలని ఆమె న్యాయస్థానంలో కేసు వేశారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించాలన్న న్యాయస్థానం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం కేసును బదిలీ చేసింది. మూడేళ్లుగా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధమే లేదు. ఇప్పుడు సునీత నిలదీయాల్సింది కేంద్ర ప్రభుత్వాన్నే. ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టిన ఆమె అక్కడే కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని నిలదీస్తూ ప్రశ్నల వర్షం కురిపించాల్సింది. ఆమె అలా చేయలేదు. ఎందుకంటే ఎన్నికల్లో బీజేపీ ప్రాపకం కోసం పాకులాడుతున్న చంద్రబాబుకు అది ఇష్టం లేదు. బాబుకు ఇష్టంలేని పని సునీత చేయరు. అది ఆమె తండ్రి హత్య కేసు దర్యాప్తు అయినా సరే..

సునీత టీడీపీ గూటి చిలుకే

ఇన్నాళ్లూ తన తండ్రి వివేకా హంతకులెవరో నిగ్గు తేలాలంటూ వాదించిన సునీత.. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కడంతో అసలు స్వరూపం బయటపెట్టారు. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాలే తనకు ప్రధానమని తేల్చిచెప్పారు. అందుకోసమే ఢిల్లీ ప్రెస్ మీట్‌లో రాజకీయ ప్రసంగమే చేశారు. చంద్రబాబు, పవన్, లోకేశ్, రఘురామరాజు, మహాసేన రాజేష్, పట్టాభి... ఇలా ఈ ఎల్లో గ్యాంగ్ కొన్నేళ్లుగా రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న అసత్య ఆరోపణలనే తాజాగా సునీతా చెప్పారు. అచ్చమైన టీడీపీ నేతగా మారారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటేయవద్దని చెప్పారు. ఇది నైతికంగా సునీత దిగజారుడుతనమే. ఇన్నాళ్లూ తండ్రి హత్యకు గురైన బాధితురాలిగా చెప్పుకున్న సునీత.. ప్రస్తుతం చంద్రబాబు కుట్ర రాజకీయంలో పావునని అంగీకరించారు. ఇన్నాళ్లూ తాను కార్చింది మొసలి కన్నీరేనని, చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనమే తన కంట్లో పన్నీరని చెప్పకనే చెప్పారు. వైఎస్సార్‌సీపీకి ఓటేయకూడదని అంటున్నారు. ఎందుకో మాత్రం ఆమె చెప్పనే లేదు. కులం, మతం, రాజకీయం చూడకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకా? మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేసినందుకా? విద్య, వైద్య సంస్కరణలను ప్రవేశపెట్టినందుకా? గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో సుపరిపాలనను ప్రజల చెంతకు చేర్చినందుకా? పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక కారిడార్లతో భారీ ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నందుకా.. ఎందుకు ఓటేయకూడదని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. కేవలం తన తండ్రి రెండో భార్యకు ఆస్తి లేకుండా అన్యాయం చేసినందుకు, తన రాజకీయ ప్రయోజనాల కోసం తండ్రి హత్యను ఉపయోగించుకోవాలని చూస్తున్నందుకే ఆమెకు ప్రజలు సహకరించాలా అని ప్రశ్నిస్తున్నారు.

సునీత మాట్లాడినవన్నీ బాబు పలికించినవే

- వివేకా హత్య కేసులో ముసుగు తొలగింది
- రాజకీయ కుట్రతోనే సునీతతో మీడియా సమావేశం పెట్టించిన బాబు
- నాడు వివేకాను ఓడించిన వ్యక్తులకే నేడు కృతజ్ఞతలు చెబుతున్న సునీత
- వివేకా హత్యలో సునీత కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఉందన్న అనుమానాలున్నాయి
- సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లే అందుకు ఆధారం
- దాన్నుంచి తప్పించుకోవడానికి దొంగే దొంగా దొంగా అన్నట్లు సునీత మాట్లాడుతున్నారేమో!
- తండ్రిని కిరాతకంగా చంపిన వాడు సునీతకు మంచోడెలా అయ్యాడో?
- పవన్ 24 సీట్లు తీసుకుని.. 240 సీట్లు అనుకుంటే ఎలా?
- తాడేపల్లిగూడెం సభ చూశాక బాబు, పవన్ కథ ముగిసిందన్నది స్పష్టమైంది
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కూతురు సునీత ఇన్నాళ్లూ ఎవరి ప్రతినిధిగా మాట్లాడుతున్నారో, తప్పుడు కేసును ఎలా అల్లుతున్నారో బట్టబయలైందని, ముసుగు తొలగిపోయిందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం మీడియా సమావేశంలో సునీత మాట్లాడిన మాటలే ఇందుకు నిదర్శనమన్నారు. ఆమె మాట్లాడినవన్నీ చంద్రబాబు పలికించినవే అనడానికి ఇంతకంటే పెద్ద నిదర్శనం ఏమీ ఉండదన్నారు. రాజకీయ కుట్రతోనే సునీతతో చంద్రబాబు మీడియా సమావేశం పెట్టించారని తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'వైఎస్ వివేకా ఎమ్మెల్సీగా ఓడిపోవడానికి మేమే కారణమని ఆరోపించడం విడ్డూరం. కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 2017లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలవడానికి టీడీపీకంటే వైఎస్సార్‌సీపీకి 160 ఓట్లు ఎక్కువ ఉన్నాయి. అందువల్లే తన చిన్నాన్న వైఎస్ వివేకాను పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ అభ్యర్థిగా నిలబెట్టారు. చంద్రబాబులా ఓడిపోయే సీటుకు పోటీ పెట్టలేదు. వైఎస్ చనిపోయిన తర్వాత వివేకా కాంగ్రెస్‌లోకి వెళ్లి జగన్‌ను రాజకీయంగా అంతుచూడాలని భావించారు. వైఎస్ విజయమ్మపై పులివెందుల శాసన సభ స్థానం నుంచి పోటీకి దిగారు. అయినా వివేకాను జగన్ దగ్గరకు తీసుకున్నారు. వివేకా అడగకుండానే ఆయన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా పెట్టారు. వివేకా సునాయసంగా గెలవాల్సింది. కానీ.. బలం లేకపోయినా ఆయనపై బీటెక్ రవిని చంద్రబాబు పోటీకి దింపి, అప్పట్లో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డితో కలిసి కుట్ర చేసి ఓడించారు. బీటెక్ రవి, ఆదినారాయణపై వివేకాకు కోపం ఉంది. అందుకే 2019 ఎన్నికల్లో వైఎస్ అవినాష్‌రెడ్డి తరఫున వివేకా అవిశ్రాంతంగా ప్రచారం చేశారు. ఆనాడు తండ్రి వివేకాను కుట్రపూరితంగా ఓడించిన బీటెక్ రవికి సునీత ఇప్పుడు కృజ్ఞతలు చెబుతున్నారు. వివేకాను ఏదన్నా చేయాలంటే బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డికే ఎక్కువ అవకాశం ఉంది. వివేకా హత్యకు కారకులైన వాళ్లను కాదని.. ఏడాది తర్వాత ఇంట్లో వాళ్లే హత్య చేశారని సునీత మాటమార్చారు. తండ్రి హత్యకు కారకులైన వారితో జట్టుకట్టి వాళ్లకే కృజ్ఞతలు చెబుతున్నారు' అని సజ్జల మండిపడ్డారు.

ఎన్నికల వేళ చంద్రబాబు రాజకీయ కుట్ర

'సునీత చెప్పినట్లే హత్య కేసు సాధారణంగా వారం రోజుల్లో తేలిపోయేట్లయితే, అప్పట్లో అధికారంలో ఉన్న ఆమె మిత్రుడైన చంద్రబాబు ఆలోగా విచారణ పూర్తి చేసి ఎందుకు కేసు తేల్చలేదు? ఎన్నికలు దగ్గరవుతున్నందున చంద్రబాబు ఉసిగొల్పి ఆరోపణలు చేయించి తన అస్త్రాలను వాడుతున్నాడనటానికి ఇదొక ఉదాహరణ. రాజకీయ కోణంలోనే ఆమె బయటకు వచ్చింది. ప్రజా కోర్టులో తేలాలని అమె కూడా అంటోంది కదా.. అదే తేలుతుంది. కేసులకు, ప్రజలకు సంబంధం ఏముంది? సీఎం జగన్ ప్రజలకు ఏం చేస్తామని చెప్పారో దాని ప్రకారం ప్రజల్లోకి వెళ్తున్నారు. ఆమెకు అన్యాయం జరిగిందని తప్పుడు ఆరోపణ చేసి, మీరు జగన్‌ను శిక్షించండి అని సునీత కోరడం విచిత్రం. ప్రజలంటే వీరికి ఎంత అలుసు? వివేకా హత్యలో సునీత కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఉందేమోననే అనుమానం చాలా మందికి ఉంది. సీబీఐకి ఇచ్చిన కొన్ని వాంగ్మూలాలను లోతుగా చూస్తే అది కనిపిస్తోంది. దాన్ని తప్పించుకోడానికి దొంగే దొంగ దొంగ అన్నట్లుగా ఆమె తిప్పికొడుతున్నారేమో! విచారణ వాటి మీదా జరగాలి. ఆమె తండ్రిని ఎలా కిరాతకంగా గొడ్డలితో నరికి చంపాడో చెప్పిన హంతకుడినే సోదరుడి కింద చూస్తున్న సునీతను ఏమనాలి?' అని సజ్జల ధ్వజమెత్తారు.

చంద్రబాబు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ జనసేన

'వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వెళ్లిన వాళ్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తీసుకుంటున్నారు. ఇప్పుడు వాళ్లంతా స్మగ్లర్లు, గూండాలు కాకుండా పోయారా? బీజేపీ వాళ్లు ఏమనుకుంటున్నారో మాకు తెలియదు కానీ చంద్రబాబు మాత్రం బీజేపీతో కలిసిపోయినట్లే ఫీల్ అవుతున్నాడు. వాళ్ల అండతో ఏదో ఒక రకంగా అర్జంటుగా కుర్చీ ఎక్కాలని బాబు తాపత్రయపడుతున్నట్లు స్పష్టమైపోయింది. పవన్ 24 సీట్లు తీసుకుని 240 సీట్లు అనుకుంటే ఎలా? జనసేనకు 30 వేల ఓట్లకు పైగా వచ్చిన 15 నియోజకవర్గాల్లో ఏడింటిని టీడీపీకి ఇచ్చాడు. మిగిలినవాటిలో ఓడిపోయేవన్నీ పవన్‌కు చంద్రబాబు ఇచ్చాడు. చంద్రబాబుకు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ పెట్టుకుని నేను వామనావతారం, పాతాళానికి తొక్కుతా అని పవన్ అంటే ప్రజలు నవ్వుతారు. తాడేపల్లిగూడెం సభ చూశాక బాబు, పవన్ కథ ముగిసిందన్నది అర్థమైపోతోంది' అని అన్నారు.

వివేకా హత్య కేసు దర్యాప్తుకు వారం రోజులు చాలు

- దర్యాప్తులో సీబీఐ ఎందుకు జాప్యం చేస్తోందో తెలియదు
- నాకు అండగా ఉన్న చంద్రబాబు, లోకేశ్ తదితరులకు కృతజ్ఞతలు
- ఢిల్లీలో మీడియాతో నర్రెడ్డి సునీత

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తునకు వారం రోజులు చాలని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత చెప్పారు. ఆమె శుక్రవారం ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వివేకా హత్య కేసు దర్యాప్తును సీబీఐ ఎందుకు జాప్యం చేస్తోందో తెలియదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాత్ర గురించి ఇప్పుడే చెప్పలేనన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్, రఘురామ కృష్ణరాజు, మహాసేన రాజేష్, పట్టాభి, కొలికపూడి శ్రీనివాసరావు, లాయర్ రజని, సీపీఎం మధు, బొండా ఉమ, వర్ల రామయ్య, ఆదినారాయణ రెడ్డి, డీఎల్ రవీంద్రారెడ్డి, ఎస్.తులసి రెడ్డి, వైఎస్ షర్మిల మొదటి నుంచి తనకు అండగా ఉన్నారని, వారికి కృతజ్ఞతలు అని చెప్పారు. జడ శ్రవణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయినా సరే తన తండ్రి రాజకీయంగా మరింత బలోపేతం కావడం వల్లే రాజకీయ ప్రత్యర్థులు ఆయన్ని హత్య చేశారని చెప్పారు. ఇప్పటివరకూ సీబీఐ విచారణలో నిందితులుగా ఉన్న అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిని రక్షిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూడా సీబీఐ విచారించాలని ఆమె అన్నారు. ప్రజలు కూడా తనకు సహకరించాలని, అదీ ఓటు రూపంలో అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాను లేదా తన భర్త పోటీ చేస్తారో లేదో ఇప్పుడే చెప్పలేనన్నారు.

కాపులకు పవన్ చేసిందేమీ లేదు..

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాపులందరూ పవన్‌కళ్యాణ్ చేతిలో ఉన్నట్టు ఊహించుకుంటున్నాడని, ఆయన తీరుతో కాపులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి మండిపడ్డారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాపు కులానికి, తనను నమ్ముకున్న జనసైనికులకు పవన్ ఏం చేశారని ప్రశ్నించారు. కాపు కులం తనకు మద్దతుగా ఉండాలని చెబుతున్న పవన్.. కాపులకు అన్యాయం జరిగినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాపు నేత వంగవీటి మోహన్‌రంగాను చంద్రబాబు హత్య చేయించిన విషయం నీకు తెలియదా పవన్? అని ప్రశ్నించారు.


శ్రీకాకుళం జిల్లాలో దివ్యాంగుడు బత్తిలి లోకేష్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గీత


ఏలూరు జిల్లాలో ఎలగంటి అప్పాయమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఎన్.భాను


నెల్లూరు జిల్లాలో వెంగళం జయలక్ష్మికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న దివ్యాంగ వలంటీర్ టి.సురేష్


గుంటూరు జిల్లాలో దివ్యాంగులైన తల్లి, కుమారుడు విశాలాంధ్ర, పున్నారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్లేవ్‌కుమార్


అల్లూరి సీతారామరాజు జిల్లాలో భర్తతో కలిసి పింఛన్ పంపిణీ చేస్తున్న నవ వధువు వలంటీర్ రోజా


విశాఖలో దివ్యాంగురాలు వనిజాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనురాధ


విజయవాడలో కసిరెడ్డి పేరిరెడ్డికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ సావిత్రి


విజయనగరం జిల్లాలో వృద్ధురాలు అప్పయ్యమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య


ఒంగోలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేజర్ల అంజమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తిరుమల


కాకినాడ జిల్లాలో దివ్యాంగుడు ఈశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేక్ రషీదా


నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో దివ్యాంగురాలు మహబూబ్‌బీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పత్తి శివకుమార్


అనంతపురం జిల్లాలో రామక్కకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ నాగేశ్వరి


తిరుపతిలో వి.నీలాకు వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హేమవతి

49.29 లక్షల మందికి రూ.1,462.37 కోట్లు

ఒకటో తేదీనే 74.78% శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దనే కొనసాగిన పంపిణీ

సాక్షి, అమరావతి: ఠంచన్‌గా ఒకటో తేదీనే అవ్వాతాతల చేతికి పింఛను డబ్బులు అందాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా 49,29,869 మందికి రూ. రూ.1,462.37 కోట్లు అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం పాటిగురువు గ్రామంలో వలంటీర్ కేరంగి రోజారాణికి శుక్రవారమే పెళ్లి.. అయినా ఆమె తన పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మరీ పింఛను డబ్బులు అందజేశారు. మార్చి ఒకటో తేదీ నుంచి పింఛను పంపిణీకి గాను ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 65.92 లక్షల మంది కోసం రూ.1,958.51 కోట్ల మొత్తాన్ని ఒక్క రోజు ముందే అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు విడుదల చేసిన విషయం తెలిసిందే. తొలి రోజు రాష్ట్ర వ్యాప్తంగా 74.78 శాతం పంపిణీ పూర్తయిందని, మిగిలిన వారి కోసం మరో నాలుగు రోజుల పాటు వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పంపిణీ కొనసాగుతుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.


వైఎస్సార్ జిల్లా మైదుకూరులో భాగ్యమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగలక్ష్మి

పెళ్లికూతురి ముస్తాబులోనే..

హుకుంపేట (అల్లూరి సీతారామరాజు జిల్లా)/సామర్లకోట: అవ్వా తాతలకు ఒకటో తారీఖు తెల్లవారుజామునే పింఛన్ అందించాలన్న సీఎం వైఎస్ జగన్ సంకల్పం అమలులో వారు క్రమశిక్షణ గల వలంటీర్లుగా తమ నిబద్ధతను చాటుకున్నారు. పింఛన్ ఇచ్చే సమయంలో అవ్వా తాతల కళ్లలో కనిపించే ఆ ఆనందం చూసేందుకు ఏకంగా పెళ్లి పీటల మీద నుంచి భర్తతో కలిసి వెళ్లి ఒక నవవధువు వచ్చి పింఛన్ అందజేసింది. ప్రతి నెల ఒకటో తారీఖున ఆ మూడు వేలు కోసం ఎదురుచూసే ఎంతో మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తన కళ్లముందు మెదలడంతో శనివారం పెళ్లి ముహూర్తం పెట్టుకుని పెళ్లికూతురిగా ముస్తాబైనా సరే.. తన విధులే ముఖ్యమనుకుని మరో వలంటీరు గడప దాటి వెళ్లి పింఛన్ అందజేసింది.


కాకినాడ జిల్లాలో దివ్యాంగ చిన్నారి రాయి నాగవైష్ణవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దుర్గాదేవి

పెళ్లి పీటలపై నుంచి భర్తతో కలిసివెళ్లి..

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం దుర్గం పంచాయతీ పాటిగరువు గ్రామానికి చెందిన వలంటీర్ రోజాకు శుక్రవారం ఉదయం వివాహమైంది. అయితే ఒకటో తేదీ ఉదయం ఎంతో మంది అవ్వా, తాతలు తనకోసం ఎదురుచూస్తారని పెళ్లి కాగానే నేరుగా భర్తతో కలిసి గ్రామంలో తిరుగుతూ పింఛన్ల పంపిణీ చేపట్టింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆమెను అభినందనలతో ముంచెత్తారు.

కాకినాడ జిల్లా సామర్లకోటలో..

కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణంలోని 20వ వార్డు ఒకటో సచివాలయానికి చెందిన వలంటీర్ చిట్టుమాని దుర్గాదేవికి శనివారం పెళ్లి. ఆమెను శుక్రవారం పెళ్లికుమార్తెగా అలంకరించారు. అయినప్పటికీ ఆమె తన విధులు మరువకుండా.. పెళ్లికూతురి ముస్తాబులోనే తండ్రి శ్రీనివాసరావు సాయంతో తన పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు అందించింది.

ఏపీ ఆక్వా చట్టాలు దేశానికే ఆదర్శం

- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల, నీతి ఆయోగ్ సీఈవో కితాబు
- ఏపీలో ఆక్వారంగం బలోపేతానికి అవసరమైన చేయూతనిస్తాం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో ఆక్వారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, చట్టాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని కేంద్రం కితాబునిచ్చింది. రాష్ట్రంలో ఆక్వారంగం బలోపేతం కోసం అవసరమైన తోడ్పాటు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల, నీతి ఆయోగ్ సీఈవో పీవీఆర్ సుబ్రహ్మణ్యం, నీతి ఆయోగ్ జాతీయ సలహాదారు నీలం పటేల్ స్పష్టం చేశారు. నీతి ఆయోగ్ ఆహ్వానం మేరకు న్యూఢిల్లీ వెళ్లిన ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాం శుక్రవారం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆక్వారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఏపీ సీఎం వైఎస్ జగన్ ఎంతో ముందుచూపుతో అడుగులు వేస్తున్నారని, ఈ రంగంలో తెచ్చిన సంస్కరణలు నిజంగా ప్రశంసనీయమని


నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యంతో మాట్లాడుతున్న అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

అన్నారు. భవిష్యత్‌లో ఆక్వారంగం మరింత పుంజుకునేందుకు ఇవి ఎంతో దోహద పడతాయన్నారు. కొత్తగా తీసుకొచ్చిన చట్టాలు, ఈ–ఫిష్ సర్వే ద్వారా ఆక్వా సాగు గుర్తింపు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్, ఆన్‌లైన్ ద్వారా లైసెన్సుల జారీ వంటి కార్యక్రమాలు దేశానికే ఆదర్శమన్నారు. జాతీయ స్థాయిలో ఆచరించతగ్గ కార్యక్రమాలని చెప్పారు. ఏపీ ఆక్వా కార్యక్రమాలను ఇటీవల ఆ రాష్ట్రంలో పర్యటించినపుడు స్వయంగా చూశామన్నారు.

15 రోజులకోసారి సమీక్ష

రాష్ట్రంలో ఆక్వా అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం కేంద్ర మంత్రికి, నీతి ఆయోగ్ సీఈవోకు వివరించారు. ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నం.1 స్థానంలో ఉందన్నారు. ఈ రంగం బలోపేతం కోసం సీఎం వైఎస్ జగన్ గడిచిన ఐదేళ్లలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి రైతులకు అన్ని విధాలుగా తోడుగా నిలుస్తున్నారని అన్నారు. ఆక్వా కార్యకలాపాలన్నీ కొత్తగా ఏర్పాటు చేసిన అప్సడా చట్ట పరిధిలోకి తీసుకొచ్చారని, నాణ్యమైన సీడ్, ఫీడ్ సరఫరా కోసం ఏపీ సీడ్, ఫీడ్ యాక్టులను తీసుకొచ్చారని చెప్పారు. ప్రతీ 15 రోజులకోసారి అప్సడా ఆధ్వర్యంలో రైతులు, ప్రాసెసింగ్, ఎక్స్‌పోర్టర్స్‌తో సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు రైతులకు యూనిట్ రూ. 1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ఇప్పటి వరకు రూ. 3,420 కోట్లు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం భరించిందన్నారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ సీఈవో మాట్లాడుతూ.. ఏపీలో జాతీయ పరిశోధన సంస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, తాము అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం నుంచి అవసరమైన ప్రతిపాదనలు పంపితే ఆమోదించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి

రాజధాని ప్రాంత రైతు కూలీల క్షీరాభిషేకం

వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే, గంజి చిరంజీవి

మంగళగిరి : రాజధాని ప్రాంత రైతు కూలీలు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు కూలీల పింఛన్‌ను సీఎం జగన్ రూ.5 వేలకు పెంచిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం గుంటూరు జిల్లా యర్రబాలెం, నిడమర్రులో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలిసి పర్యటించి వలంటీర్ల ద్వారా రైతు కూలీలకు రూ.5 వేల చొప్పున పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో యర్రబాలెంలో పలువురు లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి, నిడమర్రులో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకతీతంగా రైతు కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందని, అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ రూ.5 వేల పింఛన్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. చంద్రబాబు రాజధాని ప్రాంతంలో తమ స్వార్థం కోసం, స్వలాభం కోసం రైతులను, రైతు కూలీలను ఎన్నో ఇబ్బందులకు


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతు కూలీలతో ఎమ్మెల్యే ఆర్కే, గంజి చిరంజీవి

గురి చేశారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రైతులు లబ్ధిపొందలేకపోయారని, ఇక రైతు కూలీల జీవితాలైతే అగమ్యగోచరంగా తయారైన పరిస్థితులను చూశామన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో రైతుల భూములను తీసుకున్న చంద్రబాబు.. రాజధానిని నిర్మించలేకపోవడంతో పాటు రైతులు, రైతు కూలీలకు న్యాయం చేయలేకపోయాడని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ అసెంబ్లీ సాక్షిగా తాను రైతు కూలీలను ఆదుకుంటానని వాగ్దానం చేశారని, ఆ మేరకు రూ.2,500గా ఉన్న రైతు కూలీల పింఛన్‌ను రూ.5 వేలకు పెంచారని ప్రశంసించారు.

అంటువ్యాధులకు అడ్డుకట్ట వేయండి : సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కలుషిత నీరు, పారిశుధ్యం లోపం వంటి కారణాలతో అంటురోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్. జవహర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో పారిశుధ్యంపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్షించి పలు సూచనలిచ్చారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుతూ డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఇందుకుగాను గ్రామ/వార్డు సచివాలయాలను సన్నద్ధం చేయాలన్నారు. ఇటీవల గుంటూరులో డయేరియా నియంత్రణకు చేపట్టిన చర్యలనూ సీఎస్ సమీక్షించారు. డ్రైన్ల మీదుగా వెళ్లే తాగునీటి పైపులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, సచివాలయంలో జరిగిన రహదారి భద్రతా ఫండ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై సీఎస్ సమీక్షించారు. ఇందులో రాష్ట్ర రహదారులు–భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్లపై మరో పిటిషన్

- వారు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిరోధించాలంటూ హైకోర్టులో పిల్
- గతంలోనే ఈ విషయంలో టీడీపీ యత్నాలను అడ్డుకున్న హైకోర్టు
- 2021లో మరోసారి వలంటీర్లపై టీడీపీ నేతల పిటిషన్లు
- వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచాలన్న అప్పటి ఎస్ఈసీ ఉత్తర్వులు
- కానీ, వాటిపై స్టే విధించిన న్యాయస్థానం
- వారు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆధారాల్లేవన్న హైకోర్టు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థను తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2019లో జారీచేసిన జీఓ–104తో పాటు తదనుగుణంగా జారీచేసిన ఉత్తర్వులను చట్ట విరుద్ధంగా, ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 2.57 లక్షల మంది కార్యకర్తలను గ్రామ, వార్డు వలంటీర్లుగా నియమించారని, దీనిని చట్ట, రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ వైఎస్సార్ కడప జిల్లా, రాజంపేటకు చెందిన షేక్ అబూబాకర్ సిద్ధిఖీ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశారు. 2019 నుంచి ఇప్పటివరకు ఖజానా నుంచి వలంటీర్లపై ఖర్చుచేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీఎం జగన్‌ని ఆదేశించాలని సిద్ధిఖీ తన వ్యాజ్యంలో కోర్టును కోరారు. అలాగే, రానున్న ఎన్నికల్లో పోలింగ్ బూత్ ఏజెంట్లుగా వ్యవహరించకుండా, ఓటర్ల స్లిప్పులను పంపిణీ చేయకుండా వలంటీర్లను నిలువరించాలని కూడా కోర్టును అభ్యర్థించారు. అలాగే, ఎన్నికలు ముగిసేవరకు వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాల పంపిణీ జరగకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని సిద్ధిఖీ తన వ్యాజ్యంలో కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, గ్రామ, వార్డు వాలంటీర్ల శాఖ ముఖ్య కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీఎం వైఎస్ జగన్, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, 9 మంది వాలంటీర్లను ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ పిల్‌పై సీజే నేతృత్వంలోని ధర్మాసనం వచ్చే వారం విచారణ జరిపే అవకాశాలున్నాయి.

గతంలోనే హైకోర్టు నిరాకరణ..

వాస్తవానికి.. గ్రామ వలంటీర్ల నియామకాన్ని అడ్డుకునేందుకు తెలుగుదేశం పార్టీ 2019లోనే ప్రయత్నించింది. అయితే, హైకోర్టు ఆ ప్రయత్నాలను అప్పుడే అడ్డుకుని నియామకాలను నిలుపుదల చేసేందుకు నిరాకరించి అందుకు సంబంధించిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. వారి నియామకాన్ని అడ్డుకునేందుకు ఎలాంటి కారణం కనిపించడంలేదని స్పష్టంచేసింది. రాజస్థాన్ ప్రభుత్వం అమలుచేసిన గ్రామ సహాయక్ విధానాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు సమర్థించిన విషయాన్ని కూడా హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చాలన్న ఉద్దేశంతోనే వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చామన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనతో హైకోర్టు ప్రాథమికంగా ఏకీభవించింది.

ఎస్ఈసీ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే..

ఇక వలంటీర్లను అడ్డుకునేందుకు 2021లో కూడా టీడీపీ ప్రయత్నించింది. అందుకు అప్పటి ఎన్నికల కమిషనర్ సైతం సహకరించారు. అయితే, టీడీపీ నేతలు, ఎన్నికల కమిషన్ దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. అప్పుడు వివాదాస్పద అధికారిగా పేరుపడ్డ నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేష్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచాలంటూ కలెక్టర్లకు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు తప్పుబట్టి నిలిపివేసింది. వారు అధికార దుర్వినియోగానికి పాల్పడి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారనేందుకు ఎలాంటి ఆధారాల్లేవని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. ప్రజాశ్రేయస్సు కోసం పనిచేస్తున్న వలంటీర్లను వారి విధుల నిర్వహణకు అనుమతించాలన్నది కోర్టు అభిప్రాయమని తేల్చి చెప్పింది. వలంటీర్ల కార్యకలాపాలను నిలువరించాల్సిన అవసరంలేదంది. తమ ఫోన్లలో ఉన్న లబ్ధిదారుల డేటాను వలంటీర్లు దుర్వినియోగం చేస్తారన్న ఎన్నికల కమిషన్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. డేటాను దుర్వినియోగం చేయాలనుకుంటే అందుకు ఫోన్లే అవసరంలేదని, ఫోన్లు లేకపోయినా కూడా దుర్వినియోగం చేస్తారని, ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌ది అనవసర ఆందోళన మాత్రమేనని కొట్టిపారేసింది.

ఎస్ఈసీ ఉత్తర్వులపై ధర్మాసనం ఆందోళన..

ఇక హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ ఎన్నికల కమిషన్ ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొద్దిగా సవరించింది. వలంటీర్లు ఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారుల వద్ద ఫోన్లను ఉంచాలని, అవసరమైనప్పుడు వాటిని వాడుకోవచ్చునని తెలిపింది. అయితే, ఫోన్లు వాడకుండా వలంటీర్లపై నిషేధం విధించేందుకు ధర్మాసనం నిరాకరించింది. అలా చేయడం వలంటీర్ల విధులను అడ్డుకోవడమేనని తేల్చిచెప్పింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు మౌఖిక వ్యాఖ్యలు కూడా చేసింది. వలంటీర్లు తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే నేరుగా తామే చర్యలు తీసుకుంటామని అప్పటి ఎన్నికల సంఘం చెప్పడంపై ధర్మాసనం ఆందోళన కూడా వ్యక్తం చేసింది. ఇది తమను అత్యంత ఆందోళనకు గురిచేస్తోందని.. అలా నేరుగా చర్యలు తీసుకునే అధికారం, పరిధి ఎన్నికల కమిషన్‌కు లేవని స్పష్టంచేసింది. అవసరానికి మించి వలంటీర్లపై ఆంక్షలు విధిస్తున్నారని అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది.

మహాసేన రాజేష్‌ను రాజకీయాల నుంచి బహిష్కరించాలి

- అతనికి టికెట్ ఇచ్చిన చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- పలు హిందూ సంఘాల హెచ్చరిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/గోకవరం/మహారాణిపేట (విశాఖ దక్షిణ)/కర్నూలు(న్యూటౌన్) : హిందూ దేవుళ్లు, మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం టీడీపీ అభ్యర్థి సరిపెళ్ల రాజేష్(మహాసేన రాజేష్)పై పలు హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. రాజేష్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, రాజకీయాల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశాయి. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హిందూ ధర్మ చైతన్య వేదిక కన్వీనర్ కోటంరాజు వెంకటేశ్వర శర్మ, న్యాయవాది సీహెచ్ సాయిరామ్‌లు మాట్లాడుతూ ×హిందూ స్త్రీలను బలవంతంగా తీసుకురండి... లక్ష రూపాయలు ఇస్తా?Ì అని ప్రకటించిన రాజేష్‌కు టికెట్ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పరశురామ సేన ప్రతినిధులు లక్ష్మీపతి, ప్రయాగ కృష్ణ, న్యాయవాదులు ఎం.విఠల్‌రావు, చిరిగుడి


విజయవాడలో మాట్లాడుతున్న న్యాయవాది సాయిరాం. పక్కన వెంకటేశ్వరశర్మ తదితరులు

ఆదాం, చిన్నం రామకృష్ణ, చిగురుపాటి చైతన్య, గవాస్కర్, అబ్రహం లింకన్, నరహరిశెట్టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. కాగా, సరిపెళ్ల రాజేష్ అసభ్యకర వ్యాఖ్యలను ఖండిస్తూ విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సమితి ఆధ్వర్యాన తూర్పు గోదావరి జిల్లా గోకవరం దేవీచౌక్ ఆలయం వద్ద శుక్రవారం హిందూ సంఘాల సభ్యులు ఆందోళన నిర్వహించారు. రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గోకవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వరసాల ప్రసాద్, వీహెచ్‌పీ రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు పాల్గొన్నారు. మరోవైపు వివాదాస్పదుడైన మహాసేన రాజేష్‌కు పి.గన్నవరం టికెట్‌ను కేటాయించడాన్ని నిరసిస్తూ బ్రాహ్మణ సంఘ నాయకులు శుక్రవారం విశాఖపట్నంలోని టీడీపీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. బ్రాహ్మణ సంఘ నాయకులు విజయ్ సోమయాజులు, అయ్యలూరి నాగ నీలకంఠశాస్త్రి, శివగణేష్ శర్మ, అధికారుల అశోక్, వడ్డాది ఉదయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. రాజేష్‌కు టికెట్ ఇవ్వడం అంటే బ్రాహ్మణులను టీడీపీ అవమానించినట్లేనని స్పష్టం చేశారు. మహాసేన రాజేష్‌కు టీడీపీ ఇచ్చిన పి.గన్నవరం టికెట్‌ను వెంటనే రద్దు చేయాలని కర్నూలులో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటరామరాజు డిమాండ్ చేశారు.

ఆర్బీకేల్లో ఈ–క్రాప్ జాబితాల ప్రదర్శన

వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్



సాక్షి, అమరావతి: సామాజిక తనిఖీలో భాగంగా రబీ 2023–24 సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ ముసాయిదా జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ వెల్లడించారు. రబీ సీజన్‌లో 42.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, 100 శాతం పంటల నమోదు(ఈ–క్రాప్) చేయగా, 97 శాతం రైతుల ఈ–కేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ముసాయిదా జాబితాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నామని వివరించారు. ఈ జాబితాలపై రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ కోసం ఆర్బీకే స్థాయిలో గ్రామసభలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. పంటల వారీగా ఈ–క్రాప్‌లో నమోదైన రైతుల వివరాలను ఆర్బీకే సిబ్బంది ఈ గ్రామసభల్లో చదివి వినిపిస్తారన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తమ గ్రామంలోని ఆర్బీకేలను సందర్శించి అక్కడ ప్రదర్శించే ఈ–క్రాప్ జాబితాలను పరిశీలించుకోవాలని సూచించారు. ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నా, చేర్పులు, మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నా ఆర్బీకేల్లో పనిచేసే వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని కోరారు. వాటిని ఆర్బీకే సిబ్బంది పరిశీలించి మండల వ్యవసాయాధికారితోపాటు తహసీల్దార్ ధ్రువీకరణ కోసం పంపిస్తారన్నారు. మండల స్థాయిలో పరిశీలించిన తర్వాత అవసరమైతే క్షేత్ర స్థాయిలో మరోసారి పరిశీలించి అభ్యంతరాలను 5వ తేదీలోపు పరిష్కరిస్తారన్నారు. మండల స్థాయి అధికారుల ఆమోదంతో అవసరమైన చేర్పులు, మార్పులు చేసి ఈ నెల 8వ తేదీన తుది జాబితాలను ప్రదర్శిస్తారని వివరించారు. రబీ సీజన్‌కు సంబంధించి సవరణలు చేసుకునేందుకు ఇదే చివరి అవకాశమని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని విధిగా ఆర్బీకేలో ప్రదర్శిస్తున్న జాబితాలను సరిచూసుకోవాలని హరికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తుది జాబితా ఆధారంగానే పంట నష్టపరిహారం, పంటల బీమా వంటి సాయం అందుకునేందుకు అర్హత పొందుతారని తెలిపారు.

క్లుప్తంగా...

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 5.06లక్షల మంది హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జనరల్ విభాగంలో తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలకు 4,89,714 మందికి గాను 4,67,002 మంది, వొకేషనల్ జీఎఫ్‌సీ పరీక్షకు 46,662 మందికి గాను 39,003 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదవలేదని ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. మొత్తం విద్యార్థుల్లో 18,180 మంది గైర్హాజరైనట్టు బోర్డు పేర్కొంది.

ఏటీఓ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)ల్లో ఖాళీగా ఉన్న 71 అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ (ఏటీఓ) పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ బి.నవ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https://employment.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా 20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మే 6వ తేదీన రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షల షెడ్యూల్ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని వివరించారు.

11 నుంచి జీఎన్‌ఎం పరీక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని మహిళా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ)లకు ఇన్ సర్వీస్ జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) శిక్షణలో భాగంగా ఈ నెల 11 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం శుక్రవారం తెలిపారు. ఎంపీహెచ్‌ఏలకు రెండేళ్ల పాటు జీఎన్‌ఎం శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో ఉన్న వారికి ఈ నెల 11–19 వరకు థియరీ పరీక్షలు, 20–24 మధ్య ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు.

ప్రత్యేక సబ్జెక్ట్‌గా 'ఫుడ్ లిటరసీ'

- ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్‌తో ప్రభుత్వం అవగాహన ఒప్పందం

సాక్షి, అమరావతి/పెనమలూరు:: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరింత నాణ్యత ప్రమాణాలతో కూడిన సంపూర్ణ పోషకాహారాన్ని అందించేలా 'జగనన్న గోరుముద్ద'ను మరింత పటిష్టంగా అమలు చేస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ చెప్పారు. శుక్రవారం ఆయన విజయవాడ కానూరులోని షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన 'జగనన్న గోరుముద్ద–ఫుడ్ లిటరసీ' పైగా రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం ప్రకారం 'హెల్త్ అండ్ వెల్ నెస్ ఎడ్యుకేషన్'ను కరిక్యులమ్‌లో భాగం చేయాలన్నారు. 'ఫుడ్ లిటరసీ'ని ప్రత్యేక సబ్జెక్ట్‌గా చేర్చే అంశంపై ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. ఈ సంస్థ త్వరలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందన్నారు. ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు విద్యార్థుల్లో సామర్థ్యం పెంచేందుకు ఫుడ్ లిటరసీ దోహదం చేస్తుందన్నారు. ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సీఈవో పవన్ అగర్వాల్, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ శోభిక తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల భర్తీకి అనుమతి

- ఎన్‌సీటీఈ ప్రొసీడింగ్స్ అమలును నిలిపిన హైకోర్టు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేట్ బీఈడీ కళాశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కోటా (ఈడబ్ల్యూఎస్) కింద 10 శాతం సీట్ల భర్తీని నిలిపేస్తూ జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మండలి (ఎన్‌సీటీఈ) జారీ చేసిన ప్రొసీడింగ్స్ అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. కొన్ని కాలేజీలు అవకతవకలకు పాల్పడ్డాయన్న కారణంతో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల భర్తీని నిలుపుదల చేయడం సరికాదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల భర్తీని కొనసాగించుకోవచ్చునని, అయితే అవకతవకలకు పాల్పడిన కాలేజీలపై జరిగే విచారణ కూడా కొనసాగించవచ్చని, ఇందుకు ఈ ఉత్తర్వులు అడ్డంకి కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. బీఈడీ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్ల భర్తీని నిలుపుదల చేస్తూ ఎన్‌సీటీఈ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ పలు బీఈడీ కాలేజీలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యంపై శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ సుజాత మరోసారి విచారణ జరిపారు. కాలేజీల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. ఎన్‌సీటీఈ తరఫున కూడా వాదనలు విన్న న్యాయమూర్తి, విచారణ జరుగుతున్న కారణంతో చట్ట ప్రకారం విద్యార్థులకు దక్కాల్సిన ఈడబ్ల్యూఎస్ కోటాను దక్కకుండా చేయడానికి వీల్లేదన్నారు. ప్రభుత్వానికి, ఎన్‌సీటీఈకి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు.

డీఎస్సీపై

దగాకోరు రాతలు

ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై రామోజీ కుటిల కథనం

- ఇప్పటికీ తెలంగాణలో పోస్టింగ్స్‌కు 1998, 2008 డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణ
- అప్పటి నుంచి మురిగిపోయిన పోస్టులతో కలిపే ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్
- ఏపీలో గత ఐదేళ్లలో 15 వేల పోస్టులు భర్తీ చేసిన సీఎం జగన్
- వీటిలో 1998 నుంచి పోస్టింగ్స్ లేని వారికీ ఉద్యోగాలు
- తాజాగా 6,100 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్
- వీటితో కలిపితే ఏపీలో ఇచ్చిన టీచర్ ఉద్యోగాలు 21,108
- ఈ విషయం దాచి తెలంగాణలో మెగా అంటూ దగా కథనం
- డీఎస్సీ అభ్యర్థులను చంద్రబాబు మోసం చేసిన వైనం పైనా దాపరికమే
- 2018 డీఎస్సీలో నామమాత్రంగా 300 పోస్టులు మాత్రమే భర్తీ
- 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులను పట్టించుకోని బాబు
- వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత మూడు డీఎస్సీల అభ్యర్థులకు న్యాయం
- ప్రత్యేక శ్రద్ధతో కోర్టు కేసులు పరిష్కరించి మరీ పోస్టింగ్స్
- ఏపీలోని విద్యా సంస్కరణలు తెలంగాణలో లేవేమిటని ప్రశ్నించని రామోజీ



సాక్షి, అమరావతి: ఐదేళ్లు సీఎంగా పనిచేసి కేవలం 300 టీచర్ ఉద్యోగాలిచ్చిన చంద్రబాబును ఇదేమిటని ఎన్నడూ ప్రశ్నించరు ఈనాడు రామోజీరావు. గత ఐదేళ్లలో ఇప్పటికే 15 వేల టీచర్ ఉద్యోగాలిచ్చి పేదల పిల్లలకు చక్కటి చదువులు అందిస్తూ మరో 6,100 మంది ఉపాధ్యాయుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనపై మాత్రం విషం చిమ్ముతారు అదే రామోజీ. ఎందుకంటే.. రామోజీ, చంద్రబాబు అంటేనే పెత్తందార్ల పెద్దలు. పేదల పిల్లల ఎదుగుదల, అభివృద్ధిని సహించలేరు. అందుకే పేదల చదువులపై ఎప్పుడూ విషం చిమ్ముతుంటారు. అదే క్రమంలో రాష్ట్రంలో తాజా డీఎస్సీపై పక్క రాష్ట్రంతో పోలిక పెట్టి.. మెగా.. దగా.. అంటూ ఓ కుటిల కథనం అచ్చేశారు. అసలు ఈ పోలికే ఓ దగా. ఎందుకంటే.. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ 1998, 2018 డీఎస్సీ నోటిఫికేషన్స్ పోస్టుల భర్తీ జరగనే లేదు. అలాంటి పోస్టులన్నీ మురగపెట్టి ఇప్పుడు 11వేల పోస్టులకు అక్కడి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. దీనినే రామోజీ మెగా డీఎస్సీ అంటున్నారు. కానీ, మన రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం 1998 డీఎస్సీ నుంచి 2019 స్పెషల్ డీఎస్సీ, మరో 12,00 కేజీబీవీ రెగ్యులర్ పోస్టులు కలిపి 15 వేల పోస్టులను ఇప్పటికే భర్తీ చేసింది. తాజాగా 6,100 పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తోంది. ఇవన్నీ కలిపితే సీఎం జగన్ ఇచ్చిన ఉపాధ్యాయ ఉద్యోగాలు 21,108. అంటే తెలంగాణలో భర్తీ చేస్తున్న పోస్టుల కంటే ఏపీలో పోస్టులే అధికం. ఈ విషయం చెప్పకుండా రామోజీ పాఠకులను తప్పుదోవ పట్టిస్తూ కథనం ఇవ్వడం దగా కాక మరేమిటి?



తాజా డీఎస్సీతో అన్ని ఖాళీల భర్తీ

తాజాగా 2024 డీఎస్సీలో 6100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (గురుకులం), ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఆశ్రం), ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, మహాత్మా జోతిబాపూలే బ్యాక్‌వర్డ్ క్లాస్ వెల్ఫేర్ సొసైటీ విద్యా సంస్థల్లో మొత్తం అన్ని ఖాళీలను భర్తీ చేస్తున్నారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులు 2,280, స్కూల్ అసిస్టెంట్స్ 2,299, టీజీటీ 1,264, పీజీటీ 215, ప్రిన్సిపల్ పోస్టులు 42 ఉన్నాయి. ఇకపై ప్రతి విద్యా సంవత్సరం చివర్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి కొత్త విద్యా సంవత్సరంలో పూర్తిస్థాయి బోధన అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఇలా..

1998 డీఎస్సీ	4,059
2008 డీఎస్సీ	2,193
2018 డీఎస్సీ	6,954
2019 స్పెషల్ డీఎస్సీ	602
కేజీబీవీ రెగ్యులర్ పోస్టులు	1,200
2024 డీఎస్సీ	6,100
మొత్తం	21,108

బాబు డీఎస్సీ పెద్ద నాటకం

చంద్రబాబు హయాంలో డీఎస్సీ ఓ పెద్ద నాటకం. చంద్రబాబు నాలుగేళ్లు అధికారాన్ని అనుభవించి ఎన్నికలకు ముందు ఏడాది 2018లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. దానిని కూడా సక్రమంగా నిర్వహించలేక చేతులెత్తేశారు. ఫలితంగా అభ్యర్థులకు అన్యాయం జరగడంతో కోర్టుకు వెళ్లాల్సివచ్చింది. ఇందులో 7,254 ఉపాధ్యాయ పోస్టులకు గాను.. చంద్రబాబు భర్తీ చేసిన పోస్టులు 300 మాత్రమే. కానీ, డీఎస్సీకి చంద్రబాబు పేటెంట్ అన్నట్టు ఈనాడు కలరింగ్ ఇస్తోంది.

ఇది సీఎం జగన్ చేసిన మేలు

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించారు. ఒక్క పాఠశాల కూడా మూత పడకుండా, ఏ ఒక్క టీచర్ అభ్యర్థికి అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టారు. ప్రతి పాఠశాలలో నూరు శాతం టీచర్లను నియమిస్తున్నారు. దానికి తగ్గట్టుగానే పాత, కొత్త డీఎస్సీల ద్వారా పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే 2018 డీఎస్సీలో చంద్రబాబు చేతిలో దగాపడ్డ అభ్యర్థులకు సీఎం జగన్ న్యాయం చేశారు. కోర్టు కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక దృష్టి సారించి సుమారు 6,954 మంది అభ్యర్థులకు ఉపాధ్యాయులుగా పోస్టింగులు ఇచ్చారు. అంతకు ముందు 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులు కూడా దశాబ్దాలుగా పోస్టింగ్స్ కోసం ఎదురు చూశారు. చంద్రబాబు వీరినీ పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేశారు. ఇలా చంద్రబాబు దొంగ నాటకానికి బలైపోయిన అభ్యర్థులను సీఎం జగన్ చొరవ తీసుకుని టైం స్కేల్ ప్రాతిపదికన నియమించారు. ఇలా 1998 డీఎస్సీలోని 4,059 మంది, 2008 డీఎస్సీలోని 2,193 మంది అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చారు. వీటితో పాటు కేజీబీవీల్లో సుమారు 1,200 మంది రెగ్యులర్ టీచర్లను నియమించారు. నిత్యం శుద్ధపూస కబుర్లు చెప్పే రామోజీ.. చంద్రబాబు చేతిలో మోసపోయిన డీఎస్సీ అభ్యర్థులకు సీఎం జగన్ చేసిన ఈ మేలు గురించి ఒక్క అక్షరం రాయరు.

ఇది రామోజీ కుటిలత్వం

రామోజీ బోడి గుండుకు.. మోకాలికి ముడిపెట్టే ప్రయత్నం కూడా చేశారు. ప్రపంచ బ్యాంకు రుణం కోసం ఉపాధ్యాయ ఖాళీలను దాచేస్తున్నారంటూ పాతరాగానికి కొత్త ట్యూన్ కట్టారు. ఇక్కడ పాఠశాలల అభివృద్ధిని కాంక్షిస్తూ రుణం వస్తుంది. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు కీలక భూమిక పోషిస్తేనే ఆ పాఠశాల బాగుపడుతుంది. విద్యార్థికి ఉన్నత భవిష్యత్తు దక్కుతుంది. ఈనాడు చెప్పినట్టు కేవలం రుణం కోసం ఖాళీలను దాచేసి పాఠాలు చెప్పేవారు లేకుండా చేసి విద్యాభివృద్ధిని ఎలా సాధిస్తారు? కొంచెం జ్ఞానంతో ఆలోచిస్తే ఎవరికైనా రామోజీ రాతల్లోని కుటిలత్వం బోధపడుతుంది.

తెలంగాణలో ఇవెందుకు లేవు రామోజీ?

విద్యా రంగంలో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క విద్యా రంగంపైనే రూ.73 వేల కోట్లు ఖర్చు చేశారు. ఏపీలో మనబడి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ విద్యలో సమూల మార్పులు కళ్లకు కడుతున్నాయి. ఇంగ్లిష్ మీడియం, టోఫెల్, సీబీఎస్‌ఈ సిలబస్, జగనన్న గోరుముద్ద, పేద విద్యార్థులకు ట్యాబ్స్, జగనన్న విద్యా కానుక, అమ్మఒడి సాయం, ద్విభాషా పాఠ్య పుస్తకం, ఐఎఫ్‌పీలు, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ బోధనతో పాటు ప్రపంచం మెచ్చిన ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సిలబస్ మూరుమూల పల్లెల్లోని ప్రభుత్వ బడుల్లోకి వస్తున్నాయి. మన పిల్లలను అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా చేస్తున్నాయి. ఇవన్నీ తెలంగాణలో లేవు. అక్కడి పేదల పిల్లలకు ఇలాంటి ఫలాలు దక్కట్లేదని ఈనాడు రాయదు. ఇక్కడ రామోజీ లక్ష్యం ఒక్కటే.. అది సీఎం జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో ఏదో రకంగా వ్యతిరేకత పెంచడం.

సంబేపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఐబీ కరిక్యులం అంతర్జాతీయ ప్రతినిధులు



ఐబీకి దగ్గరగా ఏపీ విద్యా విధానాలు

- ఐబీ కరిక్యులం అంతర్జాతీయ ప్రతినిధులు ప్రశంస
- అన్నమయ్య జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శన

సంబేపల్లె: ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తోన్న విద్యా విధానాలు ఇంటర్నేషనల్ బాకలారియట్ (ఐబీ)కి దగ్గరగా ఉన్నాయని ఐబీ కరిక్యులం రూపకల్పన సభ్యులు కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్ అమల్లోకి రానున్న దృష్ట్యా అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఐబీ కరిక్యులం రూపకల్పన సభ్యులు వెండిగీన్ (అమెరికా) ఎరిక్ బాబర్ (ఇంగ్లండ్) సందర్శించారు. వీరు నాడు–నేడు ద్వారా సమకూరిన తరగతి గదులు, ఇతర మౌలిక వసతుల గురించి ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అమలవుతోన్న విద్యా విధానం, విద్యార్థుల అభ్యసన విధానంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఎలా దోహదపడుతున్నాయనేది పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను చూసి వాటిని ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకున్నారు. బైజూస్ ట్యాబ్స్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, జగనన్న విద్యాకానుక, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద పథకాల ద్వారా తాము ఏ విధంగా ప్రయోజనం పొందుతున్నామో విద్యార్థులు వీరికి వివరించారు. అంతర్జాతీయ ప్రతినిధులు పాఠశాలలోని జగనన్న గోరుముద్దను తిన్నారు. పాఠశాలలో డిజిటల్ విద్య, ద్విభాష పాఠ్యపుస్తకాలు, లైబ్రరీ, యూనిఫామ్, భౌతిక, జీవనశాస్త్ర ప్రయోగశాలలను పరిశీలించి ఉపాధ్యాయులను ప్రశంసించారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంపై ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు. ఎస్‌సీఈఆర్‌టీ అధ్యాపకుడు గిరిబాబు యాదవ్ మాట్లాడుతూ 2035కి పదోతరగతికి, 2037కి 12వ తరగతికి ఐబీ సిలబస్‌ను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని సదుపాయాలపై అధ్యయనం చేసేందుకు ఐబీ కరిక్యులం అంతర్జాతీయ ప్రతినిధులు ఏపీలోని పలు పాఠశాలలను సందర్శిస్తున్నారని చెప్పారు.

3 నుంచి 'ఆదర్శ' ప్రవేశాలకు దరఖాస్తులు

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్

సాక్షి, అమరావతి: ఏపీ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశాల కొరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 164 మోడల్ స్కూల్స్ (ఆదర్శ పాఠశాలల)లో ఈనెల 3 నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆయా మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లో 5వ తరగతి స్థాయి సిలబస్‌తో తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మోడల్ స్కూళ్లలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత బోధనను అందిస్తున్నట్టు వివరించారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించి www.cse.ap.gov.in/ https://apms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆబ్జెక్టివ్ విధానంలోని ప్రవేశ పరీక్షలో ఓసీ, బీసీ అభ్యర్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 30 మార్కులు సాధించాలన్నారు. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయింపు చేపడతామని తెలిపారు. ప్రవేశాలకు ఓసీ, బీసీ విద్యార్థులు 01-09-2012 నుంచి 31-08-2014 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2010 నుంచి 31-08-2014 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. వారు సంబంధిత జిల్లాలో ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లో నిరవధికంగా 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలు చదివి, 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలని స్పష్టం చేశారు.

మార్కెట్‌లోకి డీఎస్సీ ప్రిపరేషన్ పుస్తకాలు

తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ లక్ష్మీపార్వతి

సాక్షి, అమరావతి: టీచర్ పోస్టుల భర్తీ (డీఎస్సీ)కి నిర్వహించే పోటీ పరీక్షల సిలబస్‌కు అనుగుణంగా ప్రచురణలు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్నాయని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్స్, ఎస్‌జీటీ, టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీ నేపథ్యంలో సబ్జెక్టుల వారీగా పుస్తకాలను రూపొందించామని పేర్కొన్నారు. వీటితో పాటు అకాడమీ గతంలో విడుదల చేసిన టెట్, బీఎడ్ పుస్తకాలు పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. ఈ పుస్తకాలు అకాడమీ ప్రాంతీయ కేంద్రాలైన విశాఖపట్నం (9666638421), తిరుపతి (9581109119), అనంతపురం (8247890766), విజయవాడ (9989313912)లతో పాటు అన్ని ప్రాంతాల్లోని పుస్తక దుకాణాల్లో విక్రయానికి అందుబాటులోకి తెచ్చామన్నారు.

బాబు ఓకే చేస్తేనే పవన్ యాక్షన్..

జనసేన అధినేత పవన్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా చంద్రబాబు ఓకే చెప్పాల్సిందే

- ఆ పార్టీకి 24 సీట్లు కేటాయించినా, ఇప్పటివరకు ఐదు మాత్రమే ఖరారు
- బాబు అభ్యంతరాలతో పవన్ పోటీచేసే నియోజకవర్గం పెండింగే
- రాజోలు, తణుకు, రాజమండ్రి రూరల్ కూడా..
- ఎన్నికల వేళ హైదరాబాద్‌లో మకాం ఏమిటని పార్టీ శ్రేణుల ప్రశ్న



సాక్షి, అమరావతి: ఒక రాజకీయ పార్టీ అధినేత అంటే ఎలా ఉండాలి.. స్వీయ నిర్ణయాలు తీసుకునే ధైర్యం, ట్రబుల్ షూటర్ లక్షణాలు.. కార్యకర్తలు, నేతల అభిప్రాయాలకు విలువివ్వడం.. ఇలాంటివన్నీ పుణికిపుచ్చుకోవాలి. కానీ, ఇవేవీ లేనివాళ్లను ఏమనాలి? జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనాలి. ఎందుకంటే.. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ ఆయన వేసే ప్రతీ అడుగు, తీసుకునే ప్రతి నిర్ణయం తెలుగుదేశం అధినేత చంద్రబాబు కనుసైగ చేస్తేనే జరుగుతోంది. ఇది ప్రత్యర్థి పార్టీల నుంచి వస్తున్న విమర్శ కాదు.. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో సాక్షాత్తు జనసేన శ్రేణులు వ్యక్తంచేస్తున్న నిశ్చితాభిప్రాయం. ఎందుకంటే.. టీడీపీతో పొత్తులో జనసేనకు కేటాయించిన 24 అసెంబ్లీ సీట్లలో ఇప్పటికీ కేవలం ఐదు స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించిన పవన్‌కళ్యాణ్, మిగిలిన 19 స్థానాల పేర్లు ఇంకా ప్రకటించలేదు. ఇందుకు కారణం.. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తుది అనుమతి కోసం ఎదురుచూస్తున్నారట. ఇదే విషయం ఇప్పుడు జనసేనలో హాట్‌టాపిక్‌గా మారింది. చంద్రబాబు సూచన మేరకు రెండు, మూడు జాబితాలుగా వెలువడే అవకాశముందని జనసేన నేతలు చెబుతున్నారు. చివరకు.. పవన్ తాను పోటీచేసే స్థానంపై ఇరువురు నేతలు సూచనప్రాయంగా ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ.. దానిని అధికారికంగా ప్రకటించకుండా ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తున్నారని వారంటున్నారు. ఇక వారం రోజుల క్రితం జరిగిన టీడీపీ–జనసేనల సీట్ల కేటాయింపు ప్రకటనకు ముందే రాజోలు, రాజానగరం స్థానాల్లో జనసేనే పోటీచేస్తుందని పవన్ ప్రకటించారు. అయితే.. ఆ తర్వాత ఈనెల 24న చంద్రబాబు–పవన్‌కళ్యాణ్ ఉమ్మడిగా నిర్వహించిన మీడియా సమావేశంలో గతంలో చంద్రబాబు ప్రకటించిన రెండు స్థానాలకు టీడీపీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించారుగానీ.. పవన్ ప్రకటించిన రెండింటిలో రాజోలు అభ్యర్థిని ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టేశారు. అక్కడ పవన్‌కళ్యాణ్ ముందుగా అనుకున్న పేరుపై చంద్రబాబు అభ్యంతరం చెప్పిన కారణంగానే జనసేన తొలి జాబితాలో అదిలేదని జనసేన వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ లెక్కన.. జనసేన పోటీచేసే మిగిలిన 19 స్థానాల జనసేన అభ్యర్థుల ఎంపికకు కూడా చంద్రబాబు ఆమోదం కావాల్సి ఉంటుందని వారు స్పష్టం చేస్తున్నారు. అలాగే.. ఆయా స్థానాల్లో తమకు సీట్లు ఖాయమని ఇప్పటివరకూ అనుకుంటున్న జనసేన నేతలు కూడా తమ అభ్యర్థిత్వానికి టీడీపీ అధినేత ఎసరు పెడతారేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. చంద్రబాబు జనసేనకు 24 అసెంబ్లీ స్థానాలే కేటాయించడాన్ని కూడా పవన్ పవిత్ర గాయత్రీ మంత్రంతో గొప్పగా పోల్చుకున్నారని.. నిజానికి.. హిందూ సంప్రదాయం ప్రకారం ఆ మంత్రాన్ని చెవిలోనే ఉపదేశిస్తుంటారని.. ఈలెక్కన జనసేనకు కేటాయించిన ఆ 24 సీట్లలో ఎవరు పోటీచేయాలన్నది చంద్రబాబు పవన్ చెవిలో చెప్పిన తర్వాతే తమ అధినేత అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుందని జనసేన నాయకులే ఛలోక్తులు విసురుతున్నారు.

బాబు చెప్పుచేతల్లో పవన్..

లోకేశ్ రాజకీయ భవిష్యత్తు కోసం చంద్రబాబు ఇప్పటికే పవన్ మాటలకు విలువ లేకుండా చేశారని వారంటున్నారు. ఒక వ్యూహం ప్రకారం తమ అధినేతను ఆయన తన చెప్పుచేతల్లో ఉంచుకునే ఎత్తుగడలో ఉన్నారని జనసేన నేతలు అనుమానిస్తున్నారు. ఎందుకంటే..

- తొమ్మిది నెలల క్రితం తణుకులో పవన్ అక్కడి స్థానిక పార్టీ ఇన్‌చార్జి వి. రామచంద్రరావుకు సీటు ఇస్తానని ఇచ్చిన మాటకు విలువలేకుండా ఆ స్థానంలో చంద్రబాబు టీడీపీ అభ్యర్థిని ప్రకటించడాన్ని వారు ఉదహరిస్తున్నారు.
- అలాగే, సీట్ల కేటాయింపు ప్రకటనకు వారం రోజుల ముందే పవన్ రాజమండ్రి పర్యటనలో రూరల్ స్థానంలో జనసేనే పోటీచేసేలా చంద్రబాబును ఒప్పిస్తానని స్థానిక పార్టీ నేతలకు మాటిచ్చారు. కానీ, ఆ స్థానం ఇప్పటివరకూ అధికారికంగా ఖరారు కాకపోయినా, అనధికారికంగా ఆ స్థానం టీడీపీకి కేటాయించినట్లు ఇరు పార్టీలు వెల్లడిస్తున్నాయి.
- ఇంకోవైపు.. 2019 ఎన్నికల్లో టీడీపీతో సంబంధం లేకుండా జనసేన వేరుగా పోటీచేసినప్పుడే పవన్ 30 వేలకు పైగా ఓట్లు తెచ్చుకున్న పలు స్థానాలను కూడా ఇప్పుడు పొత్తులో జనసేనకు కేటాయించకుండా, ఏదో ఒక సాకుతో అక్కడ టీడీపీ అభ్యర్థులను చంద్రబాబు ఖరారు చేసేసి ఆ ఎన్నికల్లో జనసేనకు కేవలం 7,633 ఓట్లు మాత్రమే వచ్చిన నెల్లిమర్ల.. 11,988 ఓట్లే వచ్చిన అనకాపల్లి వంటి నియోజకవర్గాలను తమ పార్టీకి కేటాయించారని జనసేన నేతలు గుర్తుచేస్తున్నారు.

బాబు కోసం దిగజారుతున్న పవన్..

ఇవన్నీ ఒక ఎత్తయితే.. జనసేనకు 24 అసెంబ్లీ సీట్లనే కేటాయించిన విషయాన్ని సమర్థించుకోవడానికి పవన్‌కళ్యాణ్ ఏకంగా సొంత పార్టీనే తక్కువ చేసి మాట్లాడడాన్ని జనసేన శ్రేణులు, ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికలప్పుడు బూత్‌లో పనిచేయడానికి రాష్ట్రంలో ఎన్ని స్థానాల్లో జనసేనకు 800–1000 మంది కార్యకర్తలున్నారని ప్రశ్నిస్తూ తాడేపల్లిగూడెం సభలో పవన్ మాట్లాడారని.. ఇలాంటి మాటలు టీడీపీ కోసం తన నాయకత్వాన్ని ఆయనే తక్కువ చేసుకున్నట్లుగా ఉన్నాయని జనసేన నాయకులు వాపోతున్నారు.

ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో

ఇదిలా ఉంటే.. రోజురోజుకీ రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతుంటే పవన్‌కళ్యాణ్ మాత్రం ఎక్కువగా హైదరాబాద్‌కే పరిమితమై ఉండడమేంటని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈనెల 24న ఉమ్మడి అభ్యర్థుల తొలిజాబితా ప్రకటన ప్రక్రియ పూర్తికాగానే ఆయన తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. మళ్లీ 28న తాడేపల్లిగూడెం సభలో పాల్గొనేందుకు నేరుగా హైదరాబాద్ నుంచి సభాస్థలికి వచ్చారు. సభ పూర్తి కాగానే తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. గత మూడు రోజులుగా హైదరాబాద్‌కే పరిమితయ్యారు. ఇలా పవన్ వ్యవహారశైలి చూస్తుంటే ఆయన చంద్రబాబు కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు సుస్పష్టమవుతోందని జనసేన శ్రేణులు, ఆ పార్టీ అభిమానులు కుండబద్దలు కొడుతున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	1,245	355
	73,745	22,339

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,236	▲ 144
డోజోన్స్	39,063	▲ 66
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,683	▲ 52
డాక్స్	17,735	▲ 57
షాంఘై	3,027	▲ 12
నికాయ్	39,911	▲ 745

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారట్)	61,720
బంగారం (22 క్యారట్)	58,780
వెండి (కేజీ)	76,200

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.47	83.49
£	బ్రిటన్ పౌండ్		103.55	106.11
€	యూరో		88.60	90.95
¥	జపాన్ ఎన్ (100)		54.58	55.81
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.07	54.99
S$	సింగపూర్ డాలర్		59.27	63.94
SAR	సౌదీ రియాల్		21.20	22.78
UAE D	యూఏఈ దిర్హామ్		21.67	23.47
¥	చైనా యువాన్		10.40	12.47

తయారీ చక్రం స్పీడ్



ఫిబ్రవరిలో 56.9కి సూచీ

న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం ఫిబ్రవరిలో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.9కి ఎగసింది. ఇది ఐదు నెలలు గరిష్ట స్థాయి. జనవరిలో సూచీ 56.5గా నమోదయ్యింది. సమీక్షా నెల్లో సూచీకి దేశీయ, అంతర్జాతీయ డిమాండ్ సహకారం లభించినట్లు ఈ మేరకు వెలువడిన ఒక నెలవారీ సర్వే పేర్కొంది. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆలోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణించడం జరుగుతుంది. ద్రవ్యోల్బణం 2023 జూలై కనిష్ట స్థాయికి తగ్గడంతో తయారీ సంస్థల మార్జిన్లు మెరుగుపడినట్లు సర్వే పేర్కొనడం గమనార్హం. దాదాపు 400 మంది తయారీదారుల ప్యానెల్‌లో కొనుగోలు చేసే మేనేజర్‌లకు పంపిన ప్రశ్నలు, ప్రతిస్పందనలను ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మదింపుచేసే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పీఎంఐని ఆవిష్కరిస్తుంది.

ఎల్‌ఐసీ రూ. 2,441 కోట్ల డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్‌ఐసీ) కేంద్ర ప్రభుత్వానికి రూ. 2,441 కోట్ల డివిడెండ్ చెల్లించింది. ఎల్‌ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి నుంచి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ మేరకు చెక్ అందుకున్నారు. ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ వివేక్ జోషి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-3-2024	
విశాఖ	500-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	460-00
విజయవాడ	460-00
రిటైల్ ధర (డజను)	72.00
1-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	426-00
వరంగల్	428-00
రిటైల్ ధర	4.85

జీఎస్‌టీ వసూళ్లు @ రూ.1.68 లక్షల కోట్లు

- ఫిబ్రవరిలో 12.5 శాతం అప్
- కొత్త పరోక్ష పన్ను వ్యవస్థలో నాల్గవ అతి భారీ వసూళ్లు
- ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య 12 శాతం పురోగతి
- రూ. 18.40 లక్షల కోట్ల వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఫిబ్రవరిలో రూ.1,68,337 కోట్లుగా నమోదయ్యాయి. 2023 ఇదే నెలతో పోల్చితే ఈ వసూళ్ల వృద్ధి 12.5 శాతం. ఇక 2017 జూలైలో కొత్త పరోక్ష పన్ను వ్యవస్థ ప్రారంభమైన తర్వాత ఇవి నాల్గవ అతి భారీ వసూళ్లు. దేశీయ అమ్మకాలు, దిగుమతులు, పన్ను ఎగవేతల నిరోధానికి చర్యలు తాజా ఫలితానికి కారణం. ఇక 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి మధ్య వసూళ్లు అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే 11.7% పెరిగి రూ.18.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నెలవారీ సగటు వసూళ్లు వార్షికంగా రూ.1.5 లక్షల కోట్ల నుంచి రూ.1.67 లక్షల కోట్లకు పెరిగింది.

విభాగాల వారీగా...

- సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ.31,785
- స్టేట్ జీఎస్‌టీ రూ.39,615 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.84,098 కోట్లు (దిగుమతి వస్తువులపై వచ్చిన రూ.38,593 కోట్ల సెస్ సహా)
- సెస్ రూ.12,839 కోట్లు (దిగుమతి వస్తువులపై వసూలయిన రూ.984 కోట్ల సెస్ సహా)

ఆర్థిక సంవత్సరంలో (అంకెలు రూ. లక్షల కోట్లలో)	
ఏప్రిల్ 2023	1.87
మే	1.57
జూన్	1.61
జూలై	1.60
ఆగస్టు	1.59
సెప్టెంబర్	1.63
అక్టోబర్	1.72
నవంబర్	1.67
డిసెంబర్	1.64
జనవరి 2024	1.74
ఫిబ్రవరి	1.68

2023 ఏప్రిల్, 2024 జనవరి, 2023 అక్టోబర్, 2024 ఏప్రిల్ ఇప్పటి వరకూ భారీ వసూళ్లలో తొలి 4 నెలలుగా నిలిచాయి.



సరికొత్త శిఖరాలపై సూచీలు

గణాంకాల జోష్ ● అమెరికాలో దిగివచ్చిన ద్రవ్యోల్బణం ● ర్యాలీకి లార్జ్ క్యాప్ షేర్ల దన్ను



ముంబై: దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో శుక్రవారం దలాల్ స్ట్రీట్ బుల్ దుమ్మురేపింది. అమెరికా ద్రవ్యోల్బణం దిగిరావడం, విదేశీ ఇన్వెస్టర్ల తాజా కొనుగోళ్లు కలిసొచ్చాయి. లార్జ్ క్యాప్ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(2%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (2%), ఐసీఐసీఐ బ్యాంక్ (3%), ఎల్‌అండ్‌టీ (4%)లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా శుక్రవారం స్టాక్ సూచీలు 2023 డిసెంబర్ 5 తర్వాత అతిపెద్ద ఒకరోజు లాభాల్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,245 పాయింట్లు పెరిగి 73,745 ముగిసింది. నిఫ్టీ 355 పాయింట్లు బలపడి 22,339 వద్ద స్థిరపడింది. ఇరు సూచీలకు ఇది జీవితకాల గరిష్ట ముగింపు కావడం విశేషం. ఒక దశలో సెన్సెక్స్ 1,319 పాయింట్లు దూసుకెళ్లి 73,819 వద్ద, నిఫ్టీ 370 పాయింట్లు బలపడి 22,353 వద్ద జీవితకాల గరిష్ట స్థాయిని చూశాయి.

నేడు.. ట్రేడింగ్


సెలవు దినం అయినప్పటికీ శనివారం (నేడు) స్టాక్ మార్కెట్ పని చేస్తుంది. "డిజాస్టర్ రికవరీ సైట్ ట్రయల్స్‌లో భాగంగా శనివారం ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్స్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించనున్నాము" ఎక్స్ఛేంజీలు తెలిపాయి. ఉదయం 9:15 నుంచి 10 గంటల మధ్య ప్రధాన సైట్ ద్వారా తొలి ట్రేడింగ్ సెషన్, ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12:30 మధ్య రెండో ట్రేడింగ్ జరగనుంది.

ఇన్వెస్టర్ల సంపద భారీ జంప్

సెన్సెక్స్ భారీ ర్యాలీతో బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4.29 లక్షల కోట్లు పెరిగి రూ. 392.25 లక్షల కోట్లకు చేరింది.

పేమెంట్స్ బ్యాంకుతో పేటీఎం ఒప్పందాల ఉపసంహరణ

యథావిధిగా యాప్, క్యూఆర్ కోడ్, సౌండ్ బాక్స్




న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంకుపై (పీపీబీఎల్) ఆర్‌బీఐ చర్యల నేపథ్యంలో దానితో అంతర్గత ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని ఫిన్‌టెక్ సంస్థ పేటీఎం నిర్ణయించుకుంది. దీనికి బోర్డు ఆమోదముద్ర వేసినట్లు కంపెనీ మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్.. స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఒకదానిపై మరొకటి ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు తమ మధ్య అంతర్గత ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని పేటీఎం, పీపీబీఎల్ పరస్పరం ఒక అంగీకారానికి వచ్చినట్లు వివరించింది. గతంలో ప్రకటించినట్లుగానే తమ పేటీఎం యాప్, క్యూఆర్, సౌండ్‌బాక్స్, కార్డ్ మెషీన్లు యథావిధిగా నిరాటంకంగా పని చేస్తాయని కంపెనీ తెలిపింది. పదే పదే నిబంధనల ఉల్లంఘన కారణంగా మార్చి 15 నుంచి దాదాపు కార్యకలాపాలన్నింటినీ నిలిపివేయాలంటూ పీపీబీఎల్‌ను ఆర్‌బీఐ ఆదేశించిన నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఫిబ్రవరిలోనూ 'రయ్ రయ్'

- ఎస్‌యూవీలకు డిమాండ్ ప్రభావం
- కార్లు, టూ వీలర్స్ అమ్మకాలు అప్
- తిరోగమనంలో ట్రాక్టర్ల విక్రయాలు

ముంబై: స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ)కు ఆదరణ పెరగడంతో ఫిబ్రవరిలోనూ రికార్డు స్థాయిలో వాహనాలు అమ్ముడయ్యాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రాఅండ్‌మహీంద్రా, టయోటా కిర్లోస్కర్ మోటార్, హోండా కార్స్ కంపెనీల అమ్మకాల్లో వృద్ధి నమోదైంది. మొత్తం 3.73 లక్షల ప్యాసింజర్ వాహన(పీవీ) విక్రయాలు జరిగాయి. తద్వారా పరిశ్రమ చరిత్రలో అత్యధిక పీవీలు అమ్ముడైన మూడో నెలగా ఫిబ్రవరి ఆవిర్భవించింది. ద్విచక్ర వాహనాలకూ డిమాండ్ కొనసాగింది. కాగా ట్రాక్టర్స్ అమ్మకాల వృద్ధిలో క్షీణత జరిగింది.



వాహన విక్రయాలు

కంపెనీ	ఫిబ్రవరి 2024	ఫిబ్రవరి 2023	(%ల్లో)
మారుతీ సుజుకీ	1,97,471	1,72,321	(+)15
హ్యుందాయ్ మోటార్స్	60,501	57,851	(+)4.5
టాటా మోటార్స్	86,406	79,705	(+)8
ఎండ్అండ్ఎం	72,923	58,801	(+)24
హోండా కార్స్	7,142	6,086	(+)17
ఎంజీ మోటార్స్	4,532	4,193	(+)8
టయోటా కిర్లోస్కర్	25,220	15,685	(+)61
బజాజ్ ఆటో	3,46,662	2,80,226	(+)35
టీవీఎస్ మోటార్స్	3,68,424	2,76,150	(+)33
రాయల్ ఎన్‌ఫీల్డ్	75,935	71,544	(+)6
హోండా మోటార్స్	4,58,711	2,47,195	(+)86
హీరో మోటోకార్ప్	4,68,410	3,94,460	(+)19
సుజుకీ మోటార్	97,435	70,621	(+)38
వోల్వో ఐషర్	7,424	7,289	(+)2
అశోక్ లేలాండ్	16,451	17,568	(-)6
ఎస్కార్ట్స్	6,481	7,811	(-)17
మహీంద్రా ట్రాక్టర్స్	21,672	25,791	(-)16

10 యాప్ సంస్థలపై గూగుల్ చర్యలు

సర్వీస్ ఫీజు చెల్లించనందుకు ప్లేస్టోర్ నుంచి తొలగింపు షురూ ● లిస్టులో మ్యాట్రిమోనీడాట్‌కామ్, ఆల్ట్, కుకు ఎఫ్ఎం మొదలైనవి!

న్యూఢిల్లీ: సర్వీస్ ఫీజు చెల్లింపుల వివాదం కారణంగా టెక్ దిగ్గజం గూగుల్ పలు యాప్ సంస్థలపై చర్యలకు ఉపక్రమించింది. వాటిని తమ ప్లేస్టోర్ నుంచి తొలగించే ప్రక్రియ ప్రారంభించింది. అనేక అవకాశాలు ఇచ్చినప్పటికీ, తమ ప్లాట్‌ఫామ్‌తో ప్రయోజనం పొందుతున్న 'పేరొందిన' పది సంస్థలు ఫీజులు చెల్లించడం లేదని సంస్థ పేర్కొంది. అయితే, గూగుల్ సదరు సంస్థల పేర్లను నిర్దిష్టంగా వెల్లడించలేదు. కానీ, షాదీ, మ్యాట్రిమోనీడాట్‌కామ్, భారత్ మ్యాట్రిమోనీ వంటి యాప్స్ కోసం ఆండ్రాయిడ్ ఫోన్లపై సెర్చి చేస్తే వాటి పేర్లు కనిపించకపోవడంతో జాబితాలో అవి ఉన్నట్లుగా పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే బాలాజీ టెలిఫిల్మ్స్‌కి చెందిన ఆల్ట్ (గతంలో ఆల్ట్‌బాలాజీ), ఆడియో ప్లాట్‌ఫాం కుకు ఎఫ్ఎం, డేటింగ్ సర్వీస్ యాప్ క్వాక్‌క్వాక్, ట్రూలీ మ్యాడ్లీ కూడా ప్లేస్టోర్ నుంచి మాయమయ్యాయి. ఇన్-యాప్ పేమెంట్స్‌పై గూగుల్ 11 నుంచి 26 శాతం ఫీజులను విధిస్తుండటంపై నెలకొన్న వివాదం ఈ పరిణామానికి దారి తీసింది. ప్లాట్‌ఫాం ఫీజుపై పోరాడుతున్న కంపెనీలకు అనుకూలంగా సుప్రీం కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించడంతో నిబంధనలను పాటించని యాప్‌లను గూగుల్ తొలగించడం ప్రారంభించింది. ఉచిత డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌ను ఆఫర్ చేస్తూ ఇండస్ యాప్ స్టోర్‌ను ఫోన్‌పే ప్రవేశపెట్టిన తరుణంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇది గుత్తాధిపత్య ధోరణి..: కుకు ఎఫ్ఎం

కాగా, గూగుల్ గుత్తాధిపత్య ధోరణితో వ్యవహరిస్తోందని కుకు ఎఫ్ఎం సహ-వ్యవస్థాపకుడు వినోద్ కుమార్ వ్యాఖ్యానించగా, ఇది భారత్‌లో ఇంటర్నెట్‌కు దుర్దినంగా భారత్ మ్యాట్రిమోనీ వ్యవస్థాపకుడు మురుగవేల్ జానకిరామన్ అభివర్ణించారు. సుప్రీంకోర్టులో కేసు విచారణ పెండింగ్‌లో ఉన్నందున ఎటువంటి చర్యలు తీసుకోవద్దని, ఏ యాప్‌ను డీలిస్ట్ చేయొద్దని గూగుల్‌కి ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ (ఐఏఎంఏఐ) సూచించింది.

సాక్షి స్పోర్ట్స్



పోరాడి ఓడిన సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి, భారత రెండో ర్యాంకర్ సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. గురుగ్రామ్‌లో శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 5-7, 6-3, 0-6తో టాప్ సీడ్ దలీలా జకుపోవిచ్ (స్లొవేనియా) చేతిలో ఓడిపోయింది. మరోవైపు భారత నంబర్‌వన్ అంకిత రైనా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో అంకిత 4-6, 6-2, 6-4తో జాక్వెలిన్ (స్వీడన్)పై గెలిచింది.

గాయత్రి-ట్రెసా జోడీ పరాజయం

జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారిణుల కథ ముగిసింది. మహిళల డబుల్స్ బరిలో మిగిలిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి క్వార్టర్ ఫైనల్లో ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 16-21, 14-21తో లి యి జింగ్-లు జు మిన్ (చైనా) జంట చేతిలో ఓడిపోయింది.



రయ్..రయ్...రయ్...

నేటి నుంచి ఫార్ములావన్ సీజన్

సాఖిర్: గత ఏడాది పూర్తి ఆధిపత్యం చలాయించిన రెడ్‌బుల్ జట్టు అదే జోరును ఈ ఏడాదీ కొనసాగించాలనే లక్ష్యంతో ఫార్ములావన్ (ఎఫ్1) 2024 సీజన్‌లో బరిలోకి దిగనుంది. మొత్తం 24 రేసులతో కూడిన ఈ సీజన్‌కు నేడు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి రేసుతో తెర లేవనుంది. శనివారం క్వాలిఫయింగ్ సెషన్... ఆదివారం ప్రధాన రేసు జరుగుతాయి. భారత కాలమానం ప్రకారం నేటి రాత్రి గం. 9:30 నుంచి క్వాలిఫయింగ్ సెషన్‌ను... ఆదివారం రాత్రి 8:30 నుంచి ప్రధాన రేసును నిర్వహిస్తారు. ఫ్యాన్ కోడ్ యాప్‌లో ఎఫ్1 రేసుల ప్రత్యక్ష ప్రసారం ఉంది. గత సీజన్‌లో మొత్తం 22 రేసులు జరగ్గా... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లు వెర్‌స్టాపెన్ 19 రేసుల్లో, సెర్గియో పెరెజ్ 2 రేసుల్లో గెలిచారు. మరో రేసులో ఫెరారీ జట్టుకు చెందిన కార్లోస్ సెయింజ్ నెగ్గాడు. కొత్త సీజన్‌లో రెడ్‌బుల్ జట్టుతోపాటు వెర్‌స్టాపెన్ ప్రదర్శన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

యూకీ జోడీ ఓటమి



న్యూఢిల్లీ: దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) ద్వయం 3-6, 6-7 (2/7)తో ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా)-డోడిగ్ (క్రొయేషియా) జంట చేతిలో పరాజయం పాలైంది. యూకీ-హాస్‌లకు 48,760 డాలర్ల (రూ. 40 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

టెస్టుల్లో ఐర్లాండ్‌కు తొలి గెలుపు

అబుదాబి: టెస్టు హోదా లభించిన ఆరేళ్లకు ఐర్లాండ్ జట్టు ఎనిమిదో ప్రయత్నంలో తొలి విజయం నమోదు చేసింది. అఫ్గానిస్తాన్‌తో తటస్థ వేదిక అబుదాబిలో జరిగిన ఏకైక టెస్టులో ఐర్లాండ్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. గతంలో ఐర్లాండ్ ఏడు టెస్టులు ఆడి ఏడింటిలోనూ ఓడిపోయింది. అఫ్గానిస్తాన్ నిర్దేశించిన 111 పరుగుల విజయలక్ష్యాన్ని ఐర్లాండ్ 31.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించి గెలిచింది. కెప్టెన్ ఆండీ బాల్‌బిర్నీ (58 నాటౌట్; 5 ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో ఐర్లాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అఫ్గానిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 155 పరుగులు... ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులు సాధించాయి. 108 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆడిన అఫ్గానిస్తాన్ 218 పరుగులకు ఆలౌటైంది.

పుణేరీ... విజయభేరి

ప్రొ కబడ్డీ లీగ్ విజేత పుణేరీ పల్టన్ | తొలిసారి చాంపియన్‌గా నిలిచిన జట్టు | ఫైనల్లో హరియాణా స్టీలర్స్‌పై గెలుపు



సాక్షి, హైదరాబాద్: కబడ్డీ అభిమానులను 91 రోజుల పాటు అలరించిన ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ అట్టహాసంగా ముగిసింది. అన్ని విధాలా ఆధిపత్యం ప్రదర్శించిన పుణేరీ పల్టన్ మొదటిసారి లీగ్ చాంపియన్‌గా అవతరించింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఆసక్తికరంగా జరిగిన ఫైనల్లో పల్టన్ 28-25 పాయింట్ల తేడాతో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి 13-10తో ఆధిక్యంలో నిలిచిన పల్టన్ బలమైన డిఫెన్స్‌తో చివరి వరకు దానిని నిలబెట్టుకోవడంలో సఫలమైంది. గత సీజన్ ఫైనల్లో ఓడిన పుణేరీ వరుసగా రెండోసారి తుది పోరుకు అర్హత సాధించి టైటిల్‌ను సొంతం చేసుకుంది.

మ్యాచ్‌లో ఇరు జట్లు ఆరంభం నుంచి జాగ్రత్తగా ఆడుతూ డిఫెన్స్‌కే ప్రాధాన్యతనిచ్చాయి. ఫలితంగా తొలి 10 నిమిషాల్లోనే 13 ఎంప్టీ రైడ్‌లు వచ్చాయి. ప్రతీ పాయింట్ కోసం ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా... ఒకదశలో పుణేరీ 9-7తో స్వల్ప ఆధిక్యంలోనే ఉంది. అయితే ఈ దశలో 19వ నిమిషంలో పంకజ్ మోహితే డు ఆర్ డై రెయిడ్ మ్యాచ్ దిశను మార్చింది. ఒకేసారి 4 పాయింట్లు సాధించి అతను పుణేను ముందంజలో నిలిపాడు. ఆ తర్వాత ఈ అంతరాన్ని తగ్గించడంలో స్టీలర్స్ విఫలమైంది. 23వ నిమిషంలో స్టీలర్స్‌ను పల్టన్ జట్టు ఆలౌట్ కూడా చేయడంతో ఆట పూర్తిగా వారివైపు మొగ్గింది. చివరి పది నిమిషాల్లో హరియాణా పుంజుకున్నా అది విజయానికి సరిపోలేదు. రెండో అర్ధ భాగంలో ఇరు జట్లూ 15 పాయింట్లు చొప్పున సమానంగా స్కోరు చేసినా... తొలి అర్ధ భాగంలో వెనుకబడిన 3 పాయింట్లే చివరకు స్టీలర్స్ ఓటమికి కారణమయ్యాయి. పల్టన్ తరఫున పంకజ్ మోహితే 9 పాయింట్లు సాధించగా... మోహిత్ 5, కెప్టెన్ అస్లమ్ 4 పాయింట్లు సాధించారు. స్టీలర్స్ ఆటగాళ్లలో అత్యధికంగా శివమ్ 6, సిద్ధార్థ్ దేశాయ్ 4 పాయింట్లు స్కోరు చేశారు. విజేతగా నిలిచిన పుణేరీ జట్టుకు రూ. 3 కోట్లు, రన్నరప్ హరియాణా జట్టుకు రూ. 1 కోటి 80 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ విజేత జట్టుకు ట్రోఫీని అందజేశాడు.

అద్భుతమైన ఆటతో లీగ్ దశలో అగ్రస్థానం... 22 మ్యాచ్‌లలో 17 విజయాలు... స్కోరు తేడాలో ఎవరికీ అందనంత ఎత్తులో ముందంజ... ఈ సీజన్‌లో ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన పుణేరీ పల్టన్ తమ జోరును తగ్గించకుండా అసలు పోరులోనూ సత్తా చాటి తమ స్థాయిని ప్రదర్శించింది... గత సీజన్‌లో త్రుటిలో చేజారిన ట్రోఫీని ఈసారి ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా ఒడిసి పట్టుకుంది... ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తొలిసారి చాంపియన్‌గా సగర్వంగా నిలిచింది. మొదటిసారి ఫైనల్ చేరిన హరియాణా స్టీలర్స్ ఆరంభంలో ఆకట్టుకున్నా... ఒత్తిడిలో తలవంచి రన్నరప్‌కే పరిమితమైంది.

మళ్లీ ఓడిన గుజరాత్

- యూపీ వారియర్స్‌కు రెండో విజయం
- రాణించిన సోఫీ, గ్రేస్ హారిస్



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో గుజరాత్ జెయింట్స్ జట్టుకు 'హ్యాట్రిక్' ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ ఆరు వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచి తమ ఖాతాలో రెండో విజయం నమోదు చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 142 పరుగులు సాధించింది. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (26 బంతుల్లో 35; 4 ఫోర్లు, 1 సిక్స్), యాష్లే గార్డ్‌నర్ (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంతో గుజరాత్ స్కోరు 100 దాటింది. అంతకుముందు లారా వొల్వార్ట్ (26 బంతుల్లో 28; 4 ఫోర్లు), కెప్టెన్ బెత్ మూనీ (16 బంతుల్లో 16; 2 ఫోర్లు), హర్లీన్ డియోల్ (24 బంతుల్లో 18; 1 ఫోర్) వేగంగా ఆడటంలో విఫలమయ్యారు. యూపీ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు తీసింది. అనంతరం యూపీ వారియర్స్ 15.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి విజయతీరాలకు చేరింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్రేస్ హారిస్ (33 బంతుల్లో 60 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించి యూపీ విజయంలో కీలకపాత్ర పోషించింది. నేడు జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ముంబై ఇండియన్స్ తలపడుతుంది.

ఆరేళ్ల తర్వాత...

మహిళా క్రికెటర్లకు దేశవాళీ రెడ్ బాల్ టోర్నీ



ముంబై: భారత దేశవాళీ క్యాలెండర్‌లో మహిళా క్రికెటర్ల కోసం ఆరేళ్ల తర్వాత రెడ్ బాల్ టోర్నీని నిర్వహించనున్నారు. ఈనెల 28 నుంచి ఏప్రిల్ 11 వరకు పుణేలో ఈ టోర్నీ జరుగుతుందని బీసీసీఐ తెలిపింది. మొత్తం ఆరు జోనల్ జట్లు (ఈస్ట్, నార్త్ ఈస్ట్, సెంట్రల్, వెస్ట్, నార్త్, సౌత్‌జోన్) ఈ టోర్నీలో పోటీపడతాయి. ప్రతి మ్యాచ్ మూడు రోజులపాటు జరుగుతుంది. నార్త్, సౌత్ జోన్ జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభించగా... ఈస్ట్-నార్త్ ఈస్ట్; వెస్ట్-సెంట్రల్ జోన్ జట్ల మధ్య నాకౌట్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో గెలిచిన జట్లు సెమీఫైనల్స్‌లో నార్త్, సౌత్ జోన్ జట్లతో ఆడతాయి. చివరిసారి 2018లో మహిళా క్రికెటర్లకు రెడ్ బాల్ టోర్నీని ఏర్పాటు చేయగా... ఆ సమయంలో రెండు రోజుల మ్యాచ్‌లు నిర్వహించారు.

ఆసీస్‌కు ఆధిక్యం

న్యూజిలాండ్ 179 ఆలౌట్



వెలింగ్టన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా ఓవరాల్ ఆధిక్యం 217 పరుగులకు చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 279/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 115.1 ఓవర్లలో 383 పరుగులకు ఆలౌటైంది. కామెరాన్ గ్రీన్ (174 నాటౌట్; 23 ఫోర్లు, 5 సిక్స్‌లు), హాజల్‌వుడ్ (22; 4 ఫోర్లు) పదో వికెట్‌కు 116 పరుగులు జోడించడం విశేషం. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ 43.1 ఓవర్లలో 179 పరుగులకే కుప్పకూలింది. గ్లెన్ ఫిలిప్స్ (71; 13 ఫోర్లు), హెన్రీ (34 బంతుల్లో 42; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మాత్రమే రాణించారు. ఆసీస్ స్పిన్నర్ నాథన్ లయన్ 43 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో లయన్ టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో 521 వికెట్లతో 7వ స్థానానికి చేరుకున్నాడు. 204 పరుగుల భారీ ఆధిక్యం పొందిన ఆస్ట్రేలియా ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఆట ముగిసే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 13 పరుగులు సాధించింది.

పలువురు ఐఏఎస్‌లు బదిలీ

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్ బి.రాజశేఖర్ బదిలీ
- శశిభూషణ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగింత
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ జవహర్ రెడ్డి

సాక్షి, అమరావతి: పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్‌గా పనిచేస్తున్న బి.రాజశేఖర్‌ను బదిలీ చేశారు. తదుపరి పోస్టింగ్ కోసం ఆయనను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న శశిభూషణ్ కుమార్‌కు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌గా పనిచేస్తున్న ఎ.సూర్యకుమారిని మత్స్య శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. మత్స్య శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.కన్నబాబును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. కె.కన్నబాబు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.హర్షవర్ధన్‌కు మైనారిటీ సంక్షేమ శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏపీ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డి.మురళీధర్ రెడ్డికి సెర్ప్ ఈసీవో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏపీ గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.వెంకటరమణారెడ్డికి అదనపు సీసీఎల్, సీసీఎల్ఏ కార్యదర్శి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

నెల్లూరు వైఎస్సార్‌సీపీ లోక్‌సభ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి

- కర్నూలు, మంగళగిరి అసెంబ్లీ సమన్వయకర్తల నియామకం
- ప్రకటన విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం

సాక్షి, అమరావతి: ఒక లోక్‌సభ స్థానానికి, రెండు శాసనసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. తొమ్మిదో జాబితాలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా వేణుంబాక విజయసాయిరెడ్డి, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా ఎ.ఎండీ ఇంతియాజ్ (రిటైర్డ్ ఐఏఎస్), మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా మురుగుడు లావణ్యలను నియమించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఇంధన సామర్థ్య పరిశోధనల్లో ముందడుగు

ఎనర్జీ ఎఫిషియెంట్ సబ్‌మెర్సిబుల్ మోటారును తయారు చేసిన 'ఏపీఎస్ఈఈడీసీఓ' / **పంపుసెట్ అభివృద్ధిలో ఆంధ్రా వర్సిటీ సహకారం**



ఎనర్జీ ఎఫిషియెంట్ సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను ప్రారంభిస్తున్న కె.విజయానంద్. చిత్రంలో ఏపీఎస్ఈసీఎం అధికారులు, ఏయూ బృందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వినూత్న ఇంధన సామర్థ్య సాంకేతికతలను ప్రోత్సహించే లక్ష్యంతో, ఏపీ స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఈఈడీసీఓ) ముందడుగు వేసింది. ఇంటీరియర్ పర్మనెంట్ మాగ్నెట్ సింక్రోనస్ మోటర్ (ఐపీఎంఎస్ఎం) సాంకేతికతతో ఎనర్జీ ఎఫిషియెంట్ సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను విజయవంతంగా తయారు చేసింది. దీని కోసం సబ్‌మెర్సిబుల్ వాటర్ పంపింగ్ అప్లికేషన్ల కోసం రూపొందించిన ఎలక్ట్రికల్ మోటార్ డ్రైవ్ సిస్టమ్ డిజైన్ ప్రోటోకాల్‌ను ఆంధ్రా విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసింది. ఈ పరిశోధన ప్రాజెక్టులోని మోడల్ మోటార్‌ను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యుత్ సౌధలో శుక్రవారం ఆవిష్కరించారు. వ్యవసాయ రంగంలో పంపుసెట్లు కీలకపాత్ర పోషిస్తాయని, ఐపీఎంఎస్ఎం మోటార్ల ద్వారా ఈ రంగంలో విద్యుత్‌ను ఆదా చేయవచ్చని ఆయన తెలిపారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ద్వారా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) నిధులతో దాదాపు 20 వ్యవసాయ పంపుసెట్లలో ఐపీఎంఎస్ఎం సాంకేతికతను ప్రయోగాత్మకంగా అమలు చేయాలని ఏపీఈపీడీసీఎల్‌ను ఈ సందర్భంగా విజయానంద్ ఆదేశించారు. ఆంధ్రా వర్సిటీ ప్రొఫెసర్ మల్లికార్జున్ రావు, ఏపీఎస్ఈఈడీసీఓ టెక్నికల్ హెడ్ శ్రీనివాసులుతో కలిసి మోటార్ పనితీరును ఏపీఎస్ఈసీఎం సీఈఓ కుమార రెడ్డి వివరించారు. ఐపీఎంఎస్ఎం మోటార్లు సంప్రదాయ ఎలక్ట్రిక్ మోటార్‌లకు ప్రత్యామ్నాయమని, ఇండక్షన్ మోటార్‌లతో పోల్చితే తక్కువ విద్యుత్ వినియోగం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ మోటార్లకు 80 శాతం సామర్థ్యం ఉండగా, ఐపీఎంఎస్ఎం అనేది 90 శాతం ఉందని వెల్లడించారు. సంప్రదాయ మోటారు జీవిత కాలం సుమారు పదేళ్లకాగా, అధిక గ్రేడ్ మెటీరియల్స్ కారణంగా ఐపీఎంఎస్ఎం మోటార్ సుమారు 18 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకూ పనిచేస్తుందని చెప్పారు. తక్కువ నిర్వహణ వ్యయం, 30శాతం తక్కువ విద్యుత్ వినియోగం ఉంటుందని ఆయన వివరించారు.

ఈ-స్కూటర్ ధరలు తగ్గించిన 'అవేరా'



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన ఈ-స్కూటర్ల తయారీ సంస్థ అవేరా పలు బ్రాండ్ స్కూటర్ల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. రిట్రోసా-2 మోడల్‌పై రూ.5,215, విన్సెరో మోడల్‌పై రూ.10,500 తగ్గిస్తున్నట్లు అవేరా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ తగ్గింపు తక్షణం అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. రూ.92,000 ప్రారంభ ధర నుంచి అవేరా స్కూటర్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది.

ఏపీ ప్రభుత్వం చొరవ బాగుంది

- పిల్లల్లో పుట్టుకతో వచ్చిన ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తోంది
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రశంస

సాక్షి, అమరావతి: పిల్లల్లో పుట్టుకతో వచ్చిన ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో ఏపీ ప్రభుత్వం చూపుతున్న చొరవ బాగుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రశంసించింది. నేషనల్ బర్త్ డిఫెక్ట్ అవేర్‌నెస్ మంథ్-2024ను కేంద్ర ఆరోగ్య శాఖ శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర, నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే పాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్స్(డీఐఈసీ) ద్వారా పిల్లల్లో లోపాల గుర్తింపు, వివిధ లోపాలు ఉన్న పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్సలు చేయడం వంటి కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో జన్మించిన శిశువులకు తల నుంచి కాలి వరకు స్క్రీనింగ్ కోసం బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ప్రైమరీ, సెకండరీ ఆస్పత్రుల్లోని వైద్యులందరికీ పుట్టకతో వచ్చే లోపాలపై శిక్షణ ఇచ్చింది. ఈ ఆస్పత్రుల్లో గుర్తించిన వివిధ లోపాలు ఉన్న పిల్లలను డీఐఈసీలకు తరలించి వైద్యసేవలను అందిస్తున్నారు. ఇలా రాష్ట్రంలో గత ఏడాది జూలై నుంచి ఇప్పటి వరకు 1,52,226 మంది శిశువులను స్క్రీనింగ్ చేశారు. వీరిలో పుట్టుకతో లోపాలు ఉన్న చిన్నారులందరికీ మెరుగైన వైద్య సేవలందించి, లోపాలను పరిష్కరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 2 । మార్చి । 2024



దుర్గమ్మకు సారస్వత నీరాజనం

ఇంద్రకీలాద్రిపై కొలువైన్న కనకదుర్గమ్మకు 'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం' పేరుతో సారస్వత నీరాజనాన్ని పలికారు. -IIలో▸



అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా..

పేట మునిసిపాలిటీలో రూ.27.27కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వీటిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రారంభించారు. -IIలో▸

కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా శోభన్ బాబు



కోనేరుసెంటర్: కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య కె శోభన్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావు పేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, మ్యాథమెటిక్స్ విభాగం ఆచార్యులుగా పనిచేస్తున్న శోభన్ బాబు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

న్యూస్‌రీల్

స్కౌట్స్, గైడ్స్‌లో వెనీలకు జాతీయస్థాయి అవార్డు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి డీఏవీ పాఠశాల పూర్వ విద్యార్థి అడ్డగర్ల వెనీల స్కౌట్స్, గైడ్స్ జాతీయ స్థాయి ప్రెసిడెంట్ అవార్డుకు ఎంపికైంది. స్కౌట్స్ అండ్ గైడ్స్ వరల్డ్ థింకింగ్ డే, ఫౌండర్స్ డే సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరి 22న డీఏవీ పాఠశాలలో జరిగిన జాతీయ స్థాయి వేడుకలు, పరీక్షలో ఆమె 52/60 మార్కులతో ఈ ఘనత సాధించింది. 2016లో విద్యార్థి దశ నుంచి స్కౌట్స్, గైడ్స్‌లో పాల్గొని అనేక రాష్ట్ర జాతీయ స్థాయి అవార్డులు సాధించింది. ప్రస్తుతం లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న వెనీల 2020లో రాష్ట్ర గణతంత్ర వేడుకల్లో సైతం పాల్గొంది. అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసి నివేదిక న్యూఢిల్లీ స్కౌట్స్, గైడ్స్ అధికారులకు పంపారు. త్వరలో అవార్డు అందుకోనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మన్మోహన్ తెలిపారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రతిభ ఉండి వెలుగులోకి రాని పలు రంగాలకు చెందిన వారిని గుర్తించి ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన 'శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది – 2024 పురస్కారంతో సత్కరించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇఎస్ఎస్ నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు వారి ప్రతిభ, సర్టిఫికెట్, ఫొటోలతో ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన వారికి వచ్చేనెల 7వ తేదీన హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారంతో సత్కరించనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9652347207 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

హోం గార్డ్స్ ఇన్‌చార్జ్ కమాండెంట్‌గా మహేష్



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ రీజియన్ హోం గార్డ్స్ ఇన్‌చార్జ్ కమాండెంట్‌గా ఎం.మహేష్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ రీజియన్ హోం గార్డ్స్ కమాండెంట్‌గా పని చేస్తున్న కేవీ ప్రేమ్‌జిత్ విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు రీజియన్ హోం గార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు ఇస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు మహేష్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేశారు.

జైకొట్టిన జనరేషన్

పామర్రు.. జనహోరు

సమున్నత విద్యా సంకల్పం మరోసారి ప్రజ్వరిల్లింది. సంస్కరణల సంభవం సంబరమై విద్యార్థుల కళ్లముందు సాక్షాత్కరించింది. ఇంగ్లిష్ మీడియం.. సీబీఎస్ఈ.. బైజూస్ కంటెంట్ ట్యాబ్.. టోఫెల్ శిక్షణ.. ఐబీ కర్రికులమ్.. అమ్మ ఒడి.. గోరుముద్ద, వసతి దీవెన.. విద్యా దీవెన.. నాడు–నేడు.. ఇలా ప్రతీది పేదల చదువును పండుగ చేసిందని సాక్ష్యమిచ్చింది. పిల్లలకు మనమిచ్చే ఆస్తి చదువేనని.. ప్రపంచంతో పోటీ పడే కొత్త 'జనరేషన్'ను తయారు చేయడమే తన ధ్యేయమని చాటిచెబుతూ మరో దఫా జగనన్న విద్యా దీవెనకు సీఎం వైఎస్ జగన్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. తమ కోసం జగన్ మామ వచ్చారన్న సంబరంలో పామర్రు విద్యార్థిలోకం జనహోరై కదలివచ్చింది. జయోత్సాహ నినాదాలు చేస్తూ ఆద్యంతం ఉత్సాహంతో కేరింతలు కొట్టింది.





జయోత్సాహం.. సభకు హాజరైన విద్యార్థుల్లో ఓ భాగం, (ఇన్‌సెట్) సీఎం ప్రసంగం సమయంలో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

- విద్యా దీవెన పథకం నిధులు విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి
- భారీగా తరలి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- జై జగన్ నినాదంతో హోరెత్తిన సభా ప్రాంగణం
- విద్యా సంస్కరణలపై ఆకట్టుకున్న సీఎం ప్రసంగం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



అపురూప బహుమతి.. ముఖ్యమంత్రికి రాట్నం చిత్రపటాన్ని బహుమతిగా ఇస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హారిక, కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ తదితరులు

సాక్షి, మచిలీపట్నం: జై జగన్ నినాదంతో పామర్రు మార్మోగింది. జగనన్న విద్య దీవెన త్రైమాసిక ఫీజు చెల్లించే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం పట్టణానికి వచ్చారు. తమ పిల్లల ఉన్నత చదువులకు ఫీజులు ఇస్తున్న జగనన్న తమ ప్రాంతానికి వస్తున్నారని తెలుసుకొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పామర్రు పట్టణానికి చేరుకున్నారు. ఉదయం 9గంటల నుంచే జన సందోహంతో పట్టణ వీధులు నిండిపోయాయి. కృష్ణా జిల్లాతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేల మంది పామర్రు చేరుకున్నారు. 10 గంటలకే సభా ప్రాంగణంతా జన సందోహంతో నిండిపోయింది. 11.15 గంటలకు పామర్రు చేరుకున్న సీఎం జగన్ కాన్వాయ్‌లో నుంచి ప్రజలకు అభివాదం చేసుకుంటూ బహిరంగ సభకు వద్దకు చేరుకున్నారు.

ఆద్యంతం.. ఆసక్తికరం..

సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని సభకు హాజరైన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ప్రజలు ఎంతో ఆసక్తిగా విన్నారు. తాను అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగంలో తెచ్చిన మార్పులు, సంస్కరణలను, పేదల ఉన్నత విద్య కోసం తెచ్చిన వివిధ పథకాలను వివరించారు. వాటి కోసం చేసిన ఖర్చు, తల్లుల ఖాతాలో జమ చేసిన నగదు, చేకూరిన లబ్ధి, ఫలితం పొందిన విద్యార్థుల సంఖ్యను ఆయన వివరించారు. ముఖ్యంగా అమ్మ ఒడి, నాడు-నేడు, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం చదువులు, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంతో పాటు అమెరికా లాంటి దేశాలకు పంపించి ప్రసంగించేలా చేసిన కృషిని వివరించారు. వందేళ్ల ఆయుష్షు కలిగిన చిన్నారుల భవిష్యత్తుకు తాను చేస్తున్న ఈ ఖర్చుతో పేదల తలరాతలు మారుతాయని చెబుతూ సాగిన ఈ ప్రసంగం విద్యార్థులు, తల్లిదండ్రులను ఆలోచింపజేసింది.

కృష్ణా జిల్లాలో లబ్ధి ఇలా..

కార్యక్రమాన్ని సీఎం జగన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్టేజిపై ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిమకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ప్రసంగంతో సభను ప్రారంభించి జిల్లాలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. జగనన్న విద్యా దీవెనతో కృష్ణా జిల్లాలోని 32,620 మంది విద్యార్థులు, 28739 మంది తల్లుల ఖాతాలోకి రూ.28.30కోట్లు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. చివరగా జేసీ గీతాంజలి శర్మ కార్యక్రమం ముగింపు సందర్భంగా వీడ్కోలు పలికారు.

ఆట, పాటలు అదరహో..

విద్యా దీవెన కార్యక్రమంలో భాగంగా వేదిక వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యారంగంలో సీఎం జగన్ తెచ్చిన మార్పులు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రూపొందించిన పాటలకు చిన్నారులు చేసిన డ్యాన్స్ అలరించింది.

సభ సక్సెస్..

సీఎం జగన్ జిల్లా పర్యటన సందర్భంగా అధికారులు ఎలాంటి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కావలసిన చల్లని మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు మెడికల్ క్యాంపు,



మేనమామ ఆశీర్వాదం.. విద్యార్థినిని దీవిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

పథకాలపై అవగాహన సెంటర్లు ఏర్పాటు చేశారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఎస్పీ నయీం అస్మి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, ఎండీ రుహుల్లా, టి. కల్పలత, మొండితోక అరుణ కుమార్, జయమంగళ, పోతుల సునీత, మచిలీపట్నం, గుడివాడ, కైకలూరు శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంఎస్ నాగిరెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమ చంద్రారెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ పూర్ణమ్మ, ముడా చైర్ పర్సన్ బొర్రా లక్ష్మి నాగదుర్గ భవాని వైఎస్సార్ సీపీ బందరు, పెడన సమన్వయకర్తలు పేర్ని కిట్టు, ఉప్పాల రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యా దీవెన వరం..



జగనన్న విద్యా దీవెన పేద వర్గాల పాలిట వరంలా మారింది. నాలాంటి ఎంతో మంది పేదల కలలు సాకారం అయ్యేందుకు ఇది దోహదపడుతోంది. ఉన్నత విద్య అభ్యసించడానికి సాయం అందిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు.

– ఎం.మణికంఠ, డిగ్రీ సెకండియర్, గాంధీ విశ్వవిద్యాలయం మచిలీపట్నం

క్రమం తప్పకుండా..



క్రమం తప్పకుండా విద్యా దీవెన పథకం ద్వారా నగదు అకౌంట్‌లో జమ అవుతోం. దీంతో మా చదువులకు ఏవిధమైన ఇబ్బందులు లేవు. సీఎం జగనన్న కొత్తగా ఆలోచనలు చేసి విద్యా ప్రమాణాల పెరుగుదలకు కృషి చేస్తున్నారు.

– షేక్ రుకియ, బీటెక్ థర్డ్ ఇయర్, గుడ్లవల్లేరు కళాశాల

అండగా నిలిచింది..



జగనన్న విద్యా దీవెన పథకం వల్లే నా చదువు ముందుకు సాగుతోంది. క్రమం తప్పకుండా ఫీజులు అందిస్తున్నారు. వాటిని కాలేజీలో కట్టి ఇబ్బంది లేకుండా చదువుకుంటున్నాం. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– వై.నాగశ్రావణి, డిగ్రీ ఫైనల్ ఇయర్, ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, మచిలీపట్నం

అనిల్‌ను ఆశీర్వదించండి..

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌ను సీఎం జగన్ ప్రత్యేకంగా అభినందించారు. ఎంతో నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ, పేదలకు సేవ చేయాలనే తపన ఉన్న వ్యక్తి అనిల్ కుమార్ అని కితాబిచ్చారు. నియోజకవర్గంలో కొన్ని సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని ఆయనతో మరోసారి కూర్చొని ఆ సమస్యల పరిష్కారంపై చర్చిస్తామన్నారు. వాటికి అవసరమైన నిధులను మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్‌ను మరోసారి దీవించి గెలిపించాలని సీఎం జగన్ ప్రజలను కోరారు.



ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



నివాళి.. వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం



కృతజ్ఞత.. థ్యాంక్యూ జగన్‌మామ అని టీషర్టును ధరించిన విద్యార్థులు



ఉప్పొంగిన అభిమానం.. సీఎంకు అభివాదం చేస్తున్న మహిళలు



ఆహ్వానం.. సభా ప్రాంగణంలోకి వస్తున్న సీఎంతో ప్రజాప్రతినిధులు

గుర్తుంచుకోండి.. రెండే చుక్కలు

- రేపు పల్స్ పోలియో
- జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,48,868 మంది
- 1,008 కేంద్రాల్లో ఏర్పాట్లు
- డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఈ నెల 3న విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. అందుకు సంబంధించి ఒక ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతి యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల పరిధిలో ర్యాలీలు నిర్వహించి పిల్లలందరూ పల్స్‌పోలియో చుక్కలు వేసుకునేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

డోసులు సిద్ధం..

జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 2,48,868 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ వంద శాతం పోలియో చుక్కలు వేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1008 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనుండగా, వాటిలో గ్రామీణ ప్రాంతాల్లో 611, అర్బన్ ప్రాంతాల్లో 397 కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అవి కాక ట్రాన్సిట్ పాయింట్స్ 35, మొబైల్ యూనిట్స్ 71 ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో 4244 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మరో 104 మంది రూట్ సూపర్‌వైజర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా 3,11,460 పోలియో డోసులు సిద్ధం చేశామని డాక్టర్ సుహాసిని తెలిపారు.



పల్స్‌పోలియోపై నగరంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి..

జనజీవనానికి దూరంగా నివసించే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే సర్వే చేసి, ఆయా ప్రాంతాల్లో ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించినట్లు తెలిపారు. ఇటుక బట్టీలు, క్రషర్స్, సంచార జాతులు వంటి వారిని సైతం గుర్తించి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యులు, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

వేకువనే వేడుకగా 'కానుక'

జిల్లాలో తంతనుగా పింఛన్ పంపిణీ మొదలైంది. ఆయా సచివాలయాల పరిధిలో శుక్రవారం వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వేలిముద్రలు సేకరించి పింఛను మొత్తాలను అందజేసి వృద్ధుల మోముల్లో సంతోషాన్ని నింపారు. జిల్లాలో మొత్తం 2,38,157 మంది పెన్షనర్లకు గాను 1,72,062 మందికి నగదు అందజేసి, 72.21శాతం సాధించారు. జిల్లాలో అత్యధికంగా జి. కొండూరు మండలంలో 86. 75 శాతం, విజయవాడ రూరల్‌లో 82.89 శాతం, విస్సన్నపేటలో 78.01 శాతం, నందిగామ(అర్బన్)లో 77.91 శాతం, కంచికచర్లలో 77.47 శాతం పంపిణీ పూర్తయింది.

– గాంధీనగర్(విజయవాడసెంట్రల్)



విజయవాడ 22వ వార్డులో నాదెండ్ల లక్ష్మీకాంతంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ధనలక్ష్మి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 722 మంది గైర్హాజరు
- 99 కేంద్రాల్లో పరీక్ష రాసిన విద్యార్థులు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరానికి సంబంధించి పరీక్షలకు అధికారులు శ్రీకారం చుట్టారు. 99 కేంద్రాల్లో 39,544 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్ష రాయాల్సి ఉంది. అందులో 38,822 మంది హాజరయ్యారు. 722 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పరీక్షలను పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లను విద్యాశాఖతో పాటుగా పోలీసు రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు పర్యవేక్షించారు. ఉదయం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటంతో విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ పరీక్ష కొనసాగింది. అరగంట ముందుగా ఆయా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులను నిర్వాహకులు అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటంతో విద్యార్థుల కదిలికలను సైతం అధికారులు కంట్రోల్ రూమ్‌ల నుంచి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించటంతో పాటుగా చుట్టుపక్కల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పర్యవేక్షించారు. అలాగే ట్రాఫిక్ పోలీసులు ఆయా కేంద్రాల వద్ద వాహనాల రాకపోకలకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కేంద్రాల పరిశీలన..

విజయవాడ నగరంలోని బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, శ్రీశారదా జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఢిల్లీరావు అధికారులతో కలిసి శుక్రవారం ఉదయం సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటుగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో ఇన్విజిలేటర్లు, పర్యవేక్షకాధికారులను ఏర్పాటు చేశామన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా టెట్ పరీక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఏపీ టెట్ – 2024 పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షలో 1159 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 812 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షలో 733 మంది హాజరుకావాల్సి ఉండగా 467 మంది హాజరయ్యారు.

ఏడీఆర్ఎంగా ఎడ్విన్ బాధ్యతల స్వీకారం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)గా పి.ఈ ఎడ్విన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన సదరన్ రైల్వే త్రివేంద్రంలో గతి శక్తి ప్రాజెక్ట్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించేవారు. 2002లో సౌత్ వెస్ట్రన్ రైల్వే బంగారుపేట్‌లో ఏడీఈగా రైల్వే సర్వీస్‌లో చేరిన ఆయన అనేక హోదాల్లో కీలక పదవులు చేపట్టారు. డెప్యూటీ చీఫ్ ఇంజినీర్ (కన్‌స్ట్రక్షన్)గా ఉన్న సమయంలో యలహంక–హిందుపూర్‌లో మధ్య 83 కిలోమీటర్ల డబ్లింగ్ లైన్ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సౌత్ వెస్ట్రన్ రైల్వేలో అత్యుత్తమ పనితీరుకు గాను జీఎం అవార్డును కూడా అందుకున్నారు. ప్రస్తుతం విజయవాడ డివిజన్ ఏడీఆర్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న డి.శ్రీనివాసరావు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్‌లో చీఫ్ ఇంజినీర్ (స్టేషన్ డెవలప్‌మెంట్)గా బదిలీపై వెళ్లారు.

ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): సమగ్ర శిక్షాలో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ కె.రాములునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్, మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ కోర్సులు పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా మచిలీపట్నంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

దుర్గమ్మకు సారస్వత నీరాజనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు 'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం' పేరుతో సారస్వత నీరాజనాన్ని పలికారు. ఐదు రోజుల పాటు స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన మహాశతావధానంలో డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ తన అద్భుత సాహితీ పటిమతో సాహితీ అభిమానులను రంజింపజేశారు. దేవదాయ, ధర్మదాయ శాఖ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం శుక్రవారం రాత్రితో ముగిసింది. అమ్మవారికి వివిధ పద్యాలతో కూడిన అవధానంతో అక్షరయాగాన్ని విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ కొండపైన కొలువున్న దుర్గామల్లేశ్వర్లును తన పద్యాలతో కీర్తించి అందరినీ మెప్పించారు. ఒకవైపు ఆధ్యాత్మిక పదాలను వినిపిస్తూనే ప్రజలకు పలు సామాజిక అంశాలపై స్పృహను పెంపొందించే దిశగా తన అవధానాన్ని కొనసాగించారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన సాహితీవేత్తలు పృచ్ఛకులుగా దత్తపదులు, సమస్యాపురాణం, వర్ణనలు, అశువులు, అప్రస్తుత ప్రసంగం వంటి పేర్లతో అవధానిగా ఉన్న డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మకు పలు అంశాలను సంధిస్తే ఆయన పూరణ చేసి అందరినీ అబ్బురపరిచారు. సుమారు 65 సంవత్సరాల వయస్సులో ఐదు రోజుల పాటు అవదానం కొనసాగించటం చాలా కష్టమని దానిని అద్భుతంగా కొనసాగించారని పలువురు ప్రముఖులు ఆయనను కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయ, వివిధ సంస్థల పక్షాన మాడుగుల నాగఫణిశర్మ దంపతులను సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు పర్యవేక్షించారు.



మాడుగుల నాగఫణిశర్మను సత్కరిస్తున్న జస్టిస్ దుర్గాప్రసాదరావు

అవధాన ప్రక్రియకు స్వర్ణ యుగం

'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం' వంటి కార్యక్రమాల ద్వారా అవధాన ప్రక్రియకు మళ్లీ స్వర్ణయుగం వస్తుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాదరావు అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ అవధానం, పద్యాలు తెలుగు జాతికి అత్యంత ఖ్యాతిని ఆర్జించిపెట్టే గొప్ప ప్రక్రియలన్నారు. వాటిని దేవాలయాలు ఈ అధునాతన కాలంలో సౌందర్యలహరీ మహా శతావధానం వంటి కార్యక్రమాల ద్వారా పరిరక్షించే ప్రయత్నం చేయటం హర్షణీయమని చెప్పారు. ప్రభుత్వం అవధాని ప్రక్రియ పరిరక్షణ, శిక్షణ నిమిత్తం విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన ఆకాంక్షించారు.

సాహితీ సాంస్కృతిక రాజధాని విజయవాడ

విజయవాడ సాహితీ, సాంస్కృతిక రాజధానిగా తన పేరును మరోసారి సార్థకం చేసుకుందని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో తన జన్మ ధన్యం అయిందన్నారు. అలాగే ఆలయ పాలకవర్గాన్ని, అధికారులను అభినందించారు.

చిత్రకారుడు 'బొండా'కు అవార్డులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గిరిజనుల జీవనశైలిపై కాన్వాస్‌పై అనేక చిత్రాలను చిత్రీకరిస్తున్న విజయవాడ భవానీపురానికి చెందిన గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు తాజాగా ప్రతిష్టాత్మక 'స్టార్ క్రియేటివ్ ఆర్టిస్ట్' అవార్డ్ లభించింది. రాజస్తాన్‌కు చెందిన ఇండియా స్టార్ కమ్యునిటీ సంస్థ ఇటీవల నిర్వహించిన టాప్ 50 స్టార్ అచీవర్స్ అవార్డ్–2024 చిత్రళ పోటీలో ఆయనకు ఈ అవార్డ్ దక్కింది. అదే విధంగా ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యకు చెందిన స్వదేశీ సంస్థాన్ భారత్ ఆధ్వర్యంలో అయోధ్య కళా సంస్కృతి మహాకుంభ్ సంస్థ నిర్వహించిన చిత్రకళ పోటీలో 'బొండా'కు 'నవరత్న అచీవర్స్' అవార్డ్, గౌరవ్ సమ్మాన్ అవార్డులు లభించాయి. శుక్రవారం ఆయా అవార్డ్‌లను ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఆయా సంస్థలు దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో తన పెయింటింగ్‌లకు అవార్డ్‌లు లభించటం సంతోషంగా ఉందన్నారు. కాగా జగన్‌మోహన్‌రావుకు ఈ అవార్డ్‌లు లభించడంపట్ల నగరంలోని పలువురు చిత్రకారులు ఆయన్ని అభినందించారు.



స్టార్ క్రియేటివ్ అవార్డ్, ప్రశంసా పత్రంతో బొండా జగన్‌మోహన్‌రావు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పూర్తి సన్నద్ధం

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పూర్తి సన్నద్ధతతో ఉన్నామని కలెక్టర్ ఢిల్లీరావు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారుల నియామకం, జిల్లా కంట్రోల్ రూమ్, ఫిర్యాదుల నివేదిక తదితర అంశాలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఎన్నికల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన నాటి నుంచి నేటి వరకు నమోదైన అన్ని దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 1,781 పోలింగ్ కేంద్రాలతో పాటు విజయవాడ రూరల్ మండలంలోని భాగమైన గన్నవరం నియోజకవర్గంలోని 82 పోలింగ్ కేంద్రాలతో కలిపి మొత్తంగా ఉన్న 1,863 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఫర్నిచర్, లైటింగ్, ర్యాంప్, టాయిలెట్, తాగునీరు, తదితర వసతులను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. వార్తా పత్రికల్లో వచ్చిన ప్రతికూల వార్తల పరిష్కార నివేదికలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామని వివరించారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం శిక్షణ ఇస్తున్నట్లు ఢిల్లీరావు చెప్పారు. నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వాంబేకాలనీలో చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాలనీకి చెందిన మానం వెంకన్న (32)తన ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకన్న వడ్రంగి పనిచేస్తుండగా, ఆయన భార్య మల్లిక రైతుబజార్లో స్వీపర్‌గా పని చేస్తుంటారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. గురువారం రాత్రి భార్య వంటగదిలో నిద్రిస్తుండగా, వెంకన్న బెడ్‌రూమ్‌లో పడుకొని ఉరి వేసుకొన్నాడు. స్థానికుల సహకారంతో భర్తను కిందికి దింపి 108 ద్వారా చికిత్స కోసం తరలిస్తుండగా అప్పటికే మృతి చెందాడు. భార్య మల్లిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ఉంగుటూరు: చెన్నై–కోల్‌కత జాతీయ రహదారిపై చిన్న అవుటపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రాత్రి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌కి చెందిన ఎస్.వెంకటసుబ్బరాజు (80) వైద్య చికిత్స కోసం వారం రోజులు క్రితం పిన్నమనేని ఆసుపత్రిలో చేరాడు. ఈ క్రమంలో ఆస్పత్రి సమీపంలో సుబ్బరాజు రోడ్డు దాటే ప్రయత్నం చేయగా అదే సమయంలో విజయవాడ–ఏలూరు వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సబ్బరాజుకు తీవ్రగాయాలై ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఆత్కూరు ఏఎస్ఐ రామారావు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రేపటి వరకు ఈ–క్రాప్ జాబితా ప్రదర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రబీ సీజన్‌లో విత్తిన(నాటిన) పంటలను ఈ – క్రాప్‌లో నమోదు చేసి బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తయిన ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 3వ తేదీ వరకు ప్రదర్శిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. నాగమణమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి జాబితాలోని పేర్లను రైతులకు చదివి వినిపిస్తామన్నారు. పంట నమోదులో తప్పొప్పులు గమనిస్తే లిఖిత పూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ లోపు పూర్తి చేస్తామన్నారు. ఆమోదం పొందిన తర్వాత రబీ ఈ–క్రాప్ తుది జాబితా ఈ నెల 8న అన్ని ఆర్బీకేల్లో ప్రదర్శిస్తామని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని 31 వార్డుల్లో రెండేళ్లలో రూ.27.27 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ మేళా శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ 41 ఏళ్ల మున్సిపల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపించామని చెప్పారు. ఇచ్చిన హామీలు, చేసిన పనులు, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి వార్డులో డిస్‌ప్లే బోర్డు మీద రాసి పెట్టిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఇలా చేసిన పనులు రాసి చూపించే దమ్ము, ధైర్యం గత టీడీపీ పాలకులకు లేదన్నారు. ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ నాలుగేళ్ల 10 నెలల కాలంలో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. తాము చేస్తున్న అభివృద్ధిని చూసి టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు. ఎవరెన్ని ఆటంకాలు కల్పించినా తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఆపలేరన్నారు. ప్రతి ఇంటికి చేసిన మేలులే తమ విజయానికి కారణం అవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి బద్దూనాయక్, రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ తన్నీరు నాగేంద్ర, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ ఫిరోజ్‌ఖాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి జుబేర్, పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకుమల్లి రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో విప్ ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

ప్రారంభోత్సవాల్లో ముఖ్యమైనవి...

దశాబ్దాలుగా చెరువు కట్టమీద ఆంజనేయస్వామి ఆలయం వద్ద సైకిల్ పట్టేంత ఉన్న ఇరుకు బ్రిడ్జిని తొలగించి రూ.30 లక్షలతో లారీ పట్టేంత విశాలమైన బ్రిడ్జి నిర్మాణం. పాలేటి సమీపంలో మఠం శివాలయం వద్ద శ్మశానానికి వెళ్లే దారిలో చిన్నేటిపై చాలా ఏళ్లుగా ఇరుకుగా ఉన్న బ్రిడ్జిని తొలగించి రూ.25 లక్షలతో విశాలమైన బ్రిడ్జి నిర్మాణం. చిల్లకల్లు–జగ్గయ్యపేటకు మధ్య రూ.కోటితో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్‌కు శిలాఫలకం ఆవిష్కరణ చేపట్టారు. రూ. కోటితో టీటీడీ కల్యాణ మండపం వద్ద డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులో రూ.2.50 లక్షలతో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో రూ.కోటితో చేపట్టిన డైనింగ్ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఉదయభాను శంకుస్థాపన చేశారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్యే ప్రభుత్వ లక్ష్యం



విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్ అందజేస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు


- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- జగనన్న విద్యా దీవెన పథకం నిధులు విడుదల
- ఎన్టీఆర్ జిల్లాలో 33,602 మందికి రూ.31.72 కోట్ల లబ్ధి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించాలని కోరారు. 2023, అక్టోబర్–నవంబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లాలోని పామర్రులో శుక్రవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జగనన్న విద్యా దీవెన జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్ వీసీ హాలులో కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, నగర్ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లతో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన చెక్కు అందజేశారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో నాడు–నేడు పథకాన్ని అమలు చేయడం ద్వారా పాఠశాలల రూపురేఖలనే మార్చివేశారని తెలిపారు. అత్యాధునిక మౌలిక వసతులను ఏర్పాటు చేసి ప్రాథమిక విద్య నుంచే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మెరుగు పరచడం ద్వారా విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యా రంగంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు. జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను అమలు చేయడం ద్వారా ప్రతి పేద విద్యార్థీ ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నారని వెల్లడించారు. ఐటీఐ, డిప్లమా, డిగ్రీ ఆపై ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు విద్యా దీవెన పథకం సువర్ణ అవకాశం లాంటిందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో చదువే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, బీఈడీ, అగ్రికల్చర్, మెడికల్, నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న 37,178 మంది విద్యార్థులకు రూ. 31.72 కోట్లను 33,602 మంది తల్లుల ఖాతాలలో ముఖ్యమంత్రి జమ చేశారన్నారు. తల్లుల ఖాతాలలో జమ అయిన సొమ్మును వెంటనే కళాశాలలకు చెల్లించాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, భట్రాజ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ కూరపాటి గీతాంజలి, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కోఠారి, సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ బీవీ విజయభారతి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, డ్వామా పీడీ జె.సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు కీలుబొమ్మలా పవన్ కళ్యాణ్

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): డైలాగ్స్ ఫుల్.. జనం నిల్ అన్న తీరున టీడీపీ –జనసేన సభలు ఉన్నాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. విజయవాడ సమీపంలోని కండ్రికలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం సభలో పవన్ మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాలకు ఎన్నికల భయం పట్టుకుందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక తెగ తర్జనభర్జన పడుతున్నారని చెప్పారు. టీడీపీ, జనసేన నేతల భయం వారి మాటల్లో స్పష్టంగా తెలుస్తుందని పేర్కొన్నారు. అందుకే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. చివరకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చంద్రబాబు చేతిలో ఓ కీలుబొమ్మగా మారిపోయారని ధ్వజమెత్తారు. టీడీపీ నుంచి 24 సీట్లు తెచ్చుకోవడమే పెద్ద విజయంగా పవన్ భావిస్తున్నారని, ఈ మాత్రానికే వంగి వంగి నమస్కారాలు చేస్తూ, బాబుకు దాసోహం అంటున్నారని ఎద్దేవా చేశారు. వంగవీటి మోహన రంగాను హత్య చేయించిన పార్టీతో కలిసినప్పుడే కాపులు పవన్‌కు దూరమయ్యారని తెలిపారు. పవన్ తీరు పట్ల జనసైనికులే తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబుకు అమ్ముడుపోయి, జనసైనికుల ఆత్మగౌరవాన్ని బాబు పాదాల దగ్గర పవన్ తాకట్టుపెట్టారని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రిని టార్గెట్ చేస్తూ, పవన్ కళ్యాణ్ వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదన్నారు. తాడేపల్లిగూడెం సభలో మాట్లాడిన మాటలను జనసేన అధ్యక్షుడు తక్షణమే వెనక్కి తీసుకోవాలని విష్ణు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మల్లాది విష్ణు

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 10న బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ మహిళాదినోత్సవం సందర్భంగా వారిలో ఉండే టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని చెప్పారు. మహిళా సమానత్వం సాధించిన నాడే దేశం అభివృద్ధిలో పురోగమిస్తుందని తెలిపారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం మహిళా విభాగాల ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్ జరుగుతోందని నిర్వాహకులు ఎ. సంధ్యారాణి, కె. స్వరూపరాణి, జి. జ్యోత్స్న తెలిపారు. బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ క్రాఫ్ట్ డెమో కార్యక్రమాన్ని స్వాతి పూర్ణిమ, పేపర్ క్విల్లింగ్ కార్యక్రమాన్ని మేడా రజని ప్రారంభిస్తారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథుల ప్రసంగాలు, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

క్లుప్తంగా

7న సిద్ధార్థలో బ్లిట్జ్‌క్రీగ్-2024

పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 7 వ తేదీన బ్లిట్జ్‌క్రీగ్-2024 పేరుతో సిద్ధార్థ ఆడిటోరియంలో సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు చెప్పారు. బ్లిట్జ్‌క్రీగ్-2024 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో శుక్రవారం జరిగింది. బాబూరావు మాట్లాడుతూ తమ కళాశాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 2006వ సంవత్సరం నుంచి బ్లిట్జ్‌క్రీగ్ పేరుతో విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నిర్వహణ, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్ మాట్లాడుతూ పోస్టర్ ప్రెజంటేషన్, కంప్యూటర్ క్విజ్, కోడింగ్ అండ్ డీకోడింగ్, డేటా థాన్, స్పాట్ ఫొటోగ్రఫీ, నిధి అన్వేషణ, మిస్టర్ అండ్ మిస్ బ్లిట్జ్‌క్రీగ్, షార్ట్ ఫిల్మ్ వంటి అంశాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. బ్లిట్జ్‌క్రీగ్ సమన్వయకర్త కోనేరు సుధీర్‌తో పాటుగా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆపాత మధురాలు సంగీత కార్యక్రమం సినీ క్లాసికల్ విశిష్టతను చాటింది. కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం లాంటి సంగీత కళాకారులు అరుదుగా కనిపిస్తారన్నారు. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు ఘంటసాల మాస్టారని, బాలసుబ్రహ్మణ్యం వివిధ భారతీయ భాషలలో 50 వేలకు పైగా పాటలు పాడారని గుర్తుచేశారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పలు క్లాసికల్ చిత్ర గీతాలను ఆలపించారు.

వణుకూరులో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

పెనమలూరు: వణుకూరు గ్రామంలో నలందా డిగ్రీ కాలేజీ ఆధ్వర్యాన వారం రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నామని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో శుక్రవారం ఆయన శిబిరం ప్రారంభించి ప్రసంగించారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రధానంగా విద్య ఆవశ్యకత, పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ ఇలా అనేక కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చక్క గోపీకృష్ణ, నాగరాజు, దుర్గారావు, భాను, కిషోర్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురామ్, 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడు అరెస్టు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మద్యం మత్తులో బంధువులపై కోడికత్తితో దాడిచేసిన నిందితుడు ప్రేమ్‌కుమార్‌ను శుక్రవారం గుణదల పోలీసులు అరెస్టు చేశారు. వివరాలలోకి వెళితే గుణదల మురళీనగర్‌కు చెందిన మారంపూడి రాజేష్‌తో పాటు అతని చిన్న కుమారుడు అఖిలేష్, తమ్ముడు ప్రశాంత్‌లను వరసకు సోదరుడు అయిన ప్రేమ్‌కుమార్ బుధవారం రాత్రి కోడికత్తితో దాడి చేశాడు. బాధితుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గుణదల పోలీసులు విచారణ ప్రారంభించారు. శుక్రవారం నిందితుడు ప్రేమ్‌కుమార్‌ను గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేస్తూ రాష్ట్రంలో సుపరిపాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం రాణిగారితోట, 18వ డివిజన్‌లోని కోరె నామయ్య వీధిలో ఆయన గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొద్దు పొడవక ముందే వెలుగు రేఖలు

- ప్రతినెలా మొదటి తేదీనే తలుపు తట్టి అందిస్తున్న వలంటీర్లు
- తూర్పులో 21,536 మంది పింఛన్ దారులు
- ప్రతినెలా రూ.6.46 కోట్లు పంపిణీ చేస్తున్న వైనం
- నాలుగేళ్ల తొమ్మిది నెలల్లో రూ.382 కోట్లు అందజేత
- అవ్వా తాతల ముఖాల్లో వెల్లివిరుస్తున్న ఆనందం



ఇంటికే వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వు చూడాలనేది ప్రభుత్వ ఆకాంక్ష. వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందులో భాగంగా రాష్ట్రంలో ప్రతినెలా మొదటి తేదీన పొద్దు పొడవక ముందే అవ్వాతాతలు పింఛన్లు అందుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైన్యం(వలంటీర్లు) అవ్వాతాతల తలుపు తట్టి మరీ పింఛన్ అందజేస్తున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నా, ఏదైనా కారణంతో ఇతర ప్రాంతాల్లో ఉండి రాలేని స్థితిలో ఉన్నా వలంటీర్లు వారున్న చోటికే వెళ్లి మరీ పింఛన్‌లు ఇస్తున్నారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీలో వలంటీర్లు అందిస్తున్న సేవలకు ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

తూర్పులో రూ.382 కోట్లు అందజేత

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఉన్న మొత్తం 21,536 మంది ఫించన్‌దారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ రూ.382 కోట్లను వలంటీర్లు అందజేశారు.

నియోజకవర్గంలో డివిజన్లు	21
నియోజకవర్గంలో సచివాలయాలు	100
నియోజకవర్గంలో పింఛనుదారులు	21,536
నియోజకవర్గంలో వలంటీర్లు	1190
ఈ నాలుగున్నరేళ్లలో లబ్ధిదారులకు అందజేసిన మొత్తం	రూ. 382 కోట్లు

తాజాగా ప్రతినెలా రూ.3 వేలు చొప్పున నెలకు రూ.6.46 లక్షలు అందిస్తున్నారు. మార్చి మొదటి తేదీనే 90 శాతంకు పైగా ఫించన్‌లు అందజేశారు.

గతం ఓ నరకం...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛను తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియక పడిగాపులు పడాల్సి వచ్చేది. బారులు తీరి గంటల కొలదీ క్యూలో నిల్చున్న రోజులను నేటికీ వృద్ధులు మరిచిపోలేదు. అనంతరం డివిజన్ మొత్తానికి ఒకచోట పంపిణీ చేయగా, అక్కడ రోజంతా వేచి ఉంటే కానీ పింఛన్ అందేది కాదు. కొందరు అక్కడే సొమ్మసిల్లి పడిపోయేవారు.

మంజూరులో పారదర్శకత

గతంలో కొత్త ఫించన్ ఇవ్వాలంటే, ఎవరైనా ఫించన్ దారుడు మరణిస్తే ఆ స్థానంలో కొత్తవారికి ఇచ్చేవారు. అది కూడా జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్ల చుట్టూ తిరిగితేనే దక్కేది. అంతేకాదు వారికి ఎంతో కొంత ముడుపులు ఇచ్చుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు పింఛన్ కోసం ఏ నాయకుడి ఇంటికి వెళ్లాల్సిన పనిలేదు. అర్హత ఉంటే చాలు వలంటీరు మీ ఇంటికి వచ్చి మరీ పింఛను మంజూరు చేస్తారు. ఎలాంటి అవినీతి, అక్రమాలు, సిఫార్సులకు తావు లేకుండా పారదర్శకంగా పింఛన్ల మంజూరు, పంపిణీ జరుగుతుంది.

ఇంటికే వచ్చి ఇస్తున్నారు



గత ప్రభుత్వంలో అధికారులు, నాయకుల చుట్టూ తిరిగిన ఫించన్ మంజూరు కాలేదు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ ఇంటికి వచ్చి ఫించన్ రాసుకుని శాంక్షన్ చేశారు. అంతేకాదు ప్రతి నెలా మొదటి తేదీనే వలంటీర్ ఇంటికొచ్చి ఇస్తున్నారు. ఒక్కోసారి మేము నిద్రలేవక ముందే ఇంటికి వస్తున్నారు. ఇప్పుడు ప్రతినెలా రూ.3 వేలు వస్తుంది.

–రత్నం అనసూయ, కరెన్సీనగర్

ఇబ్బందులు తప్పాయి



గతంలో ఫించన్ తీసుకుందుకు పోస్టాఫీసుకు కొన్ని రోజులు వెళ్లాం. తర్వాత ఒక చోటకు వచ్చి ఇచ్చేవారు. ఎప్పుడు వస్తారో తెలిసేది కాదు. వాళ్లు వచ్చి ఇచ్చే వరకూ వేచి చూడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. ప్రతి నెలా మొదటి తేదీనే ఇంటికే వచ్చి ఇస్తున్నారు. మాలాంటి వారికి కష్టాలు తప్పాయి.

–పఠాన్ నసీర్ బి, అయ్యప్పనగర్

సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా



ఆస్పత్రిలో ఉన్న సుబ్బారావు వద్దకు వెళ్లి పింఛన్ కోసం వేలి ముద్రను సేకరిస్తున్న వలంటీర్ శోభ

ఆటోనగర్(విజయవాడతూర్పు): ''సమయానికి పింఛన్ వచ్చింది. వలంటీర్‌లు ఆసుపత్రికి వచ్చి పింఛన్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఈ డబ్బులు చూస్తుంటే నాలో ఉన్న అనారోగ్యం తగ్గినట్టు ఉంది.'' అని 16వ డివిజన్‌కు చెందిన పింఛన్ లబ్ధిదారుడు ఎం.సుబ్బారావు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం డొంకరోడ్డులోని ప్రయివేట్ ఆసుపత్రిలో గత కొద్దిరోజుల నుంచి కిడ్నీవ్యాధితో సుబ్బారావు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వలంటీర్ శోభ సుబ్బారావు వద్దకు వెళ్లి రూ.3 వేలు పింఛన్ అందజేసింది. సుబ్బారావుకు వైద్యులు గత రెండు రోజుల నుంచి డయాలసిస్ చేస్తున్నారు. వలంటీర్ శోభ ఆస్పత్రికి వెళ్లి రూ.3వేలు పింఛన్ డబ్బులు చేతుల్లో పెట్టడంతో సుబ్బారావు ఆనందానికి అవధులు లేవు. ముఖ్యమంత్రి జగన్ పది కాలాల పాటు చల్లంగా ఉండాలని దీవించారు. ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్న సీఎం జగన్ మేలు మరిచిపోలేనిదని సుబ్బారావు బంధువులు అన్నారు. జగన్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను గెలిపించాలి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమపాళ్లలో జరగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక 22వ డివిజన్‌లోని స్వర్ణపురి వీధులు, మలేరియా హాస్పిటల్ సెంటర్, మసీద్ రోడ్డు, ఆయిల్‌కొట్టు రోడ్డు ప్రాంతాలలో శుక్రవారం గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ఎనిమిది నెలల జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి 2024 ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్ర చేసిన జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడి గుండె చప్పుడు తెలుసుకుని నవరత్నాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. అవినీతి రహితంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించామని చెప్పుకునే ధైర్యం గత టీడీపీ ప్రభుత్వానికి ఉందా అన్ని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. జనసేన పార్టీ ఎందుకు స్థాపించారో పవన్ ఇప్పటికైనా చెప్పాలని, రాజకీయ భవిష్యత్ కోల్పోతున్నామని జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు జోగారాజు, పులి రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్, ఫజలుద్దీన్, జావీద్ పాల్గొన్నారు.

సెలూన్ నిర్వహణ, సంగీత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్లు పుల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య, చిత్రంలో భీమశంకరరావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేటి తరానికి అనుగుణంగా ఆధునిక సెలూన్ నిర్వహణ నిమిత్తం తిరుపతిలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని ఏపీ నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తొండమల్లు పుల్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాష్ట్రంలోని తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో నాయీబ్రాహ్మణ యువత కోసం సంగీత శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో శుక్రవారం కార్పొరేషన్ బోర్డు మీటింగ్ జరిగింది. ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ భీమశంకరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అజెండాలోని పలు అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ తొండమల్లు పుల్లయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు చేసిన తీర్మానాలపై సమీక్షించామని తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, నాయీబ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ కర్పూరి ఠాకూర్‌కు ఇటీవల భారతరత్న పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో ఆయన జయంతి లేదా వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని, ఆయన విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలన్న అంశంపై చర్చించారు. నాయీబ్రాహ్మణ సామాజిక వర్గం అవసరాల కోసం తిరుపతిలో స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించానని పుల్లయ్య పేర్కొన్నారు.

రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయం



రమాశంకర్, జిలానీఖాన్ సంస్మరణ సభలో పాల్గొన్న కళా సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: సినీ నిర్మాత, దర్శకుడు ఒమ్మి రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయమని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్మాత దర్శకుడు ఒమ్మి రమాశంకర్, కళాపోషకుడు జిలానీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ రమాశంకర్ దర్శకునిగా యువ నటులు కొందరిని తెలుగు తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. విశ్రాంత ఐటీసీ అధికారి వీరభద్రరావు మాట్లాడుతూ రమాశంకర్ నగరానికి వచ్చిన అనతికాలంలోనే గాయనీ గాయకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ తన మురగా చారిటబుల్ సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం చేశారని, నిర్మాత, దర్శకత్వం వహించిన అరణ్య సినిమాలో నూతన నటులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సంస్మరణ సభలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మారేపల్లి జోషి, కారుమంచి రాజు, శ్యాంప్రసాద్, దామోదర గణపతిరావు, సింగంపల్లి రమణ, కొప్పుల ఆనంద్ తదితరులు రమాశంకర్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు కళాకారులు, వివిధ సంస్థల ప్రతినిధులు రమాశంకర్ చిత్రపటానికి నివాళి సమర్పించారు.

రేపు విజయవాడ వాకర్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



సిల్వర్‌జూబ్లీ వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 3న ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి ప్రభాకరరావు తెలిపారు. మహాత్మాగాంధీరోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం అసోసియేషన్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభాకరరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటివరకూ 20 మంది అధ్యక్షులుగా, జిల్లా 202 గవర్నర్లుగా, కార్యదర్శులుగా పనిచేశారని, వారందరినీ సత్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం తొండెపు హనుమంతరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాకర్స్‌కి మంచినీరు, వేసవిలో మజ్జిగ పంపిణీ, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ వంటివి అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ఉయ్యూరు సాంబిరెడ్డి, వనమా విశ్వేశ్వరావు, మద్దినేని చంద్రశేఖర్, ఆలమూరి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనే విజయానికి సోపానం



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: నిరంతర సాధనే విజయానికి సోపానమని రాగలహరి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు బి.మీరాకుమార్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద మృదుమధుర సంగీతం -సినీ సంగీత వైభవం పేరుతో మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మీరాకుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకులు పంచ సూత్రాలను పాటించాలని, చిత్తశుద్ధి, ఏకాగ్రత, లక్ష్యం, సాధన, సంగీత సాహిత్యాల పట్ల మమకారం ఉండాలన్నారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో పరుచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, కొప్పరపు బలరామకృష్ణమూర్తి సంస్థ చేస్తున్న సంగీత సేవలను వివరించారు. గాయని మల్లాది స్వాతి ఆధ్వర్యంలో అయ్యప్పన్, వడ్డాది సూర్య కామేశ్వరి, నాయక్, షబానా, రూపశ్రీ, తెలుగు, హిందీ, భక్తి గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను అతిథులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

రెడ్డి సామాజిక వర్గం జగన్‌కు అండగా నిలవాలి

ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని రెడ్డి సామాజిక వర్గం మొత్తం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భవానీపురంలో రెడ్డి సామాజిక వర్గ ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మరలా వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ అవిశ్రాంతంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఓసీ యూత్ ప్రెసిడెంట్ గోవిందరెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలంటే ప్రేమ ఇదేనా 'బొండా'!





టీడీపీకి, బొండా ఉమాకు వ్యతిరేకంగా సమావేశమైన ముస్లిం మైనార్టీ నాయకులు ; ముస్లిం మైనార్టీలను పిలవకుండా వేదికపై మాట్లాడుతున్న బొండా ఉమా

- టీడీపీ సమావేశంలో ముస్లిం మైనార్టీలకు ఘోర అవమానం
- సమావేశ వేదికపైకి ముస్లిం మైనార్టీలను పిలవని వైనం
- బయటకు వచ్చి వేరుగా సమావేశమైన ముస్లిం మైనార్టీ నాయకులు
- అక్కడ కేవలం ఒక వర్గానికి, జనసేన వారికి మాత్రమే ప్రాధాన్యం
- తమను అవమానించిన వారికి గుణపాఠం చెబుతామని ముస్లిం మైనార్టీ నేతల హెచ్చరిక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): టీడీపీలో ముస్లిం మైనార్టీలకు ఘోర అవమానం జరిగింది. ఆ పార్టీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సింగ్‌నగర్ పైపులరోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో వేదిక పైకి నియోజకవర్గంలోని ప్రధాన నాయకులందరినీ పిలిచి కూర్చోబెట్టుకున్నప్పటికీ ముస్లిం మైనార్టీ నాయకులను మాత్రం వేదికపైకి ఆహ్వానించలేదు. దీంతో తీవ్ర అసహనానికి గురైన ముస్లిం నాయకులంతా కార్యక్రమం జరుగుతుండగానే అక్కడి నుంచి బయటకు వచ్చేసి సింగ్‌నగర్‌లో వేరుగా సమావేశమయ్యారు. దీంతో ముస్లిం మైనార్టీలపై నీకున్న ప్రేమ ఇదేనా బొండా ఉమా అంటూ ప్రశ్నిస్తున్నారు.

కార్పొరేటర్ స్థాయి లేని వారిని కూడా...

టీడీపీ సమావేశంలో కనీసం కార్పొరేటర్ స్థాయి లేని వ్యక్తులను కూడా పిలిచి వేదిక పైన కూర్చోబెట్టుకున్నారని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముస్లిం మైనార్టీలను మాత్రం వేదికపైకి పిలవకపోవడం చాలా బాధగా ఉందని టీడీపీలోని ముస్లిం మైనార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు. ఆది నుంచి ముస్లిం మైనార్టీలంటే టీడీపీ పెద్దలు చులకనగా చూస్తున్నారని, ఎన్ని అవమానాలు ఎదురైనా వాటిని భరించి ముందుకు వెళ్తుంటే ఈరోజు ఇతర వర్గాల వారి ముందు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ముందు తమను ఘోరంగా అవమానించారంటూ అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది కావాలనే ముస్లిం మైనార్టీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, ఇన్ని జరుగుతున్నా అధిష్టానం పట్టీపట్టనట్లు చూస్తుందే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ముస్లిం మైనార్టీల పవర్ అంటే ఏంటో వారికి కచ్చితంగా అర్థమయ్యేలా చూపిస్తామని హెచ్చరిస్తున్నారు.

ఖర్చు పెట్టుకున్నవారికి.. కష్టపడిన వారికి విలువలేదా?

గత ఐదేళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడుతూ, పార్టీ కార్యక్రమాలకు తమ సొంత డబ్బులను వేసుకుని చేస్తున్న నాయకులను కాదని బొండా ఉమా ఇప్పుడు కొత్తగా వచ్చిన వారికి విలువ ఇవ్వడం బాధాకరంగా ఉందని ముస్లిం మైనార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా పోటీచేయని వారిని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కనీసం ముందుకు రాని వారినందరినీ వేదికపైకి ఎక్కించి పూల దండలు, శాలువాలు కప్పుతుంటే మాలాంటి నిజాయితీ గల ముస్లిం నాయకులు వేదిక కింద కూర్చోవాలా అంటూ కలత చెందారు. నిన్న కాక మొన్న వచ్చిన జనసేన నాయకులకు ఇచ్చిన విలువ కూడా పార్టీలో తమకు ఇవ్వడం లేదని, ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న టీడీపీకి, బొండా ఉమాకు పనిచేసేది లేదంటూ కొంతమంది మైనార్టీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. ముస్లిం నాయకులమంతా సమావేశం నిర్వహించుకుని తమ భవిష్యత్తు ఉపయోగపడే నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు.

కానూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

పెనమలూరు: కానూరు తులసీనగర్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న వైద్యురాలు మంజుల మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గ్రామాలలోని ప్రజలు ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాదాపు 100 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

8న శివపార్వతుల కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 8వ తేదీ మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వతేదీ శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారు జాము నుంచే నీలకంఠేశ్వరస్వామివారికి విశేషంగా పూజలు, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. లింగోద్భవ కాలంలో రాత్రి 9 గంటల నుంచి గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ శివ పార్వతుల కల్యాణ ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారన్నారు.

లైఫ్@360

హెల్త్ టిప్స్



గుడ్డులోని తెల్లసొనను తినడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించుకోవచ్చు. దీన్ని తినడం వల్ల అన్ని రకాల గుండె సమస్యలను దూరం చేస్తుంది. ఈ క్రమంలో మీరు రోజూ తినే ఆహారంలో గుడ్డును చేర్చుకోవచ్చు.



బాదం నూనెలో నిమ్మరసం కలిపి రాసుకుంటే చుండ్రు పోతుంది. ఒక గిన్నెలో కొద్దిగా బాదం నూనెను తీసుకొని.. అందులో కొద్దిగా నిమ్మ రసాన్ని మిక్స్ చేసి.. ఆ తర్వాత జుట్టుకు అప్లై చేయాలి. అలా కొద్దిసేపు చేతులతో తలపై మసాజ్ చేయాలి. మసాజ్ చేసిన తర్వాత అవసరమైతే.. గంట తర్వాత లేదా మరుసటి రోజు షాంపూతో మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.



నిద్ర లేచిన తర్వాత మీకు మెడ నొప్పిగా అనిపిస్తే.. నొప్పి ప్రభావిత ప్రాంతాల్లో ఐస్ ప్యాక్ లేదే చల్లని నీటిలో నింపిన క్లాత్ ను వేసి అద్దాలి. అలా చేయడం వల్ల మెడ కండరాల వాపు తగ్గుతుంది. దీంతో పాటు హీట్ ప్యాక్ ను ఉపయోగించవచ్చు. ఇది కూడా మెడ కండరాల నొప్పిని తగ్గిస్తుంది.

మెడ నొప్పిగా ఉన్న వాళ్లు చేతులతో మెడను నెమ్మదిగా మసాజ్ చేయాలి. అలా చేయడం వల్ల కండరాలు సర్దుకొని నొప్పి తగ్గే అవకాశం ఉంది. మసాజ్ చేసే సమయంలో కొబ్బరి లేదా నువ్వుల నూనె ఉపయోగిస్తే మేలు జరుగుతోంది. మెడ నొప్పిని నివారించేందుకు మీరు రాత్రిళ్లు బోర్లా పడుకోకుండా ఉంటే చాలు.

మంచి అలవాట్లు మెరుగైన ఆరోగ్యం



మంచి అలవాట్లు మన జీవితాలను మెరుగుపరుస్తాయి అని స్టీఫెన్ కోవీ తన '7 హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్'లో చెప్పాడు. అదే సూత్రం ఆరోగ్యానికి కూడా వర్తిస్తుంది. ఆరోగ్యకరమైన అలవాట్లు జీవనశైలి మన ఆరోగ్యాన్ని, శక్తి స్థాయిలని, పని చేసే సామర్థ్యాన్ని మెరుగుపరచడంతోపాటు జీవన శైలి వ్యాధులను నివారించడంలో కూడా తోడ్పడతాయి. ఇంతకీ ఆ అలవాట్లేమిటో తెలుసుకుందామా... ఎవరికైనా సరే, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే కొన్ని అలవాట్లు...

రోజును ముందుగానే ప్రారంభించటం...

తొందరగా నిద్ర లేవాలి, తొందరగా నిద్రపోవాలి అనే సూత్రాన్ని చాలామంది పాటిస్తుంటారు. అయితే ఈ సూత్రాన్ని పని చేసే రోజుల్లోనే అంటే వర్కింగ్ డేస్‌లో మాత్రమే పాటిస్తూ, సెలవ రోజుల్లో పక్కన పెట్టేస్తారు. అలా కాకుండా వారాంతాల్లోనూ, సెలవు రోజుల్లో కూడా సాధ్యమైనంత వరకు త్వరగా నిద్రలేచి త్వరగా మన దినచర్యను ప్రారంభించే అలవాటు స్వీయ క్రమశిక్షణకు చిహ్నం. అంతేకాదు, తొందరగా నిద్రలేవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతారని అనేక పరిశోధనల్లో రుజువైంది కూడా.

శుద్ధి చేసిన చక్కెరకు నో చెప్పండి

చక్కెరలో ఎటువంటి పోషకాలు లేవు. ఎందుకంటే ఇది ప్రాసెసింగ్ ద్వారా వెళుతుంది. ప్రాసెస్ చేసిన చక్కెరను అధికంగా తీసుకోవడం వల్ల మీ శరీరంలోని ముఖ్యమైన పోషకాలు క్షీణించడం ప్రారంభిస్తాయి. బదులుగా మినరల్ షుగర్, పామ్ షుగర్, బెల్లం లేదా తేనెకు మారడం మంచిది.

సముద్రపు ఉప్పుకు మారండి

చిప్స్, బర్గర్‌ల నుండి వేపుళ్ల వరకు ప్రతిదీ ఉప్పుతో నిండి ఉంటుంది. వాటిని చాలా రుచికరమైనదిగా చేస్తుంది. మీ ఆహారంలో ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, డీహైడ్రేషన్, హైపర్‌టెన్షన్, కడుపు క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల అయోడైజ్డ్ సాల్ట్‌కు బదులు సముద్రపు ఉప్పు, రాక్ సాల్ట్ లేదా హిమాలయన్ పింక్ సాల్ట్‌కి మారండి, ఇవి ఆరోగ్యకరమైనవి.

ఆరోగ్యకరమైన అల్పాహారం

అల్పాహారం తీసుకోవడం అనేది రోజులో అత్యంత ముఖ్యమైన విషయం.. మీకు ఉదయం సమయం లేకపోతే, ఏవైనా పండ్లు లేదా కొన్ని గింజలను అయినా తీసుకోవచ్చు. ఆ తర్వాత పనిలో తినగలిగే అల్పాహారాన్ని ప్యాక్ చేసుకుని తీసుకెళ్లి తినాలి. అంతేకానీ, మొత్తంగా బ్రేక్ ఫాస్ట్‌ను బ్రేక్ చేయద్దు.

కనీస వ్యాయామం

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయలేరు. కానీ ఫిట్‌గా ఉండటానికి ట్రిక్ యాక్టివ్‌గా ఉండటమే. ఫిట్‌గా ఉండేందుకు రోజుకు పదివేల అడుగులు వేయడం సరైనదని పరిశోధనలు చెబుతున్నాయి. మన కదలికలు తగినంతగా లేకపోతే, మనలో చురుకుదనం లోపిస్తుంది. కొవ్వు పేరుకునిపోతుంది. అందువల్ల భోజనం చేసిన తర్వాత కొద్దిసేపు నడిచేందుకు ప్రయత్నించండి. అదేవిధంగా తక్కువ దూరాలను చేరుకునేందుకు వాహనాలను ఉపయోగించడానికి బదులు నడిచి వెళ్లే అలవాటు చేసుకోవడం మంచిది.

మంచి నిద్ర

శరీర సాధారణ పనితీరును, నాడీ వ్యవస్థను పునరుద్ధరించడానికి సహాయపడేవాటిలో నిద్ర కీలకమైనది.. నిద్ర లేకపోవడం వల్ల జీవనశైలిని నేరుగా ప్రభావితం చేసే మగత, అలసట, ఏకాగ్రత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నిద్ర లేమి మెదడుపై నియంత్రణను కోల్పోయేలా చేస్తుంది. అందువల్ల రోజూ కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర పోవడం అవసరం. ఒక వేళ మీకు నిద్ర పట్టని సమస్య ఉంటే, ఏదైనా పుస్తకాన్ని చదవడం, చక్కటి సంగీతాన్ని వినడం, ధ్యానం చేయడం ద్వారా నిద్రపోయేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ ఫలితం లేకపోతే వైద్య సహాయం తీసుకోవాలి.

నవ్వుతూ ఉండటం

మిమ్మల్ని మీరు పాజిటివ్ వైబ్స్‌తో నింపుకోవడానికి ఇదే సులభమైన పద్ధతి. నవ్వు లేని జీవితం శూన్యం. నవ్వు ఎండార్ఫిన్‌ల విడుదలను ప్రేరేపిస్తుంది. ఇది మానసిక స్థితిని పెంచుతుంది. ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గిస్తుంది. అందుకే నవ్వండి, ఆరోగ్యంగా ఉండండి!

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం

రోజువారీ ఆహారంలో వివిధ రకాలైన పండ్లు, ఆకు కూరలు, మొలకలు, పప్పులు, మాంసం, పౌల్ట్రీ ఫుడ్, సీ ఫుడ్ ఉండాలి. మీ ఆహారంలో ప్రోటీన్లు, ఫైబర్లు, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగానూ, కార్బోహైడ్రేట్లు, క్యాలరీలు తక్కువగానూ ఉండేలా చూసుకోవాలి.అలాగే, మీరు మీ ఆహారాన్ని ఎలా తింటారు లేదా నమలాలి అనేది కూడా ముఖ్యమైన భాగం. ఆహారం జీర్ణం కావాలంటే 20-30 సార్లు నమలాలి.

బాగా నీరు తాగడం

మన శరీరంలోని ప్రతి కణం, కణజాలం, ప్రతి అవయవానికి అవసరమైన మొత్తంలో నీరు తాగటం అవసరం. ఇతర పానీయాల కంటే తాగునీరు ఎల్లప్పుడూ మంచి ఎంపిక. హైడ్రేటెడ్ గా ఉండటానికి మీతో ఒక చిన్న వాటర్ బాటిల్ ఉంచుకోవడం అవసరం. ప్రతి అరగంటకు ఒకసారి కొన్ని గుక్కల నీరు తాగడం మంచిది.

టీ/కాఫీ తీసుకోవడం తగ్గించండి

పనిలో అనేక కప్పుల ప్రాసెస్ చేయబడిన కెఫిన్ తీసుకోవడం అనారోగ్యకరమైన అలవాట్లలో ఒకటి. మిల్క్ పౌడర్, పంచదార, పైగా ఉడికించిన టీ, రెడీ మిక్స్ కాఫీ, అన్నీ క్యాలరీలతో నిండి ఉన్నాయి. అందువల్ల పూర్తిగా మానేయనక్కరలేదు కానీ పరిమితంగా తీసుకోవడం మంచిది.

పరిశుభ్రత పాటించడం

నోటిని శుభ్రంగా ఉంచుకోవడం, క్రమం తప్పకుండా స్నానం చేయడం, ఇంటిని, వంటిని, పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి చిన్న అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మీ సామాజిక జీవితాన్ని కూడా మెరుగుపరుస్తాయి.

బార్లీతో బోలెడన్ని సమస్యలు దూరం

వేసవి వచ్చేసింది... వేడితో అనేక సమస్యలు ఎదురవుతాయి. అన్నం తినాలనిపించదు, తినకపోతే ఆకలి. డీహైడ్రేషన్ సమస్యలు తప్పవు. అయితే వేసవిలో ముడిపడి ఉండే ఇటువంటి సమస్యలకు బార్లీనీళ్లతో చెక్ పెట్టొచ్చు. కేవలం వేసవి సమస్యలకే కాదు... అనేక ఆరోగ్య సమస్యలకు బార్లీ బాగా పని చేస్తుంది. అదెలాగో చూద్దాం...

పూర్వం ఎవరికైనా జ్వరం వచ్చిందంటే నీరసం నుంచి కోలుకోవడానికి బార్లీ నీళ్లు, సగ్గుజావ తాగించేవాళ్లు పెద్దలు. ఇప్పుడు కూడా బార్లీ కనిపిస్తోంది కానీ, అక్కడక్కడా... అప్పుడప్పుడూ మాత్రమే. కేవలం జ్వరంలోనే కాదు, వేసవిలో బార్లీ వాడకం చాలా మంచిది. అదెలాగో చూద్దాం...



- వేసవిలో తిన్నది అరగక పోవడం సాధారణ సమస్య. అలాంటప్పుడు బార్లీ నీళ్లు తాగితే చాలా మంచిది. జీర్ణాశయం కూడా చాలా శుభ్రపడుతుంది. అజీర్తి దూరమవుతుంది
- పిల్లలకు బార్లీ నీళ్లు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. మలబద్ధకం వంటి సమస్యలు దరి చేరవు. ఎండల ప్రభావం పడకుండా ఉండాలన్నా, వడదెబ్బ తగలకుండా ఉండాలన్న ఈ నీళ్లు తాగాల్సిందే
- మధుమేహులకు కూడా బార్లీ చాలా మేలు చేస్తుంది. రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఇన్సులిన్ కూడా అదుపులోనే ఉంటుంది
- ఇక గర్భిణులు రోజూ బార్లీనీళ్లు తాగితే మరీ మంచిది. కాళ్ల వాపు సమస్య వారి దరిచేరదు. రోజులో ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలసట కూడా త్వరగా రాదు
- బరువు తగ్గాలనుకునే వారికి కూడా బార్లీ నీళ్లు బాగా ఉపయోగపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తాయి. దీని ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దూరంగా ఉంటాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి
- మహిళలను తరచూ బాధించే ప్రధాన సమస్య మూత్రనాళ ఇన్ఫెక్షన్. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ఉదయాన రోజూ గ్లాసుడు బార్లీ నీళ్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. మూత్రంలో ఇన్ఫెక్షన్లు కలిగే కారకాలు, వ్యర్థాలు బయటికి పోతాయి. సూక్ష్మమైన రాళ్లు కూడా కరిగిపోతాయి.

సినిమా

ధ్రువ్‌కు జోడీగా..?



• అనుపమా పరమేశ్వరన్

తమిళ స్టార్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ధ్రువ్ విక్రమ్ హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కనుంది. కబడ్డీ ప్లేయర్ మానతీ గణేశన్ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు అనుపమా పరమేశ్వరన్‌ను తీసుకున్నారట. అనుపమాకి ఇటీవల మారి సెల్వరాజ్ ఈ కథను వినిపించగా, ఈ బ్యూటీ ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ టాక్. మరి.. ధ్రువ్ విక్రమ్‌కు జోడీగా అనుపమా పరమేశ్వరన్ కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల 15న తమిళనాడులోని తూత్తుకూడిలో ప్రారంభం కానుందని సమాచారం.

జస్ట్ సూపర్ మేన్.. అంతే!

"కథ రాయడం మొదలుపెట్టి, తొలి డ్రాఫ్ట్ పూర్తి చేసేవరకూ నా సినిమాకు 'సూపర్‌మేన్: లెగసీ' అనే టైటిల్‌నే అనుకున్నాను. కానీ ఫైనల్ డ్రాఫ్ట్ పూర్తి చేశాక 'లెగసీ'ని వదిలేద్దామని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా సినిమా టైటిల్ జస్ట్ 'సూపర్‌మేన్'... అంతే. మా ఈ సూపర్‌మేన్ వచ్చే ఏడాది జూలై 11న మీ ముందుకు వస్తాడు'' అని సామాజిక మాధ్యమాల ద్వారా దర్శకుడు జేమ్స్ గన్ పేర్కొన్నారు. సూపర్‌మేన్ క్యారెక్టర్‌తో ఇప్పటివరకూ 'సూపర్‌మేన్' ఫ్రాంచైజీలను నిర్మించిన డీసీ స్టూడియోస్ తాజా సూపర్‌మేన్ చిత్రాన్ని నిర్మించనుంది. అయితే సూపర్‌మేన్‌ని కొత్త రకంగా చూపించనున్నారు జేమ్స్ గన్. ఇప్పటివరకూ వచ్చిన చిత్రాల్లో సూపర్‌మేన్ ధరించిన సూట్‌కి భిన్నంగా తాజా చిత్రంలోని సూపర్‌మేన్ సూట్ ఉంటుందట. కాగా ఈ మధ్యకాలంలో సూపర్‌మేన్ అంటే నటుడు హెన్రీ కవిల్ గుర్తొస్తారు. 2013 నుంచి 2021 వరకూ డీసీ స్టూడియోస్ నిర్మించిన సూపర్‌మేన్ చిత్రాల్లో టైటిల్ రోల్‌లో అద్భుతంగా ఒదిగిపోయారు హెన్రీ. కానీ, తాజా చిత్రంలో ఈ పాత్రను డేవిడ్ కోరెన్స్‌వెట్ చేయనున్నారు. "సూపర్‌మేన్ జీవితంలోని పూర్వ భాగంపై ఈ చిత్రం ఉంటుంది. ఈ పాత్రను హెన్రీ కవిల్ చేయలేడు. అందుకే డేవిడ్ కోరెన్స్‌వెట్‌ని తీసుకున్నాం'' అని జేమ్స్ గన్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటి వరకూ మూడు నాలుగు చిత్రాల్లో మాత్రమే నటించిన 30 ఏళ్ల డేవిడ్ కోరెన్స్‌వెట్‌కి 'సూపర్‌మేన్' చాన్స్ రావడం అనేది గొప్ప విషయం అని హాలీవుడ్ అంటోంది.



• డేవిడ్ కోరెన్స్‌వెట్

కాశీలో క్లాప్



• తమన్నా, సంపత్ నంది

ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్టశక్తుల నుంచి ఏ విధంగా రక్షిస్తాడు? అనే ప్రధాన ఇతివృత్తంతో తెరకెక్కుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఓదెల 2'. 2022లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. ఇందులో తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ పై డి. మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్ నంది క్రియేటర్‌గా ఉన్న ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో జరిగింది. రెగ్యులర్ షూటింగ్‌ని కూడా కాశీలోనే ఆరంభించారు. తొలి సీన్‌కి సంపత్ నంది క్లాప్ కొట్టారు. "ఓదెల 2' గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ చిత్రకథ ఉంటుంది. క్యాస్టింగ్, కథ, వీఎఫ్ఎక్స్.. టోటల్‌గా మేకింగ్ పరంగా ఈ చిత్రం పెద్దగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్. ఎస్.

కొత్త పాయింట్‌తో తీశారనిపిస్తోంది

- రాజేంద్ర ప్రసాద్



• ఆయూషీ పటేల్, రాజేంద్ర ప్రసాద్, విశ్వ కార్తికేయ

విశ్వ కార్తికేయ, ఆయూషీ పటేల్ జంటగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో..'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డా. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– "కలియుగం పట్టణంలో..' టైటిల్ కొత్తగా ఉంది. కొత్త పాయింట్‌తో ఈ చిత్రం రాబోతోందని అర్థం అవుతోంది. నా 'ఆ నలుగురు' సినిమాలో అప్పడాలు అమ్మి పెట్టడంలో నా గురువుగా ఆరేళ్ల వయసులోనే విశ్వ కార్తికేయ నాతో పాటు నటించాడు. ఇప్పుడు హీరోగా నటించాడు. ప్రేక్షకులు ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి. ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' సినిమాలో ఓ రోల్ చేస్తున్నాను'' అన్నారు. "మదర్ సెంటిమెంట్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసి ఈ సినిమా తీశారు. చిత్రా శుక్లా ఓ స్పెషల్ రోల్ చేశారు'' అన్నారు విశ్వ కార్తికేయ. "మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు రమాకాంత్ రెడ్డి. "మా టీజర్, ట్రైలర్‌ను చూసి కథను అంచనా వేయలేరు. సినిమా అంత కొత్తగా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణను కడపలోనే చేశాం'' అన్నారు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి. "సినిమా అంతా కడపలోనే తీయడం ఇదే తొలిసారి. కడప నుంచి ఓ మంచి నిర్మాత రాబోతున్నాడు'' అన్నారు దర్శకుడు నీలకంఠ.

ఎనిమిది భాషల్లో రికార్డు బ్రేక్



• కాశీ విశ్వనాథ్, చదలవాడ శ్రీనివాసరావు

నిహార్, నాగార్జున, రగ్ధా ఇఫ్తాకర్, సత్యకృష్ణ, కాశీ విశ్వనాథ్ ముఖ్య తారలుగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పై చదలవాడ పద్మావతి నిర్మించిన చిత్రం 'రికార్డు బ్రేక్'. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో 8 భాషల్లో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'మళ్లీ పుట్టి వచ్చినవా..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సాబు వర్గీస్ సంగీత సారథ్యంలో వరికుప్పల యాదగిరి ఈ పాటకు లిరిక్స్ అందించి, పాడారు. "అందరికీ నచ్చేలా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు చదలవాడ శ్రీనివాసరావు.